UNIVERSAL
LIBRARY
OU_206110
UNIVERSAL
LIBRARY

OUP—751—28-4-81—10,000.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T349 S46 S94M Accession No. T4757

Author [illegible]

Title [illegible]

This book should be returned on or before the date last marked below

శ్రీ గురుభ్యో నమః

మహాభారత

LIBRARY

వేదవ్యాసనిందానిరాకరణము

ద్వితీయభాగము.

'బాలవ్యాస, తర్క, వ్యాకరణ, వేదాన్త కేసరి'

వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రిగారిచే

రచియింపబడి,

భట్లపెనుమర్రు గ్రామస్థాపిత శ్రీ శారదాముద్రణాలయమునందు
ముద్రింపబడి,

బులుసు వెంకటశాస్త్రిచే ప్రకటింపబడియె.

ప్రతులు: 1000.

24—8—1948

సర్వస్వామ్యసంకలితము]

మూల్యం: **1—4—0**

ద్వితీయముద్రణాదిసర్వాధికారములు గ్రంథకర్తవే.

ప్రథమ, ద్వితీయభాగములు విక్రయమునకు సిద్ధముగా నున

గ్రంథప్రాప్తిస్థానము:—

వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రిగా
పిఠాపురం, తూర్పుగోదావరిజిల్ల

J 4759

రాబోవు భాగము:— శ్రీకృష్ణనిందానిరాకరణ:

విషయసూచిక.

1. వేదవ్యాసనిందానిరాకరణము. 133

2. వాల్మీకి నిషాదత్వనిరాకరణము. 134

3. వేదవ్యాసనిషాదత్వనిరాకరణము 140

4. సత్యవతీదేవి క్షత్రియయే. 143

5. వ్యాసుడు చండాలజాతిజుడనుప్రసంగము–తన్నిరాకరణము 150

6. నిషాదుడైన వ్యాసునకు బ్రాహ్మణసంస్కారము లను ప్రసంగము—తన్నిరాకరణము 154

7. వ్యాసు డంబికాదులయందు ప్రవర్తించుటచే దోషి యను ప్రసంగము— తన్నిరాకరణము 155

8. భీష్మునకు వితంతూద్వాహప్రేరణమను ప్రసంగము— తన్నిరాకరణము. 161

9. వ్యాసుడు పూతిగంధు డను ప్రసంగము–తన్నిరాకరణము 172

10. వ్యాసుడు మరొకప్పుడును స్త్రీలోలుడే అనుప్రసంగము— తన్నిరాకరణము 180

11. ధర్మమును క్రిందుగా నిరూపించినవాడు వ్యాసు డను ప్రసంగము—తన్నిరాకరణము 187

12. కర్ణోత్పత్తిప్రస్తావము. 188

13. కర్ణోత్పత్తిని గూర్చి రహస్యకర్తలవాదము–తన్నిరాకరణము 195

14. కుంతీసత్యవతుల కన్యాత్వము. 202

15. కాశీప్రభువు వ్యాసుని కాశీనుండి తరిమె ననుప్రసంగము– తన్నిరాకరణము 206

16. పతిలోకము కలుగునని నమ్మించి దుర్యోధనాదుల భార్యలను వ్యాసుడు గంగలో ప్రవేశింపజేసె ననుప్రసంగము —తన్నిరాకరణము. 213

17. వ్యాసుడు పాండవపక్షముగా వ్రాసిన జయమును సంజయునకు గూడ జూపలేదను వాదము—తన్నిరాకరణము 225

18. వ్యాసుడు సంకీర్ణజాతీయుడగుటచే సంకీర్ణజాతీయులగు పాండవులకు దోడ్పడె నను ప్రసంగము—తన్నిరాకరణము 230

19. వేదవ్యాససంకీర్ణజాతీయతానిరాకరణము. 238

20. బీజప్రాధాన్యక్షేత్రప్రాధాన్యవ్యవస్థ 242

21. వ్యాసుడు భారత మన్యాయముగా వ్రాయుటచే చింతించి భాగవతము రచించె ననుప్రసంగము—తన్నిరాకరణము 247

22. దుర్యోధనస్వర్గనరకపాండవవృత్తాంతము 253

23. సంస్కృతాంధ్రభారతములు సుయోధనాపకర్షముగా రచింపబడినవను ప్రసంగము—తన్నిరాకరణము 258

24. వ్యాసాదులు దుర్యోధనునిపైగల యీర్ష్యను గాంధారిపై గూడ దొరలించిరను ప్రసంగము— తన్నిరాకరణము 260

25. గాంధారీపుత్త్రుల కపార్థము నిచ్చెడి నామములను వ్యాసాదులే పెట్టిరను ప్రసంగము— తన్నిరాకరణము 266

26. పరాశరుడే సమస్తపురాణప్రవర్తకుడు కాని కృష్ణద్వైపాయనుడు కాడనుప్రసంగము—తన్నిరాకరణము 267

27. బ్రహ్మసూత్రకర్త కృష్ణద్వైపాయనుడు కాడను ప్రసంగము— తన్నిరాకరణము 269

28. వ్యాసభగవానుని ఘనత 271

29. ప్రతివాదివైఖరి 272

శ్రీగురుమూర్తయే నమః.

శ్రీ పాండవ పట్టాభిషేక మహోత్సవము.

పీఠికాపుర పౌరప్రశంస.

చ. కరము నుతింతు నిట్టి కలికాలమునన్ నయితంబు పీఠికా
పురజను లిట్లు దీక్ష గొని, పూర్తిగ భారతరూపవేదమున్
బరమవివేకబుద్ధి సముపాసన సేసి తదంతరార్థముల్
కరబదరంబుగా నెఱుఁగఁగల్గిన తత్సుకృతాతిరేకమున్.

సీ. దేవతాభక్తి నిర్జీవమై యల్లాడ
వర్ణాశ్రమస్థితుల్ పఱదఁ గలియ
దాంపత్యధర్మముల్ తరలిపోవఁగ-ముండ్ల
కంచెల వేదమార్గములు చెడఁగ
స్మృతివాఙ్మయము దుర్వ్యవృత్తులఁ గ్రుంగఁగ సం
కరకులులకు బుధస్థాన మబ్బ
వంచనానిపుణులంపు వాచంయములకు గాఁగ
నాత్మబుద్ధి ప్రమాణమై తనర్ప

గీ. దినదిన మ్మిట్టు చెలరేఁగ దెసలు గ్రమ్మ
కొను కలివిలాసమున కోటగొనక, భార
తీయధర్మము నెలయించితిరి ప్రశస్తి
పాత్రముగఁ బీఠికాపురీపౌరులార!

శా. బాలవ్యాసుఁడు వారణాసికులసుబ్రహ్మణ్యదోషజ్ఞచూ
డాలంకారము వత్సరత్రయ మఖండశ్రద్ధఁ బ్రత్యక్షరం
బాలోకించుచు దుర్విమర్శములఁ బాయందోఁచి, బోధింపమీ
రాలింపన్ గనినారు భారతము నాహా యెంత పుణ్యాత్ములో!

సీ. చదివె వ్యాకరణశాస్త్రము మహాభాష్యాంత
ముగ సూర్యబుధచంద్రముని భజించి
న్యాయశాస్త్రంబు నధ్యయనించె లక్ష్మన్నృ
సింహపండితసింహు శిష్యుఁ డగుచు
నాపోశనించె వేదాంతామృతాంభోధి
దెందుకూరినృసింహధీరుఁ గొలిచి
తనయంత లేసి వారినిగ దిద్దెను శత
సంఖ్య శిష్యుల సర్వశాస్త్రములను
గీ. సహజశమదమశౌర్యాదిసద్గుణగణ
శాలి యైన సుబ్రహ్మణ్యశాస్త్రిమాలి!
యట్టి మహనీయు దయ భారతామృతంబు
నానితిరి పీఠపురవాసులార! యౌర!

శా. కుంతీమాధవకుక్కుటేశ్వరులు సాక్షుల్గా మహాభారత
స్వాంతం బారసి "ధర్మ మిద్ది" యని సుబ్రహ్మణ్యవిద్వాంసుఁ డా
వంతే స్వార్థ మెఱుంగ కన్వహము నోరారంగ బోధింప, న
శ్రాంతాసక్త్యము శ్రోత్రమానసములన్ రాజిల్లు టబ్రం బకో!

శా. భద్రేభంబున సల్పి, పాండవులఁ, దల్పట్టాభిషేకంబు భ
క్త్యుద్రేకంబున సల్పి, భారతరహస్యోద్ఘాటనాసక్తి దమో
నిద్రాముద్రితమైన భారతమహిన్ మేల్కొల్పి రత్యాస్థ నీ
భద్రాచారులు పీఠికాపురజనుల్ పాత్రుల్గదా ఖ్యాతికిన్.

శా. కుంతీదేవికి ద్రౌపదీసతికి అంకుల్ గట్టి "ధర్మాత్మజో
దంతం బంతయు ధర్మపూర మనియున్ ధర్మంబు దుర్యోధనో
దంతం" బంచును భారతీయులకు ముందాటంబు చేకూర్చ ధీ
మంతుల్ భారతమున్ గలంచ యెటు నిర్మందాత్ములై యుందురో!

ఉత్పలమాలిక.

"భారతనాయకుల్ దురితవర్తను, లందఱి నాయకుల్ సదా
చారవిదూర"లంచు మది శంకల, ఖ్యాతిని గాంచ నెంచి, పెం
పారు స్వజాతి కెన్నఁటికి నాఱని ఘోరకళంక మేమొ యం
చారయు లేక సత్యము బయల్పడఁ జెప్పు మిషంబుతో మహా
భారతమున్ దురర్థముల పాలొనరించి,-జగన్నిదాన మా
తేఱున ధర్మమార్గముల దిద్దిన వ్యాసునిఁ గాలఁ ద్రోయుచుఁగాఁ
దీరిచి-దేవుఁగా ననుమతించి సమగ్రజనుల్ భజింప నా
ధారముగా నరాకృతి నవతారము నొందిన వాసుదేవు సా
ధారణహీనమర్త్యునిగ ధర్మవిదూరుఁగఁ వక్రబుద్ధిగా
జారునిగా లిఖించి, కలుషక్రియులైన సుయోధనాదులన్
'ధీరులు ధర్మవీరు' లని నిర్ణయమున్ బచరించి యక్కటా!
భారతమాతృపుత్రులము, భారతవాక్య ప్రమాణ మౌను మా
కారయు, భారతక్షితి నిరంకుశ సాహసదోహలంబు, మా
భారతజాతి యుత్తమము భారతశిల్ప మనల్ప మంచుఁ జాం
గారెదు శ్రామ్య్మ గ్రుద్దుకొను చస్వాహమున్ సభలందు వాక్పము
తాకరముఁ జూపి యజ్ఞజనతత్సమయోచితమోదవాక్పుర
స్కారము జాఱఁ దామును విచక్షణులైనక్రియన్ సుధీతిర
స్కారము సేసి, ఘోరకలికాలమహత్త జయంబు గాంచి ల
జ్జారహితప్రవృత్తు లయి జాతికి నీతికి ఘాత గూర్చు దు
ర్వారదురంతచింతనులు పాలయి నీరసపడ్డ భారతో
దారచరిత్రవాస్తవికతన్ గజరాజమునందు నిల్పి, భే
రీరవముల్ దెసల్ గమిచి మ్రోంగఁగ 'సత్యు' మటంచుఁ జాటి, త
ద్భారతకీర్తిపైఁ బడిన పాంసువు లూర్చి, పటీరసారమం
దారసుమార్హణాంబుల యథాస్థితి మించ వెలార్చి, ధర్మర

తూరుచి నేర్చి లోకుల ప్రశంసలఁ గాంచిన పీఠికాపురీ
పౌరుల వారి కొజ్జ లగుపండితులన్ హితులన్ నుతింప శ
క్లూరక యేఁగఁ జాలుదు? నహో మును కుక్కుటలింగమూర్తి క
వ్వారిగ నూఱుఘుస్రములు భక్తి నొనర్పరె కోటి బిల్వప
త్త్రిరచితార్చనంబుల? సమృద్ధిగ షడ్రసయుక్తభుక్తినా
నూఱు దినంబు లందఱు మనుష్యుల దన్పరె? వారణాసిప
ద్వారణరాజుచే దశరథక్షితిపాత్మజవృత్తకావ్య మిం
పారఁగ నాలకించి ముదితాత్ములరై మణిమండితంబు బం
గారపు సింహకంకణయుగంబును గాన్కగ నిచ్చి, గొప్పస
త్కార మొన్పరే? మఱియు గాటపు భక్తిని నేఁడు నమ్మహో
దారు ననర్ఘ్యకమ్రకనకాంబరభూషితుఁ జేయలేదె? యె
వ్వారలయందు నేని గనవచ్చున యింతటి యాస్తికత్వ, మీ
తెఱగు దైవభక్తియు సుధీజనరక్తియు ధర్మసక్తియున్?
భారతదేశ మెల్ల నొకనాటికి నేనియు వీరిఁ గాంచి యీ
దారిని బట్టి ధర్మసుకృతంబుల ధన్యతఁ గాంచు నంచు ని
ర్ధారణ మాచరింపఁ గలధైర్యము గంటి సపుత్రపౌత్రులై
వీరలు ధర్మమార్గమును వీడక పాఁడియుఁ బంటలున్ సిరుల్
తోరముగాఁగ వర్ధిలుత ధూర్జటి కుక్కుటనాథు సత్కృపన్

పీఠికాపురము.
సర్వజిన్మాఘశుద్ధ
ఏకాదశీశనివారము.

ఇట్లు.
'విద్వాన్, కవితాభూషణ'
వెంపరాల సూర్యనారాయణశాస్త్రి.

శ్రీ గురుభ్యో నమః

మహాభారతతత్త్వకథనము.

వేదవ్యాసనిందానిరాకరణము.

"రామా దపి సౌభాగ్యగుణైః శ్రియోఽస్తు
వ్యాసో ముని శ్శ్రీదయితావతారః ।
వినిర్మితో యేన పరార్థ మేవ
భవార్ణవే భారతసేతుబన్ధః ॥"
(మహాకవి రమరచంద్రసూరిః)

"యథేచ్ఛం యాః కృతా నిన్దాః కైశ్చి ద్వ్యాసమునీశ్వరే ।
తన్నిరాకరణం కుర్మః ప్రమాణై రుపపత్తిభిః" ॥

— ♦ వేదవ్యాసనిందానిరాకరణము ♦ —

వేదవ్యాసమహర్షిని గూర్చి మ. భా. చ. కారుల వ్రాత యిట్లున్నది.

"బ్రాహ్మణునకు శూద్రస్త్రీయం దుద్భవించినవాడు నిషాదుడు, లేక పారశవుడు. అను వనులోమజాతీయు డగు నని మనుస్మృతిలో గలదు. నిషాదుడే చండాలు డని అమరకోశమున గలదు. నిషాదుడు బోయజాతిలో నొక తరగతివా డని వేఱు నిఘంటువులలో గలదు. వాల్మీకిమహర్షి ఆతరగతినిషాదుడే అని ధర్మఖండాదులలో గలదు. వ్యాసుని తండ్రి బ్రహ్మర్షి యగు పరాశరుడు. తల్లి దాశకన్య. కాన వీరికి బుట్టిన వ్యాసుడు నిషాదుడు. లేక పారశవుడై యుండును. జన్మముచే బారశవుడైనను నిషాదు

డైనను కృష్ణద్వైపాయనుడు, వాల్మీకి అనువారు కర్మములచే తప స్సుచే వేదర్షులు, మహాకవులు నైరి. జన్మముచే బ్రాహ్మణు డైన గాని వేదర్షి కాడని చెప్పుట వెఱ్ఱి. ఒకవేళ వ్యాసుడు జన్మముచే బ్రాహ్మణు డని త్రికమకపడి సాధించినను వాల్మీకిని జన్మముచే బ్రాహ్మణు డని సాధింప శక్యముకాదు. (146 పు.)

ఈప్రతివాదిప్రసంగములో వాల్మీకిమహర్షి నిషాదుడే అను విషయముపై ముందు ప్రస్తావింతము.

—♦ వాల్మీకి నిషాదత్వ నిరాకరణము ♦—

వాల్మీకిశబ్దార్థనిర్వచన మిట్లున్నది.

గోవిందరాజీయవ్యాఖ్యానము—

ఉక్తంచ బ్రహ్మవైవర్తే—

అథాబ్రవీ న్మహాతేజా బ్రహ్మా లోకపితామహః।
వల్మీకప్రభవో యస్మా త్తస్మా ద్వాల్మీకి రిత్యసౌ ॥

ఈవచనము, వల్మీకభవుడగుటచే వాల్మీకి యయ్యె నని చెప్పు చున్నది. బ్రాహ్మణునకు శూద్రస్త్రీయం దుద్భవించినవాడు నిషా దుడు అని ప్రతివాదులు అనుచున్నారు. అట్టినిషాదత్వము వల్మీకసంభ వుడైన వాల్మీకియం దుండు టెట్లు? నిషాదశరీరము వేరు. వాల్మీకిశరీరము వేరు. కనుక వాల్మీకిత్వనిషాదత్వములు విరుద్ధధర్మములు. వాల్మీకి నిషాదుడే అని ధర్మఖండాదులలో గలదందురా? అట్లు లేదు. వాల్మీకి బ్రహ్మర్షి యనియు విప్రు డనియు ద్విజు డనియు నున్నది విజయుడను వాడు నిషాదుడని యున్నది. విజయుడు నిషాదుడని యున్నపుడు ఆవి జయుడే తుదకు వాల్మీకి యయ్యెనుకనుక వాల్మీకిని నిషాదు డని చెప్పి నట్లే యని భావింపరాదు. వాల్మీకి తపోవినిహతపూర్వదేహుడై తేజ

రిల్లె నని యాగ్రంథము చెప్పుచున్నది. అట్లు నిషాదశరీర మంతరింప వాల్మీకిస్వరూప మావిర్భూతమైనందున వాల్మీకిని నిషాదుడనుట తప్పు. ఈదరపల్లి భవానీశంకరకవిచే నాంధ్రీకరింపబడిన ధర్మఖండమందలి కథాసందర్భ మెట్లున్నదో చూడుడు—“విజయుడను నిషాదు డొకడు క్రూరుడై చౌర్యవృత్తి నవలంబించి యరణ్యమందు గాచియుండ దన పూర్వజన్మ సుకృతపరిపాకవిశేషమున నాతనికి వసిష్ఠాదిమునిపుంగవులు గోచరించి కొన్నివిషయము లుపదేశింపగా తన్మూలమున నాతడు తనదుర్వ్యాపారములు గర్హించుకొనుచు, సంసారవిరక్తుడై నా కొక మంత్ర ముపదేశించి రక్షింపు డని వేడుచు నిర్బంధింప వసిష్ఠమహర్షి యీతనికి మంత్రోపదేశ మెట్లని ధ్యానించి ఆసమయమున తనకు స్ఫురించిన ప్రకారము వ్యత్యస్తరామమంత్ర ముపదేశింపదలంచి—

ఆ. చోర! చోర! రార సుగుణోత్తరుండవు
మంత్ర మొసగువాడ మసల కెపుడు
జపము చేసెదేని యపవర్గ మొనవు నీ
కనిన వాడు ప్రముదితాత్ము డగుచు.

వ. నమస్కరించి యిట్లనియె.

క. గురువర! నీసత్కరుణా
గరిమన్ భవసాగరంబు గడిచెద మును సా
గరతరణం బొనరించిన
హరిసేవకుడైన హనుమదాఖ్య కపికరణిన్.

వ. అనిన విని వసిష్ఠుండు తనమనంబున నిట్లని వితర్కించె.

చ. ధనహరణార్థబుద్ధియగు తస్కరు డీగతి బల్కువాడె సాం
పున మునిరీతి వీని మది బూని విరక్తి జనింపబోలు నె

మ్మనమున నున్న చందములు మాటలచే నెఱుఁగంగ బోఁడి యీ
ఘను డుపదేశపాత్రు డగు గామితసిద్ధియు నబ్బు వీనికిన్.

క. పాపాత్ములకుం బశ్చా
త్తాపం బుదయించెనేని తత్పాపంబుల్
రూపఱు చిత్తము విమలత
బ్రాపించు ననారతంబు భద్రము లొదవున్.

ఇట్లనుకొని మునీంద్రు డామంత్ర మాచోరున కుపదేశించెను.

శా. చోరుం డీగతి మంత్రలబ్ధి గని సంశుద్ధాత్ముఁడై యత్తఱిన్
వైరాగ్యంబున సర్వవస్తువితతుల్ వర్జించి నిస్సంగుఁడై
ప్రారబ్ధాశుభకర్మసంహతుల బాయన్ మీఱి నిర్దంభతన్
ప్రారంభించె దపంబునల్ప సుజనవ్రాతంబు లోహో! యనన్.

వ. అనుదినంబును త్రిషవణస్నాయియు, యతవాక్కాయమానసుం
డును, సర్వభూతదయాయుక్తుండును, అధశ్శాయియు, జితేం
ద్రియుండును నగుచు ఫలమూలజలపర్ణానిలశాకభక్షణంబు లొన
రింపుచు నియతాహారుండై ... బాహ్యంబు మఱచి పవనంబు
బంధించి తపంబు సలుపుచుండె. ...

క. ఖగములు శిరమున గూళ్ళిడ
మృగములు శృంగముల గ్రుమ్మి మేనుల నొరయన్
నగముగతి కదల కాతడు
జగములు భీతిల్ల దపము సలుపగ దొడగెన్.

తే. గీ. పులకపంక్తులు చీమలు మక్షికములు
కరచి రక్తంబు గ్రోలుచు నెఱచి దినగ
జర్జరితగాత్రు డయ్యు నిశ్చలత నతడు
సద్గురూక్తక్రమంబున జపము సేయు.

తే. గీ. అట్లు శ్రీరామమంత్రాశ్రితాత్ముఁ డగుచు
దపము గావింప బెక్కువత్సరము లరిగె
బోయె బెక్కు యుగాంతరంబులు ననేక
దివ్యవర్షాయుతములు నతిక్రమించె.

వ. ఇట్లాతఁడు నిశ్చలతఁబూని చేయు దపము గని భీతుఁడైన యింద్రుని తోఁ బృహస్పతి యిట్లనెను.

తే. గీ. అతని కత నీకు భయమేల యమరరాజ!
అతఁడు వల్మీకమున బుట్టి యతులతేజ
మమర వాల్మీకి యనగ బ్రహ్మర్షి యగుచు
వెలసి రామాయణము సేయగలఁడు సుమ్ము.

వ. అది విని యింద్రుం డిట్లనియె.

ఆ. తనదు మేనితోడ మనుజుఁ డచ్చెరువుగ
నెట్లు పుట్టుబుట్టు నిదియుగాక
బహుళజన్మదుర్లభం బగు విప్రత్వ
మెట్లు గలుగు నతని కెఱుగజెపుమ.

వ. అన విని యాబృహస్పతి యిట్లనియె.

ఉ. చీమలు పాము లీగలును జేరగ జెందగరాని యట్లుగా
నామహితాత్ము మేనిపయి నావరణంబుగ నొక్కపుట్ట శ్రీ
రాముఁ డొసర్పు భక్తజనరక్షణదక్షుఁడు గాన వాతవ
ర్షామితబాధ నొంద కత డందు వసించు ననేకవర్షముల్.

తే. గీ. అతఁడు కారణదేహపర్యంతి మట్ల
దగ్ధకల్మషుడై యందు దపము సల్పి

యంత గ్రిమ్మర దివ్యదేహంబు దాల్చి
పుట్టుబ్రిహ్మర్షి యగుచు నప్పుట్టయందు.

తే. గీ. పన్నితక్కువహేమంబు వహ్నియోగ
మహిమ గుందన మగుగతి మహితరామ
మనుజపంబున నఘకదంబములఁ బోలి
యాపులిందుడు ద్విజు డగు నమరవర్య.

వ. అట్లుచ్చోరుండు తపంబు సేయుచుండ ననేకమన్వంతరంబులు గడ
చిన యనంతరంబ...(ఒకప్పుడు నారదపురస్కృతులై వసిష్ఠా
దులు) ఖనిత్రిప్రముఖసాధనంబులు గొని వల్మీకప్రాంతంబునకు
నరిగి చిరకాలావృతంబైన యప్పుట్టం గ్రొచ్చి యందు.

సీ. పుటపాకశోభితభూరిప్రభాసాంద్రు
నజినవల్కలనిచయావృతాంగు
బాటలస్ఫుటజటాపటలాభిశోభితు
రామనామామృతరమ్యరసను
సద్గురువరపాదజలజార్పితేక్షణు
దీప్యమానానలదివ్యతేజు
నవిదితబాహ్యలోకానీకవర్తను
శ్రీరామచరణాబ్జచింతనాత్ము

తే. గీ. బద్ధపద్మాసనస్థు దపఃప్రదీప్తు
మునివరు నొకని గాంచి యమ్మునులు వివిధ
విధుల బోధించి వినివి రాద్విజుడు వారి
పలుకు వినడయ్యె నిశ్చలభావమునను.

వ. వసిష్ఠమునిచంద్రుం డమ్మునీంద్రు నిరీక్షించి.

క. దేశికుడం జను దెంచితి
నోశిష్యుడ పూజసేయు మొగి భద్రము నీ

కామగతి గల్గు నాయుప
దేశమునను దపము సల్పితివి నిష్ఠమెయిన్.

క. అని పల్కిన నమ్మునియు న
యనయుగళము దెఱచి లేచి యభివాదనము
బ్బున జేసి యోగివరూత్తమ
ఘనపుణ్యుడ నైతి మిమ్ము గాంచుట కతనన్.

వ. అని పల్కె నానమయంబున భగవంతుండైన వసిష్ఠమునీంద్రుం
డతనికిం బ్రచేతసునిచేత వేదోక్తక్రమంబున జాతకర్మాద్యఖిలసం
స్కారంబులు సేయించి శ్రీపూర్వకంబుగా రామనామమంత్రం
బుపదేశించిన నవ్వాల్మీకియుం దపోవినిహతపూర్వదేహుండును,
గృతకృత్యుండును నై నిర్మలత్వంబునం దేజరిల్లి...యిట్లనియె"

ఇదియే ప్రతివాదులు తమమాటకు ప్రమాణముగా జూపిన
ధర్మఖండములోని కథ ఇందున్న దొకటి. ప్రతివాదు లన్నదొకటి.

ఈగ్రంథములో నింద్రబృహస్పతిసంవాదమున నున్న విషయ
ములు గమనింపదగినవి—"అతడు కారణదేహపర్యంతము దగ్ధకల్మ
షుడై యంత గ్రమ్మర దివ్యదేహంబు దాల్చి పుట్టుబ్రహ్మర్షి యగుచు
నప్పుట్టయందు వన్నెతక్కువ హేమంబు వహ్నియోగమహిమ గుం
దన మగు గతి నాపులిందుడు ద్విజు డగు నమరవర్య" అని యుండుట
చేతను, కడపటి వచనములో 'తపోవినిహతపూర్వదేహుడు' అని చెప్ప
బడుటచేతను, నిషాదుడైన విజయుని శరీరము తపోవిశేషముచే నిహ
తము కాగా మరల దివ్యదేహము దాల్చి బ్రహ్మర్షియై వాల్మీకి పుట్టె
ననియు, వన్నెతక్కువహేమము వహ్నియోగమున కుందనమైనట్లు
ఆవిజయుడు తపోవిశేషమున బ్రహ్మర్షి యగుట యుపపన్న మనియు
బోధింపబడినది. ఇట్టిస్థితిలో కుందనమును వన్నెతక్కువబంగార మని

యెట్లనరాదో అట్లే బ్రహ్మర్షియైన వాల్మీకిని నిషాదుడనరాదు. కనుక 'వాల్మీకిమహర్షి నిషాదుడే యని ధర్మఖండాదులలో గలదు' అను ప్రతివాదుల మాట పరాస్తమైనది. 'వాల్మీకిని జన్మముచే బ్రాహ్మణు డని సాధింపశక్యముకాదు' అను మాటకూడ ప్రహతమైనది.

'వసిష్ఠమునీంద్రు డతనికి ప్రచేతసునిచేత వేదోక్తక్రమంబున జాతకర్మాద్యఖిలసంస్కారంబులు సేయించె' నని చెప్పబడుటచే వాల్మీకిది జన్మాంతర మనియు వైదికసంస్కారము లన్నియు ప్రచేతసు నిచే బొందుటవలన వాల్మీకి ప్రాచేతసు డయ్యె ననియు స్పష్టమైనది.

'జన్మముచే బ్రాహ్మణు డైనగాని వేదర్షి కాదనుట వెఱ్ఱి' అని వ్రాసిన ప్రతివాదుల కెంతవెఱ్ఱియో! వేదవ్యాసుడు, వాల్మీకి జన్మ ముచే బ్రాహ్మణులే యగుచుండ వాల్మీకి జన్మముచే బ్రాహ్మణుడే యని వారు పేర్కొనిన ధర్మఖండమే నిరూపించియుండ నట్లు వ్రాసిన ప్రతివాదులకు వెఱ్ఱియా? బుద్ధియా?

ఇక దీనిని విడిచి వేదవ్యాసమహర్షియందు ప్రతివాదు లారో పించిన నిషాదత్వమును గూర్చి పరిశీలింతము.

—♦ వేదవ్యాసనిషాదత్వనిరాకరణము ♦—

"బ్రాహ్మణునకు శూద్రస్త్రీయం దుద్భవించినవాడు నిషాదుడు. వ్యాసుని తండ్రి బ్రహ్మర్షి యగు పరాశరుడు. తల్లి దాశకన్య. కాన వీరికిబుట్టిన వ్యాసుడు నిషాదుడు" అని ప్రతివాదుల వ్రాత.

వీరిట్లు వ్రాయుట కాధారము మనుస్మృతివచనము. అది యిట్లున్నది.

బ్రాహ్మణా ద్వైశ్యకన్యాయా మంబష్ఠో నామ జాయతే ।
నిషాద శ్శూద్రకన్యాయాం యః పారశవ ఉచ్యతే॥

కుల్లూకభట్టీయమ్—

> కన్యాగ్రహణా దతో౽ధాయా మిత్యధ్యాహార్యం 'విన్నాస్వేష విధి స్స్మృతః' ఇతియాజ్ఞవల్క్యేన స్ఫుటీకృతత్వాచ్చ బ్రాహ్మణా ద్వైశ్యకన్యాయా మూఢాయా మంబష్ఠాఖ్యో జాయతే. శూద్రకన్యాయా మూఢాయాం నిషాద ఉత్పద్యతే. య స్సంజ్ఞాన్తరేణ పారశవ శ్చోచ్యతే.

దీనినిబట్టి వివాహిత యైనశూద్రకాంతయందు బ్రాహ్మణుని వలన జన్మించినవాడు నిషాదు డని తేలినది. ఇప్పుడు దాశకన్య యనబడుచున్న వ్యాసజనని యగు సత్యవతీదేవి పరాశరునిచే వివాహితయు, శూద్రకాంతయు నైననాడు ప్రతివాదుల మాట నెగ్గును. ఆమె పరాశరునిచే వివాహిత కాదనుట నిర్వివాదము. శూద్రకాంతకూడ కాదు. ఆమె యుత్పత్తి యెట్లు చెప్పబడెనో చూడుడు— ఉపరిచరవసువు వీర్యమును డేగ తీసికొనిపోవునపుడు* యమునానదియం దది పడగా నచ్చట నద్రికయను నప్సరస బ్రహ్మశాపమున మత్స్యమైయుండుటచే నామత్స్యము దానిని గ్రహించెను. అంతట మత్స్యము గర్భధారణ చేసియుండెను. పదవమాసమున దానిని జాలరులు పట్టి తీసి దాని కడుపున స్త్రీపురుషరూపములతో నున్న మనుష్యశిశువుల నిరువుర జూచి యాశ్చర్యపడి యా వసురాజున కాశిశువుల జూపి వీరు మత్స్యశరీరమునుండి సంభవించిన మనుష్యశిశువు లని చెప్పగా నుపరిచరవసువు అందు మగశిశువును గ్రహించెను. ఆశిశువు ధార్మికుడై మత్స్యరాజను ప్రసిద్ధి గాంచెను. ఆడశిశువు మత్స్యముతో సమానమైన వాసన కలిగియున్నది. ఆశిశువును దాశరాజునకు పెంచుకొను మని యిచ్చెను. ఆమె సత్యవతి యనుపేరుతో రూపలావణ్యములు కలిగి గుణవతియై యుండెను. ఆమె మత్స్యవాసన

కలిగియే పితృశుశ్రూషార్థము నావ నడుపుచుండెను. ఈయర్థముగల శ్లోకములు చూడుఁడు—

"శ్యేనపాదపరిభ్రష్టం తద్వీర్య మథ వాసవమ్ ।
జగ్రాహ తరసోపేత్య సాఽద్రికా మత్స్యరూపిణీ ॥
కదాచి దపి మత్స్రీం తాం బబన్ధు ర్మత్స్యజీవినః ।
మాసేచ దశమే ప్రాప్తే తదా భరతసత్తమ ॥
ఉజ్జహ్రు రుదరా త్తస్యాః స్త్రీం పుమాంసంచ మానుషమ్ ।
ఆశ్చర్యభూతం తద్గత్వా రాజ్ఞోఽథ ప్రత్యవేదయన్ ॥
కాయే మత్స్యా ఇమౌ రాజన్ సంభూతౌ మానుషావితి ।
తయోః పుమాంసం జగ్రాహ రాజోపరిచర స్తదా ॥
స మత్స్యో నామ రాజాసీ ద్ధార్మిక స్సత్యసంగరః ।
సా కన్యా దుహితా తస్యా మత్స్యా మత్స్యసగన్ధినీ ॥
రాజ్ఞా దత్తాచ దాశాయ కన్యేయం తే భవిష్యతి ।
రూపసత్త్వసమాయుక్తా సర్వైః స్సముదితా గుణైః ॥
సాతు సత్యవతీనామ మత్స్యఘాత్యభిసంశ్రయాత్ ।
ఆసీ త్సా మత్స్యగంధైవ కంచిత్కాలం శుచిస్మితా ।
శుశ్రూషార్థం పితు ర్నావం వాహయన్తి జలేచ తామ్ ।

(ఆది 63 అ)

ఈగ్రంథసందర్భమునుబట్టి వసురాజు వీర్యమున మత్స్యోదరమునుండి జన్మించిన సత్యవతీదేవిని శూద్రకాంత యను టెట్లు? ఆమె శూద్రకాంత కానపుడు వ్యాసమహర్షి నిషాదుఁ డగు టెట్లు? కనుక ప్రతివాదుల మాట పరాస్తమైనది. ఇక సత్యవతీదేవి క్షత్రియ యను వాదమునకు ప్రతివాదుల యాక్షేపములు కొన్ని కలవు. వానిని జూతము—

—♦ సత్యవతీదేవి క్షత్రియయే ♦—

"ఆమెక్షత్రియయే యైనచో పల్లెవానికి వసురాజు పెంపకమున కిచ్చుట యేల? తాను పెంచలేకయా? (పు 150 మ. భా. చ.) అని ప్రతివాదుల యాక్షేపము. ఆమె క్షత్రియ యైనను ఆమె దేహము మత్స్యవాసనకలిగియుండుటవలన నావాసన కలవాటుపడిన దాశుడే యామెను పోషింపదగినవా డని భావించి యావసురాజు దాశున కామెను పెంపకమున కిచ్చె నని సమాధానము.

క్షత్రియయైనచో నామెను దాశుడు తనవృత్తిలో నెట్లు ప్రవర్తింపజేయును?" (పు. 151) అని యాక్షేపము.

దాశుని పోషణములో నానుండుటచే దాశుని వృత్తి యదియే యగుటవలన నాతని శుశ్రూషకై యామె యట్లు చేసియుండె నని సమాధానము.

"వసురాజు వీర్యమున జన్మించుటచే సత్యవతిని క్షత్రియాంగన యందురా? అదియును బొసగదు. వీర్యప్రాధాన్యమునే లెక్కగొనవలసియుండినచో వ్యాసుని వీర్యమువలన బుట్టిన శ్రీశుకుడు మహర్షియు, ధృతరాష్ట్రపాండురాజులు క్షత్రియులు, విదురుడు శూద్రుడు నెట్లయిరి? యిచ్చట వీర్యప్రధానత కాక క్షేత్రప్రాధాన్యమే వచ్చుచున్నది" (పు. 151) అని యాక్షేపము.

ఇచ్చట సత్యవతీదేవి జన్మవిషయమై వీర్యప్రాధాన్యము చెప్పరా దని వ్రాసిన వీరే మరియొకచోట "వ్యాసుడు మొదలగువారు వారితల్లు లేజాతివారైనను బీజప్రాధాన్యతపోవిశేషములచే మహర్షులైరి." (72 పు.)

అని వ్రాసి వీర్యప్రాధాన్యమును సంతతియం దంగీకరించి వ్యాసునియందు వీర్యప్రాధాన్యమును కంఠోక్తిగా జెప్పియేయున్నారు. మరియు తల్లులు భిన్నజాతివారై యున్నపుడే వీర్యప్రాధాన్య మంగీకరించియున్న ప్రతివాదులు తల్లియే లేక మత్స్యోదరమునుండి వసురాజు వీర్యమున జన్మించిన సత్యవతీదేవివిషయమై వీర్యప్రాధాన్యము గ్రహింపరా దనుట చిత్రముగా నున్నది. ఇచ్చట వీ రేక్షేత్రప్రాధాన్యమును చెప్పఁదలఁచిరో!

మఱియు వారిచే శూద్రస్త్రీ యని భావింపబడిన సత్యవతియందు జన్మించిన వ్యాసుని-వారియూహను బట్టి నిషాదు డని చెప్పిన మనుస్మృతి ఆనిషాదునివలన క్షత్రియస్త్రీలయందు జన్మించినవారు క్షత్రియు లగుదు రనియు, శూద్రస్త్రీయందు జన్మించినవాడు శూద్రు డగు ననియు జెప్పెనా?

"యథైవ శూద్రో బ్రాహ్మణ్యాం బాహ్యం జన్తుం ప్రసూయతే।
తథా బాహ్యతరం బాహ్యా శ్చాతుర్వర్ణ్యే ప్రసూయతే॥ (అ 10)

అని యుత్తమజాతిస్త్రీలయందు హీనజాతీయులచే జన్మించినవారు అతిహీనజాతీయు లగుదు రని కదా చెప్పుచున్నది. ఈస్థితిలో ప్రతివాద్యభిప్రాయమును బట్టి నిషాదుఁడైన వ్యాసునివలన జన్మించిన ధృతరాష్ట్రాదులు తల్లి క్షత్రియకాంత యైనను హీనజాతీయులు కాక క్షత్రియు లెట్లయిరి?

అట్లే విదురుని తల్లి శూద్రయైనను నిషాదునివలన జన్మించినపుడు "జాతో నిషాదా చ్ఛూద్రాయాం జాత్యా భవతి పుక్కసః"(అ 10) అనుమనువచనముచే పుక్కసుడు కావలసిన విదురుడు శూద్రు డెట్లయ్యెను?

అట్లు కానపుడు "వ్యాసుని వీర్యమున బుట్టిన ధృతరాష్ట్ర పాండురాజులు క్షత్రియులు, విదురుడు శూద్రుడు నెట్లయిరి? యిచ్చట క్షేత్రప్రాధాన్యమే వచ్చెనుకదా" యనుచు ప్రతివాదు లీదృష్టాంతముతో సత్యవతీదేవికి వీర్యప్రాధాన్యము కాక క్షేత్రప్రాధాన్యమే చెప్పవలె నని యెట్లు ప్రతిఘటింపగలరు?

అట్లు ప్రతిఘటించుటకు దృష్టాంతసిద్ధి గావలెను. ఆ దృష్టాంత సిద్ధికై ధృతరాష్ట్రాదులు ప్రతిలోమజాతులు. (నిషాదసంజాతులు) కారనవలెను. అట్లనుటకు వ్యాసుడు నిషాదుడు కాడనవలెను. అట్లు విషాదుడు కా డనుటకు తల్లి యగు సత్యవతీదేవి శూద్రకాంత కాదనవలెను. అట్లనుటకు సత్యవతీదేవి జన్మమందు వీర్యప్రాధాన్యమే యొప్పుకొని తీరవలెను. కనుక వ్యాసమహర్షి విప్రుడే. సత్యవతీదేవి క్షత్రియయే; అని సమాధానము. వ్యాసమహర్షివలన జన్మించిన ధృతరాష్ట్రాదులయందు క్షత్రియత్వాదులు ఎట్లు? అను విషయము ముందు చర్చింపబడును.

"ఇంతకును మహాభారతమున సత్యవతికి దాశకన్య, దాశేయి, దాశరాజకన్య అను శబ్దములే చెప్పబడినవి. కాని 'వాసవి, వసురాజకన్య' అను శబ్దములు మృగ్యములు" (పు 151) అని యాక్షేపము. వారికి గనబడక యి ట్లనుచున్నారు. కనపరచుట మనధర్మము.

"తత్రాజగామ భగవాన్ బ్రహ్మా లోకగురు స్స్వయమ్ ।
హిరణ్యగర్భ మాసీనం తస్మింస్తు పరమాసనే ॥
పరివృత్త్యాఽసనాద్వ్యాసే వాసవేయః స్థితోఽభవత్ (ఆది. అ 1)
"సాతు సత్యవతీనామ మత్స్యఘాత్యభిసంశ్రయాత్ ।
దృష్ట్వైవ సచ తాం ధీమాన్ చకమే చారుహాసినీమ్ ॥
దివ్యాం తాం వాసవీం కన్యాం రంభోరుం మునిపుంగవః (ఆది.అ63)

పితరః—"అస్మాకం మానసీం కన్యా మస్మచ్ఛాపేన వాసవీమ్ ॥
(ఆది. అ64)

జాతః పరాశరా ద్యోగీ వాసవ్యాం కలయా హరేః ॥
(భాగ-స్క-1-అ4)

ఇత్యాది వాసవీశబ్దప్రయోగములుచాల కలవని సమాధానము.

"వసురాజు రాజైనను అతని వీర్యముచే నేజాలరివనితయందో పుత్రీపుత్రు లుద్భవింప బుత్రు జేకొని మత్స్యాధీశం జేసి పుత్రి కను దాశునకే పెంచ నిచ్చియుండును" (పు152) అనియాక్షేపము

ఆహా! వసురాజు వీర్యము మ్రింగిన మత్స్యమునుండి సత్యవతీదేవి జన్మించె నని గ్రంథమునం దుండ ప్రతివాదుల దృష్టి జాలరివనితయందు ప్రసరించుటకు కారణ మేమో? ఇప్పట్టున "స్వయం మూఢో ఽన్యాంశ్చ వ్యామోహయతి. శాస్త్రార్థసంప్రదాయరహితత్వాత్. శ్రుతహాని మశ్రుతకల్పనాంచ కుర్వన్" అను గీతాభాష్య మందలి శంకరభగవత్పాదుల వాక్యము జ్ఞప్తికి వచ్చుచున్నది. ఆసత్యవతీదేవిని పోషించిన దాశుడైనను ఈప్రతివాదు లన్నట్లనియుండలేదు. 'వసురాజు వీర్యమున జన్మించినది, శంతనుమహారాజు వివాహము చేసికొనదగినది' యనియే చెప్పెను. సత్యవతీవివాహసందర్భములో భీష్ముడు క్షత్రియవర్గమును వెంటబెట్టుకొనివెళ్ళి దాశరాజు నడిగినపుడు అతడిట్లు చెప్పెను—

"కోహి సంబన్ధకం శ్లాఘ్యం మీప్సితం యౌన మీదృశమ్।
అతిక్రామ న్న తప్యేత సాక్షా దపి శతక్రతుః ॥
అపత్యం చైత దార్యస్య యో యుష్మాకం సమో గుణైః।
యస్య శుక్రా త్సత్యవతీ సంభూతా వరవర్ణినీ ॥

తేన మే బహుశ స్తాత పితా తే పరికీర్తితః ।
అర్హ స్సత్యవతీం వోఢుం ధర్మజ్ఞ స్స నరాధిపః ॥ (ఆది. అ100)

జ్ఞానదీపికా—ఆర్యస్య=ఉపరిచరస్య; సత్యవతీం వోఢుమర్హః= ఉచిత ఇత్యన్వయః ॥

ఇచ్చట (అపత్యం చైత దార్యస్య) ఈమె యుపరిచరవసువు యొక్క పుత్రిక అని చెప్పి 'యస్యశుక్రా త్సత్యవతీ సంభూతా' ఎవ్వని వీర్యమువలన సత్యవతి జన్మించినదో అనుటవలన స్త్రీసంబంధములే కయే కలిగెనని స్పష్టీకరింపబడినది. తరువాత ఉపరిచరవసువు ఈమెను వివాహముచేసికొన దగినవాడు శంతనుమహారాజే యని బహుప్రకారముల జెప్పియుండె ననుటచే సత్యవతీదేవి క్షత్రియయే యని ప్రకటింపంబడినది. ఇట్లే-ఆంధ్రభారతము. (ఆది-4అ.)

ఎవ్వనియేని వీర్యంబున నిక్కన్య యుద్భవిల్లె నట్టి యుపరిచరుండను రాజర్షి యీసత్యవతి నొరుల కీవలదు. శంతనునక యిచ్చునది. అనుటం జేసి...యిట్టి సంబంధ మెవ్వరికి బడయ నగు"

మరియు నీపత్రివాదు లొకచోట వ్రాయుచు "సత్యవతి...క్షత్రియుడగు శంతనునివలన చిత్రాంగదవిచిత్రవీర్యు లను క్షత్రియులు పుట్టిరి" (పు72) అనిచెప్పియున్నారు. ఆసత్యవతీదేవినే జాలరివనిత యనియు, శూద్ర స్త్రీ యనియు వాడినారు. ఆమె శూద్ర స్త్రీయేయైన యెడల నామెకు జన్మించిన చిత్రాంగదవిచిత్రవీర్యులు క్షత్రియు లగుట అసంభవము. చూడుడు. మనుస్మృతి. (అ. 10)

"క్షత్రియా చ్ఛూద్రకన్యాయాం క్రూరాచారవిహారవా౯ ।
క్షత్రశూద్రవపు ర్జన్తు రుగ్రోనామ ప్రజాయతే ॥

వ్యా—క్షత్రియా చ్ఛూద్రకన్యాయా మూఢాయాం క్రూర

చేష్టః క్రూరకర్మరతి శ్చ క్షత్రశూద్రస్వభావ ఉగ్రాఖ్యః పుత్రో జాయతే.

ఈవచనమును బట్టి శంతనమహారాజుచే వివాహము చేసికొనబడినట్టియు, ప్రతివాదిమతప్రకారము శూద్రస్త్రీయైనట్టియు సత్యవతియందు జన్మించిన చిత్రాంగదవిచిత్రవీర్యులు ఉగ్రజాతీయులగుదురు కాని క్షత్రియులు కానేరరు. కనుక ప్రతివాదులకు స్వవచనవ్యాఘాతముకూడ ప్రాప్తించినది. ఈకారణములచే సత్యవతీదేవి జాలరివనితయందు పుట్టె ననుట హేయము. సత్యవతీదేవి ప్రతివాదులన్నట్లు జాలరివనిత కాదు. శూద్రస్త్రీ కాదు. క్షత్రియయే యని సమాధానము.

> "ఆవనిత (సత్యవతి) అందకత్తె యగుటచే బరాశరశంతనులు వరింప నర్హయై యుండెను. ... సత్యవతీసౌందర్యాలాలసు లయియే పైవా రామెను కోరుచుండిరిగాని ఉత్తమక్షత్రియాంగన యను కారణమున గాదు" (పు. 152) అని యాక్షేపము.

వారాసత్యవతీదేవిని వరించుటలో కేవల సౌందర్యము కాక కేవల క్షత్రియత్వముగాక నుభయము కారణము. ప్రతివాదిమత ప్రకారము చూడగా శంతను సత్యవతీసంతతికి క్షత్రియత్వమే అసంభవము. ఉభయకారణత్వపక్షములో శంతను సత్యవతీ సంతతికి క్షత్రియత్వము సిద్ధించును కనుక సత్యవతీదేవి క్షత్రియయే యని సమాధానము.

> "వ్యాసుని తల్లి కైవర్తకన్యయే యనియు, బ్రాహ్మణేతర వనితలకు జన్మించినవారును బ్రహ్మర్షులు కావచ్చు ననియు వజ్రసూచికోపనిషత్తులో గల వాక్యము నింతకు ముందు చూపి యున్నాను. మఱియు భవిష్యదేవీభాగవతవిష్ణుపురాణాదులు

వ్యాసుడు దాశకన్య, లేక కైవర్తకన్యాసంజాతుడే యని స్పష్ట వాక్యములతో చెప్పియున్నవి” (పు. 152) అని యాక్షేపము.

ఐతే వ్యాసుని తల్లి దాశకన్య, లేక కైవర్తకన్య యనుటకు ప్రతివాదు లన్నిగ్రంథనామములు కీర్తింపవలెనా? సీతామహాదేవి అయోనిజయై భూతలమునుండి యావిర్భవించినను జనకుని పోషణముచే జానకి యనబడినట్లు వ్యాసజనని క్షత్రియయైనను దాశుని పోషణముచే దాశకన్య యనబడుట కభ్యంతరములేదు.

వజ్రసూచికోపనిషత్తులో బ్రాహ్మణేతరవనితలకు జన్మించినవారును బ్రహ్మర్షులు కావచ్చుననియు, వ్యాసుడు దాని కుదాహరణ మనియు నున్నదట. దీనికై వ్యాసజనని బ్రాహ్మణేతరవనితకదా కావలసియున్నది. క్షత్రియస్త్రీకనుక బ్రాహ్మణేతరవనితయే. ఇక నాయుపనిషత్తులోని “వ్యాసః కైవర్తకన్యాయామ్” అను వాక్యార్థసిద్ధి యెట్లందురు కాబోలు. జానకీశబ్దవ్యవహారము అయోనిజయనుటకును, భూపుత్రియనుటకును భంగకరము కానట్లు ఈకైవర్తకన్యాశబ్దము సత్యవతీదేవి క్షత్రియత్వమునకు భంజకము గాదు. క్షత్రియయై యుండియు కైవర్తపోషణమును బట్టి కైవర్తకన్య యని వ్యవహరింపబడెను చూడుడు—(భాగవతము 9 స్కం. అ. 22)

“శంతనో ర్దాశకన్యాయాం జజ్ఞే చిత్రాంగద స్సుతః ॥”

శ్రీధరీయమ్—

దాశకన్యాయా మితి. ఉపరిచరవసో ర్వీర్యేణ మత్స్యాగర్భాదుత్పన్నా కన్యా దాశైః కైవర్తైః పాలితా. అతో దాశకన్యేతి ప్రసిద్ధాయామ్ ॥

ఈగ్రంథము పైవిషయమునే ధ్రువపరచుచున్నది. కనుక సత్యవతీదేవి ప్రతివాదు లన్నట్లు శైవర్తజాతి స్త్రీ కాదు. క్షత్రియ జాతి స్త్రీయే యని సమాధానము. ఇంతవరకు సత్యవతీదేవి క్షత్రియయే యను సిద్ధాంతముపై ప్రతివాదుల ఆక్షేపపరంపర ప్రమాణోపపత్తుల తోడను, ప్రతివాదిపూర్వాపరవచనవిరోధప్రదర్శనములతోడను పరి హరింపబడి సమాధానపరంపరచే వ్యాసజనని యగు సత్యవతీదేవి క్షత్రియయే యని స్థిరపరుపబడినది. ఇక నీయంశమును విడిచి వ్యాస భగవానునిపై ప్రతివాదుల ఆక్షేపముల నవలోకింతము—

—♦ వ్యాసుడు చండాలజాతిజుడనుప్రసంగము-తన్నిరాకరణము ♦—

"బ్రాహ్మణుడు సితవర్ణుడుగా నుండవలయు నని శాంతిపర్వ మున గలదు వ్యాసు డసితవర్ణుడు. మరియు శైవర్తజాతి షోడశ విధచండాలజాతియందును నధమ మని హేమాద్రికృత చతుర్వర్గ చింతామణిలో గలదు. అందువలననే వ్యాసుని చండాలజాతిజు డని చెప్పితిని. కాని బ్రహ్మర్షియే" (మ. భా. చ. పు. 153)

ఆహా! చండాలజాతిజు డట! బ్రహ్మర్షియట! ఇది యజ్ఞాన విలసితము. అన్యజాతీయునకు అశరీరముతో బ్రహ్మర్షిత్వ మసంభవ మను సంగతి వెనుక వాల్మీకినిషాదత్వనిరాకరణఘట్టములో ధర్మఖండ కథాసందర్భమున నింద్రబృహస్పతిసంవాదమువలన స్పష్టీకరింపబడి యున్నందున ప్రతివాదుల వ్రాత హేయము.

ఇచ్చట 'చండాలజాతిజు డని చెప్పితిని' అను వాక్యములోని చండాలజాతిపదముచే మరల సత్యవతీదేవిని స్పృశించుచున్న ట్లున్నది. "సతికుడ్యే చిత్రరచనా" అన్నట్లు సత్యవతీదేవియందు ఆశైవర్తజాతి సిద్ధించినపుడుకదా, దానిపై ప్రతివాదుల మనోరథసౌధనిర్మాణము! అది యున్మూలిత మగుటచే వారి మనోరథసౌధము పతితమైనది.

మరియు వెనుక "వ్యాసుడు మొదలగువారు వారి తల్లు లే జాతివారైనను బీజప్రాధాన్యతపోవిశేషములచే మహర్షు లైరి... జాలరివనిత యగు సత్యవతికి... క్షత్రియు డగు శంతనునివలన చిత్రాంగద విచిత్రవీర్యులను క్షత్రియులు పుట్టిరి" (పు. 72)

అని వ్రాసిన మ. భా. చ. కారులు పరాశరపుత్రు డగు వ్యాసునియందును, శంతనుపుత్రు లగు చిత్రాంగదవిచిత్రవీర్యుల యందును క్షేత్రప్రాధాన్యము కాక వీర్యప్రాధాన్యమునే యొకమూల నంగీకరించుచున్న ఆనోటితో నిచ్చట 'వ్యాసుని చండాలజాతిజు డని చెప్పితిని' అనుట వెఱ్ఱియా? బుద్ధియా? బ్రాహ్మణుడు సితవర్ణుడుగా నుండవలె నని శాంతిపర్వమున గలదట! వ్యాసు డసితవర్ణు డట! అనగా నసితవర్ణు డగుటచే వ్యాసుడు బ్రాహ్మణుడు కాడట! (చండాల జాతిజు డన్నమాట.) కాని బ్రహ్మర్షియేనట! ఔరా! బ్రహ్మర్షి, రాజర్షి, దేవర్షిశబ్దములు ఆయాఋషులయందలి జాతివిశేషమునకు స్ఫోరకము లగుచుండ, వ్యాసుని బ్రహ్మర్షియే యనుచు బ్రాహ్మణేతరు డనుటయు, పరాశరపుత్రు డగు వ్యాసుని జన్మమునందు వీర్యప్రాధాన్యమేకాని క్షేత్రప్రాధాన్యము కాదనుచు వ్యాసుని అబ్రాహ్మణు డనుటయు పాపభీతిలేని మ. భా. చ. కారులకే చెల్లినది.

బ్రాహ్మణుడు సితవర్ణుడుగా నుండవలె నని శాంతిపర్వమున గలదట! ఆసందర్భ మేమో చూతము— శాంతిపర్వ (అ. 188)

భృగుః—

"బ్రాహ్మణానాం సితో వర్ణః క్షత్రియాణాన్తు లోహితః ।
వైశ్యానాం పీతకో వర్ణ శ్శూద్రాణా మసిత స్తథా ॥"

మ. భా. చ. కారు లన్న విషయ మిది. ఇచ్చట వారి యర్థ

మును బట్టి బ్రాహ్మణులకు సితవర్ణము, (తెలుపు) క్షత్రియులకు లోహితవర్ణము, (ఎరుపు) వైశ్యులకు పీతవర్ణము, (పసుపు) శూద్రులకు అసితవర్ణము, (నలుపు) లక్షణ మని చెప్పబడిన దన్నమాట. వ్యాసుని యందు బ్రాహ్మణునకు లక్షణముగా జెప్పబడిన రంగు లేదను ప్రతివాదులు ఇతరవర్ణములవారికి లక్షణముగా జెప్పబడినవి ఆయా వర్ణములవారి కందరకు నున్న వందురా? అన్యుల మాటకేమి. బ్రాహ్మణున కుండవలసిన ఆ సితవర్ణము ముందీప్రతివాదులయం దున్నదా? నీలమేఘశ్యాము డగు శ్రీరామునియందు క్షత్రియున కుండవలసినట్లు చెప్పబడిన లోహితవర్ణము లేదు కనుక క్షత్రియుడు కా డనసలసిన దేనా? లోకవిరుద్ధ మైన యిట్టి యర్థమును ఆశ్లోకమునకు చెప్పుట తగునా? కనుక వాస్తవార్థమును ఆశ్లోకమునకు గ్రహించుటకు వ్యాఖ్యానమే శరణ్యము. అందుకై ఆసందర్భము జూతము—

భృగుః—

"అసృజ న్బ్రాహ్మణానేవ పూర్వం బ్రహ్మ ప్రజాపతీన్ ।
ఆత్మతేజోఽభినిర్వృత్తాన్ భాస్కరాగ్నిసమప్రభాన్ ॥
తత స్సత్యంచ ధర్మంచ తపో బ్రహ్మచ శాశ్వతమ్ ।
ఆచారం చైవ శౌచంచ స్వర్గాయ విదధే ప్రభుః ॥"

నీలకంఠీయమ్—

కథం సృష్టాని భూతానీత్యస్యోత్తర ముక్త్వా కథం వర్ణవిభక్తయ ఇత్య స్యోత్తర మాహ. అసృజ దిత్యాది. తత్ర పూర్వం చిత్తప్రసాదే నానన్య మస్మృతఇత్యుక్తం. చిత్తప్రసాదశ్చ ధర్మఫల మతో ధర్మం నిరూపయతి—బ్రాహ్మణాన్=బ్రహ్మనిష్ఠాన్; ప్రజాపతీన్= మరీచ్యంగిరఆదీన్; ఆత్మన స్తేజః=సత్యసంకల్పత్వాదిసామర్థ్యమ్; తేన నిర్వృత్తాన్=నుత్పాదితాన్; ధర్మం=యజ్ఞాదిం; తపః=కృఛ్ర

చాంద్రాయణాది; శాశ్వతం బ్రహ్మ=నిత్యం వేదం; ఆచారం=స్నానాదిం; శౌచం=ప్రాయశ్చిత్తాది;

దేవదానవగంధర్వా దైత్యాసురమహోరగాః ।
యక్షరాక్షసనాగాశ్చ పిశాచా మనుజా స్తథా ॥
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా శ్శూద్రాశ్చ ద్విజసత్తమ! ।
యే చాన్యే భూతసంఘానాం వర్ణా స్తాం శ్చాపి నిర్మమే ॥
బ్రాహ్మణానాం సితో వర్ణః క్షత్రియాణాన్తు లోహితః ।
వైశ్యానాం పీతకో వర్ణ శ్శూద్రాణా మసిత స్తథా ॥

నీ—వర్ణాః,=సాత్త్వికం రాజసం తామసం మిశ్రంచేతి. స్వచ్ఛత్వాదిసామ్యాత్ గుణవృత్తం వర్ణశబ్దే నోచ్యతే; సితః=స్వచ్ఛః సత్వగుణః ప్రకాశాత్మా శమదమాదిస్వభావః; లోహితో=రజోగుణః ప్రవృత్త్యాత్మా శౌర్యతేజఆదిస్వభావః; పీతకః=రజస్తమోవ్యామిశ్రః కృష్యాదినిహీనకర్మప్రవర్తకః; అసితః=కృష్ణః ఆవరణాత్మా తమోగుణః స్వతఃప్రకాశప్రవృత్తిహీనః శకటవ త్పరప్రేర్యః ॥

ఇచ్చట చిత్తశుద్ధిహేతు వగు ధర్మము నిరూపింపబడుచున్నది. బ్రహ్మ, పూర్వము బ్రహ్మనిష్ఠులగు మరీచిప్రభృతులైన ప్రజాపతులను సృజించి సత్యము, యజ్ఞాదిధర్మము, కృచ్ఛ్రచాంద్రాయణాదితపస్సు, నిత్యమైనవేదము, స్నానాద్యాచారము, ప్రాయశ్చిత్తాదిరూపమైన శౌచము, అను స్వర్గసాధనములను విధించెను. దేవదానవగంధర్వాదులయొక్కయు, బ్రాహ్మణాదిచతుర్వర్ణములయొక్కయు వర్ణములను-అనగా సాత్త్వికరాజసతామసమిశ్రము లనబడు సత్త్వాదిగుణకృతవ్యాపారములను నిర్మించెను. బ్రాహ్మణులకు సితవర్ణము-అనగా ప్రకాశాత్మకమైశమదమాదిస్వభావముకల సత్త్వగుణము, క్షత్రియులకు లోహితవర్ణము-అనగా ప్రవృత్త్యాత్మకమై శౌర్యాదిస్వభావము

కల రజోగుణము, వైశ్యులకు పీతవర్ణము-అనగా కృష్యాదిసిహీనకర్మ ప్రవర్తకమైన రజస్తమోవ్యామిశ్రగుణము శూద్రులకు, అసితవర్ణము-అనగా ఆవరణాత్మకమై స్వతః ప్రకాశప్రవృత్తిరహితమైన తమోగుణము నిర్మింపబడెను. అని యర్థముచెప్పబడెనే కాని రంగులని చెప్పబడలేదు ఇటుపైనున్న శంకాసమాధానగ్రంథముచే చాతుర్వర్ణ్యములకును అసాధారణధర్మములు చెప్పి వీనినిబట్టి బ్రాహ్మణాదివర్ణవిభాగము గ్రాహ్యమనుచు సాత్త్వికత్వాదిరూపవర్ణవిభాగమునకు కారణము ధర్మమే యని చెప్పబడెను. ఇట్లు పరిశీలింపగా "బ్రాహ్మణానాం సితో వర్ణః" అను శాంతిపర్వశ్లోకమున కపార్థము చెప్పి వ్యాసభగవానుని నిందించిన మ. భా. చ. కారుల హాస్యాస్పదప్రసంగ మప్రస్తుతమైనది. అంశాంతరమందుకొందము.

నిషాదుడైన వ్యాసునకు బ్రాహ్మ్యసంస్కారము లను ప్రసంగము-తన్నిరాకరణము.

"వ్యాసుడు వాల్మీకివలె గాక మొదటనే బ్రాహ్మ్యసంస్కారముల నొంది వినుతి కెక్కిన గ్రంథము రచించెను"

(మ. భా. చ. పు 159)

ఈప్రతివాదులు వాల్మీకి మొదట బ్రాహ్మ్యసంస్కారముల నొందలే దనుచున్నారు. వాల్మీకి యనగా వల్మీకప్రభవుడు. వసిష్ఠాదులాతనిని వల్మీకమునుండి యభివ్యక్తము జేసినతరువాత "వసిష్ఠమునీంద్రుండతనికి ప్రచేతసునిచేత వేదోక్తక్రమంబున జాతకర్మాద్యఖలసంస్కారంబులు చేయించెను" అని వెనుక జూపబడిన ధర్మఖండమునుబట్టి వాల్మీకికి బ్రాహ్మ్యసంస్కారములు వెంటనే జరిగినందున ప్రతివాదుల వ్రాత తప్పు. వ్యాసునకు బ్రాహ్మ్యసంస్కారములు మొదటనే జరిగినవనుచున్న ప్రతివాదుల నడుగవలసియున్నది. బ్రాహ్మ్య

సంస్కారములనగా బ్రాహ్మణునకు జేయు సంస్కారములా? అబ్రాహ్మణునకు జేయు సంస్కారములా? మీ మతమున నిషాదుడు, చండాలజాతిజుడు నగు వ్యాసునకు, బ్రాహ్మణునకు జేయబడు సంస్కారము లెట్లు చేయబడినవి? ఇక నబ్రాహ్మణునకు బ్రాహ్మ్యమునిమిత్తము చేయబడు సంస్కారము లందురా? అట్టిసంస్కారము లేవి? వానిని బోధించు విధు లేవి? పాలీ్కివిషయమైన ధర్మఖండములో జెప్పబడినట్లు అవి వేదోక్తసంస్కారములే అనవలెను. అవి "బ్రాహ్మణ ముపనయీత" ఇత్యాదివచనములచే బ్రాహ్మణజాతికి జేయనలసినవే కాని నిషాదాదులకు జేయవలసినవి కావు. కనుక నిది యసంగతప్రసంగము.

"వ్యాసశ్చ భగవాన్ విప్రః దేవర్షిగణసేవితః" అని మహాభారతమున బహుస్థలములలో వ్యాసుడు విప్రుడని చెప్పబడుటచేతను, బ్రాహ్మ్యసంస్కారముల నొందుటచేతను తద్విరుద్ధమగు ప్రతివాదుల ఈవ్రాత పరాస్తము.

అంశాంతరమందుకొందము —

వ్యాసు డంబికాదులయందు ప్రవర్తించుటచే
దోషియను ప్రసంగము-తన్నిరాకరణము.

"తల్లి యానతి యను నెపమున రాణివాసము జేరి రాణులను గూడి తన నైష్ఠికబ్రహ్మచర్యవ్రతమునకు లోపము కలుగజేసి కొనెను. అవకీర్ణి చేయదగిన గర్దభేష్టిం జేసెనో లేదో కాని వ్యాసునంతటివాడు వ్రతభ్రష్టు డగుట యెట్టిదని పూర్వమీమాంసాశాస్త్రజ్ఞులు 'ధర్మవ్యతిరిక్తసాహస' విచారణములో నానావిధము లగు త్రిప్పలుపడి మాత్రాజ్ఞ కాన వ్యాసుడు దోషి కాడని సరిపెట్టుకొనిరి" (మ. భా. చ. పు. 159)

ఆహా! ఈప్రతివాదులది దివ్యదృష్టికనుక వ్యాసుడు రాణులను కూడుటలో తల్లి యానతి యనుసరించినది నెపమే యని వ్యాసభగవానుని హృదయము తెలిసికొని చెప్పుచున్నారు. వీరు వ్యాసభగవానునకు నైష్ఠికబ్రహ్మచర్యవ్రతలోపము కలిగె ననుచున్నారు ఔను; దివాంధమునకు మహోజ్జ్వల మగు మధ్యాహ్నమార్తాండమండలమందు గాఢాంధకారానుభవ మని లోకప్రసిద్ధి ఈప్రతివాదులు పూర్వమీమాంసాశాస్త్రమును కీర్తించుచున్నారు కనుక దానిని జూతము.

"అపివా కారణాగ్రహణే ప్రయుక్తాని ప్రతీయేరన్" (జై. సూ. 1 అ. 3 పా)

తన్త్రవార్తికము—

అత్ర సదాచారా నుదాహృత్య త్రివర్గసిద్ధ్యర్థం విచార్యతే. తద్విపరీతసంకీర్ణవ్యవహారేషు శిష్టేష్వపథ్యకారి వైద్యాతురవ దవిస్రంభణీయచరితత్వాత్, సంభావ్యమానవేదమూలత్వాచ్చ ధర్మసంశయం దర్శయిత్వా సదాచారేషు హి దృష్టో ధర్మవ్యతిక్రమః సాహసంచ మహతామ్॥

న్యాయసుధా—

తద్విపరీతేతి. త్రివర్గవిపరీతై రధర్మానర్థదుఃఖసాధనై రాచారై స్సంకీర్ణో వ్యవహారో యేషా మితి విగ్రహః. వైద్యశ్చాసావాతురశ్చేతి కర్మధారయం కృత్వా పూర్వపదేన కర్మధారయః కార్యః॥ లోభాద్యభిభవా త్సన్నిహితాఽనర్థాఽదర్శనే నాధర్మాచరణం ధర్మవ్యతిక్రమః దృష్ట స్త్వాప్యనర్థస్య బలవత్త్వే నానాదరా దధర్మాచరణం సాహసమ్॥

తన్త్రవార్తికమ్—

"కృష్ణద్వైపాయనస్యాపి గృహీతనైష్ఠికబ్రహ్మచర్యస్య విచిత్రవీర్యదారేషు వ్యపత్యోత్పాదనప్రసంగః" ... ఇతి ప్రస్తుత్యాభిధీయతే—'అపివా కారణాగ్రహణే ప్రయుక్తాని ప్రతీయేరన్,' ఇతి।

"దృష్టకారణహీనాని యాని కర్మాణి సాధుభిః ।
ప్రయుక్తాని ప్రతీయేరన్ ధర్మత్వే నేహ తాన్యపి ॥
శరీరస్థితయే యాని సుఖార్థంవా ప్రయుంజతే ।
అర్థార్థం వా నతే ష్వస్తి శిష్టానా మేవ ధర్మధీః॥"

తపోబలారూఢస్య చరితం తత్ 'సర్వం బలవతః పథ్యమ్' ఇతి న్యాయేన మహాన్తివ తపాంసి కృత్వా తాని క్షయం నయతః ఉత్తరకాలంవా పాపవిశుద్ధిం ప్రాయశ్చిత్తైః ప్రతికుర్వాణస్య జీర్యత్యపి. మన్దతపసా మగ్నైరివ మహావటకాష్ఠాదిభక్షణ మాత్మవినాశాయైవ స్యాత్. ద్వైపాయనస్యాపి గురునియోగాత్ "అపతి రపత్యలిప్సు ర్దేవరా ద్గురు ప్రేరితా ద్ఋతుమతీయాత్" ఇత్యేవ మాగమాత్ మాతృ సంబన్ధభ్రాతృజాయాపుత్రజననం ప్రాక్కృతపశ్చాత్కరిష్యమాణతపోబలేన నాతిదుష్కరమ్. అన్యోఽపి య స్తాదృ క్తపోబలో నిర్వహేత్స కుర్యాదేవ ।

ఈగ్రంథమునకు తాత్పర్య మిది—రోగులకు పథ్య ముపదేశించుచు తాను రోగగ్రస్తుడై యపథ్యము జేయు వైద్యునియందు విశ్వాస ముండనట్లు అధర్మానర్థదుఃఖమూలము లైన యాచరణముల చేత సంకీర్ణవ్యవహారముకల శిష్టుల చరిత్రము శంకింపదగియుండుటవలనను, వేదమూలకత్వము సంభావింపబడుచుండుట వలనను ధర్మసంశయమును ప్రదర్శించి విచారణ చేయుబడుచున్నది.

సదాచారములలో ధర్మవ్యతిక్రమము (లోభాద్యావేశమున సన్నిహితానర్థమును గమనింపక యధర్మ మాచరించుట) సాహసము (దృష్టమైన యనర్థమును బలదర్పమున గణింపక యధర్మ మాచరించుట) గోచరించుచున్నవి. నైష్ఠికబ్రహ్మచర్యము గ్రహించిన కృష్ణద్వైపాయనునకు విచిత్రవీర్యుని భార్యలయందు సంతతిగలిగించుట ధర్మవ్యతిక్రమము. అని పూర్వపక్షము రాగా సమాధానముచెప్పబడుచున్నది. దృష్టఫలరహితములై సత్పురుషులచే నాచరింపబడిన కార్యములు ధర్మములు. శరీరస్థితికొరకు, సుఖముకొరకు, ధనముకొరకు ఆచరింపబడు కార్యములను ధర్మములని శిష్టులుభావింపరు. ఇక వ్యాసమహర్షివిషయ మేమనగా. "సర్వం బలవతః పథ్యమ్" అను న్యాయమునుబట్టి, మహాతపస్సులు చేసి వాని నవసరమును బట్టి యొకానొక కార్యములో వినియోగించునట్టియు. ననంతరమైనను దోషనివృత్తికై ప్రతిక్రియ లాచరించునట్టియు, తపోబలారూఢుని కృత్యము వటకాష్ఠభక్షణము గజములకువలె జీర్ణించునుగాని బాధింపదు. ఆతపశ్శక్తి లేనివానికట్టి కృత్యము, వటకాష్ఠభక్షణ మన్యజంతువునకువలె నాత్మవినాశకరమే యగును. గురుజననియోగమును బట్టియు, శాస్త్రమును బట్టియు, పూర్వము చేయబడినదియు, పరమందు చేయబడునదియు నగు తపముయొక్క బలముచే విచిత్రవీర్యభార్యలయందు సంతతి గలిగించుట మహర్షికి దుష్కరము కాదు. అట్టి తపోబలము కలవా డెవ్వడైన నిర్వహింపవచ్చును. అని

ఇట్లు పూర్వమీమాంసాశాస్త్రము చర్చించి, గురుజననియోగమును బట్టియు, శాస్త్రమును బట్టియు, తపోబలముచే వ్యాసమహర్షి కది చెల్లినదని నిరూపించియుండగా 'పూర్వమీమాంసాశాస్త్రజ్ఞులు నానావిధములగు తిప్పలు పడి సరిపెట్టుకొనిరి' అని ప్రతివాదులందురే! వారు పడిన తిప్పలేమున్నవి? మాతాజ్ఞ, ప్రమాణబలము,

తపోబలము, వ్యాసభగవానుని ప్రవృత్తికి మూలమనుట తిప్పలు పడుటా? (తుదకు దోషి కాదని సరిపెట్టుకొని రట.) శాస్త్రకారులు పూర్వపక్షసిద్ధాంతములతో గ్రంథములు వ్రాయుట తాము సరిపెట్టు కొనుటకా? మందమతుల బుద్ధిమాంద్యమును పోగొట్టుటకా? శబ్ద వ్యాపారము పరులకు బోధించుట కని ప్రతివాదులకు తెలియదు కా బోలు. వారు సరిపెట్టుకొని రనగా తమకు సరిపడ లేదని తాత్పర్యము కాబోలు. ఆర్షవచనములయందు ఆదరాతిశయము కలిగి సంచరించు టకు అట్టి యదృష్ట ముండవద్దా?

“నైష స్థాణో రపరాధః యదేన మన్ధో న పశ్యతి. పురుషా పరాధ స్సభవతి” అనునట్లు శాస్త్రములను విశ్వసింపకుండుట విశ్వ సింపనివాని దోషమే కాని శాస్త్రముల దోషము కాదు. కనుకనే కృష్ణద్వైపాయనుని ధర్మవ్యతిరిక్తకార్యమును గూర్చి శాస్త్రములో చూపిన పూర్వపక్షము మ. భా. చ. కారులకు ప్రియమై దాని సమాధానము వెగటైనది. అదియే హృదయదోషము.

ఈప్రతివాదులు శాస్త్రకారులు చెప్పియున్న విషయము నిట్లు తృణీకరించుచు “మాతాజ్ఞకు వ్యతిరేకముగా దాసిం గూడుటకు పూర్వమైమాంసికు లెట్టి సమాధాన మిచ్చెదరో” (పు 159)

అని యడుగుచున్నారు. అణీమాండవ్యమహర్షి యమధర్మ రాజును “శూద్రయోనా వతో ధర్మ! మానుష స్సంభవిష్యసి” అని శపించియుండుటను బట్టి త్రికాలజ్ఞాననిధి యగు వ్యాసభగవానుడు ఆయమధర్మరాజు అంశము ఆమెయందు తనమూలమున జన్మింపవలసి యున్న విధిని గ్రహించి మహాతపశ్శక్తికలవాడు కనుక నట్లు వ్యవహ రించె ననుచు సమాధాన మిచ్చెద రని తెలుపుచున్నాము. ఇట్లు పూర్వమీమాంసకులు వ్యాసమహర్షికి పుత్రోత్పాదనప్రసంగము తపోబలముచే దోషావహము కాదని బోధించినారు.

ఉత్తరమీమాంసకులుగూడ యావదధికారాధికరణమున వేద వ్యాసప్రభృతులు అధికారికపురుషు లనియు, బ్రహ్మనిష్ఠు లనియు, అధికారసమాప్తిపర్యంతము వారు జీవన్ముక్తులై యుందురనియు, వారి కాగామిసంచితకర్మము లంటవనియు, శ్రుతిస్మృతిప్రమాణము లతో నిరూపించి—

"యథైధాంసి సమిద్ధో గ్ని ర్భస్మసా త్కురుతేఽర్జున ।
జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసా త్కురుతే తథా ॥"

అను గీతావచన ముదాహరించి యాజ్ఞానిష్ఠుల సర్వవిధకర్మములు జ్ఞానాగ్నిదగ్ధములగును. కనుక వారి కేవిధమైన దోష ముంట దని చెప్పియున్నారు. ఇట్టిస్థితిలో శాస్త్రమర్యాదను పాటింపక వ్యాస భగవానుని నిందింపబూనిన మ. భా. చ. కారుల నేమనవలెనో.

ఇక దీని నిట్లుంచి తల్లి యానతి యనునది నెప మనుచున్న మ. భా. చ. కారులకు ఆతల్లి యాజ్ఞ గ్రంథమం దెట్లున్నదో వినిపింతము—

విచిత్రవీర్యు డపుత్రకుడై గతింప సత్యవతీదేవి భీష్మునితో నీవు సర్వధర్మవిదుడవు. ఈభరతవంశము నిన్నాధారపడియున్నది. అనుచు ని ట్లుపదేశించెను—

"కార్యే త్వాం వినియోక్ష్యామి తచ్ఛ్రుత్వా కర్తు మర్హసి ।
మమ పుత్ర స్తవ భ్రాతా వీర్యవా న్సుప్రియశ్చ తే ।
బాల ఏవ గత స్స్వర్గ మపుత్రః పురుషర్షభ ।
ఇమే మహిష్యౌ భ్రాతు స్తే కాశిరాజసుతే శుభే ।
రూపయౌవనసంపన్నే పుత్రకామే చ భారత ।
తయో రుత్పాదయాపత్యం సంతానాయ కులస్య నః ॥

మన్ని యోగా న్మహాబాహో! ధర్మం కర్తు మిహార్హసి ।
రాజ్యే చైవాభిషిచ్యస్వ భారతా ననుశాధి చ ।
దారాంశ్చ కురు ధర్మేణ మా నిమజ్జీః పితామహాన్ ।"

నీలకంఠీయమ్—

రాజ్యేచైవ=రాజ్యఏవవా; ఆత్మాన మభిషిచ్యస్వ=అభిషేచయ; కురు=బ్రహ్మచర్యసంకల్పా త్ప్రభృతి త్యక్తాన్ సంతత్యర్థ మంగీకురు; మా నిమజ్జీః=మా నిమజ్జయ...

నిన్నొక కార్యమందు నియోగించుచున్నాను. నీ వట్లు చేయ దగినవాడవు. నాపుత్రుడు, నీసోదరుడునైన విచిత్రవీర్యునిభార్యలు పుత్రార్థినులై యున్నారు. వంశవృద్ధికై నానియోగముచే నీవు వార లకు సంతతి గలిగింపుము; ఈధర్మ మంగీకరింపుము. లేక రాజ్యమం దైనను నీవభిషిక్తుడవు కమ్ము. బ్రహ్మచర్యసంకల్పము మొదలుకొని త్యజింపబడిన దారలను సంతతికై యంగీకరింపుము. ఇది సత్యవతీదేవి భీష్మున కుపదేశించిన విషయము.

భీష్మునకు వింతతూద్వాహప్రేరణ మను ప్రసంగము-
తన్నిరాకరణము.

మ భా. చ. కారు లీవచనములనే ప్రదర్శించి "అనాడు వితంతూద్వాహము తప్పుగా నెన్నబడలేదు" (పు 76) అనుటకు నిదర్శన మిదియే యనిరి. ఆశ్లోకముల కర్థము వ్రాయుచు "నీ సోదరుని భార్యలయందు సంతతి గనుమా! రాజ్యమునం దభిషిక్తు డవు కమ్ము. ఈ నీసోదరభార్యలను నీభార్యలగా జేసికొనుము" అని వ్రాసిరి.

అస లిచ్చట వంశవృద్ధి, రాజ్యపరిపాలనము ప్రస్తుతాంశము. కాని వింతతూద్వాహము కాదు. అందు వంశవృద్ధికై నియోగవిధిని బట్టి నీసోదరభార్యలయందుగాని లేక బ్రహ్మచర్యసంకల్పము మొదలు భార్యాపరిగ్రహములేని నీవు భార్యాపరిగ్రహము చేసి అచ్చట గాని సంతతి గను మనియు, రాజ్యాభిషిక్తుడవు కమ్మనియు, చెప్పియుండ నీసోదరభార్యలను నీభార్యలగా జేసికొను మని సత్యవతీదేవి భీష్ముని వింతంతూద్వాహమునకు పురికొల్పిన దను మ. భా. చ. కారుల వ్రాత హేయము. మఱియు,

"న వివాహవిధా వుక్తం విధవావేదనం పునః"

వ్యా—"నచ వివాహవిధాయకశాస్త్రే-న్యేన పురుషేణ పున ర్వివాహ ఉక్తః" అని వింతతూద్వాహము వివాహవిధాయకశాస్త్ర మందు చెప్పబడలే దని మనుస్మృతి యుద్ఘోషించుచుండుటను బట్టి కూడ ప్రతివాదిప్రసంగము నింద్యము.

మఱియు సత్యవతీదేవిచే భీష్మున కుపదేశింపబడినవి మూడు విషయములు. అందు 'తయో రుత్పాద యాపత్యం మన్నియోగాత్' నా నియోగమువలన అంబికాంబాలికలయందు సంతతి ననుగ్రహింపుము, అని యొకటి "రాజ్యే చైవాభిషిచ్యస్వ" రాజ్యమందైన నభిషిక్తుడవు కమ్ము. అని యొకటి. "దారాంశ్చ కురు ధర్మేణ" 'బ్రహ్మచర్యసంకల్పాత్ప్రభృతి త్యక్తాః సంతత్యర్థ మంగీకురు' బ్రహ్మచర్యసంకల్పము మొదలుత్యజింపబడిన దారలనుసంతతికై యంగీకరింపుము. అని యొకటి. ఇచ్చట 'దారాంశ్చ కురు ధర్మేణ' అను మూడవ విషయము కూడ నంబికాంబాలికల నుద్దేశించియే చెప్పబడిన దనుచున్న ప్రతివాదుల నడుగవలసియున్నది— "నీసోదరభార్యలయందు సంతతి గనుము. ఈ నీసోదరభార్యలను నీభార్యలగా జేసికొనుము" అను వీరా వ్రాతకు సంతతిగని యాపై భార్యలగా జేసికొను మని తాత్పర్యమా? లేక భార్యలగా జేసికొని యాపై సంతతి గను మని తాత్పర్యమా?

ప్రథమపక్షములో—

"దేవరాద్వా సపిండాద్వా స్త్రియా సమ్యఙ్నియుక్తయా ।
ప్రజేప్సితాధిగన్తవ్యా సన్తానస్య పరిక్షయే ॥" (పు. 59 అ. 9)

అను మనువచనముచే నియోగవిధివలన సోదరభార్యలయందు సంతతి గనుమనె ననుట యుక్తమే కాని యాపై వారల భార్యలగా జేసికొనుమనె ననుట అయుక్తము. చూడుడు—

"విధవాయాం నియోగార్థే నిర్వృత్తేతు యథావిధి ।
గురువచ్చ స్నుషావచ్చ వర్తేయాతాం పరస్పరమ్ ॥" (అ 9)

అనగా నియోగఫలము సిద్ధించినతరువాత నాపురుషుడు గురువువలెను, స్త్రీ కోడలువలెను వర్తింపవలెను. అనిభావము. కనుకప్రథమపక్షము హేయము.

ఇక భార్యల జేసికొని సంతతిగనుట, యను ద్వితీయపక్షములో ప్రతివాదికల్పించిన వితంతూద్వాహము.

"న వివాహవిధా వుక్తం విధవావేదనం పునః ।"

అను పూర్వోక్తమనువచనముచే దూష్యమే కద. ఇంకొకటి.

వితంతువులగు సోదరభార్యలను ప్రతివాదు లన్నట్లు భీష్ముడు వివాహము చేసికొనుటే తటస్థించినపుడు వారు భీష్మభార్య లనబడుదురే కాని సోదరభార్య లనబడరు. ఇట్లుండ "నీసోదరభార్యలయందు సంతతి గనుము" అని చెప్పినట్లున్న ప్రతివాదుల వ్రాతకిప్పుడు గతియేమున్నది? మఱియొకటి. సత్యవతీదేవి వాక్యము లిట్లున్నవి—

"మమ పుత్రి స్తవ భ్రాతా. బాలఏవ గత స్స్వర్గ మపుత్రః.

ఇమే మహిష్యౌ భ్రాతుస్తే. పుత్రకామే. తయో రుత్పాదయాపత్యం సంతానాయ కులస్య నః. మన్నియోగా న్మహాబాహో ధర్మం కర్తు మిహార్హసి"

ఈవాక్యములు నియోగవిధికి జెందినవికాని వితంతూద్వాహము నకు జెందినవి కావు. నియోగపద్ధతి క్షేత్రజసంతతి నపేక్షించియుండును వివాహపద్ధతి వివాహము జేసికొనినవాని యౌరససంతతి నపేక్షించి యుండును. భీష్ముడు వివాహము చేసికొనియే వారలయందు సంతతిగ నుట తటస్థించిన యెడల నది భీష్ముని యౌరససంతతి యగును కానివిచి త్రవీర్యునకు క్షేత్రజసంతతి కానేరదు. ఇట్టిస్థితిలో విచిత్రవీర్యునకు క్షేత్రజసంతతితాత్పర్యముతో "నీసోదరభార్యలయందు సంతతిగ నుము" అని చెప్పబడినట్లు వ్రాసిన వ్రతివాముల ద్వితీయపక్షముబా ధకమే. మఱియు వితంతువుల భార్యల జేసికొనుట వివాహ విధికే గాక, నియోగవిధికిగూడ విరుద్ధమే. చూడుడు—

"విధవాయాం నియుక్తస్తు ఘృతాక్తో వాగ్యతో నిశి.
ఏక ముత్పాదయే త్పుత్రమ్"

వ్యా-ఘృతాక్తసర్వగాత్రమానీరాత్రౌదేకపుత్రంజనయేత్।
"నియుక్తాయా మపి పుమా న్నార్యాం జాతో౽విధానతః।
నైవార్హః పైతృకం రిక్థం పతితోత్పాదితోహి సః॥"
"యాని యుక్తా౽న్యతః పుత్రం దేవరా ద్వా ప్యవాప్నుయాత్।
తం కామజ మరిక్థీయం వృథోత్పన్నం ప్రచక్షతే।"

వ్యా-యాస్త్రీ గుర్వాదిభిరనుజ్ఞాతా దేవరాద్వా౽న్యతోవా సపిండాద్వా పుత్ర ముత్పాదయేత్. సయది కామజో భవతి. తదా త మరిక్థభాజం మన్వాదయో వద న్తి. అకామజ ఏవ రిక్థభాక్. సచ వ్యాహృతో నారదేన—

"ముఖా న్ముఖం పరిహరన్ గాత్రై ర్గాత్రాణ్యసంస్పృశన్ ।
కులే తదవశేషేచ సంతానార్థం న కామతః" ఇతి.

వితంతు స్త్రీయందు నియోగింపబడినవాడు దేహ మంతటను నెయ్యి బూసికొని, మౌనము వహించి, నిశయందు పుత్రుని కలిగింప వలెను. యోగింపబడిన స్త్రీయందైనను విధివిరుద్ధముగా జన్మించిన పుత్రుడు పతితోత్పాదితు డగుటవలన దాయభాగమున కధికారి కాడు. గురుజననియుక్తురాలైన స్త్రీ కామపూర్వకప్రవృత్తికలదై పుత్రుని గని నపుడు ఆపుత్రుడు దాయభాగమున కర్హుడు కాడని మన్వాదులు చెప్పు చున్నారు. కామమూలకప్రవృత్తివలనబుట్టినవాడే దాయార్హుడనినార దుడనెను. ఎట్లనగా—"కులక్షయము ప్రాప్తించినపుడు నియోగవిధి నాశ్రయించి స్త్రీపురుషులు పరస్పరముఖసంబంధమును, పరస్పర శరీర సంబంధమును వర్జించి సంతానార్థమే ప్రవర్తింపవలెను. కామముతో బ్రవర్తింపరాదు" అని.

ఇట్టి యసిధారావ్రతమీనియోగవిధి. భార్యాభర్తృభావములో నిట్టి నిర్బంధములు లేవు. కామపూర్వకప్రవృత్తి యచ్చట నింద్య ము కాదు.

సత్యవతీదేవి నియోగవిధి ననుసరించియే భీష్మున కుపదేశించి నది. అందులో ప్రతివాదుల వితంతూద్వాహప్రసంగము అజ్ఞానవిలసిత మగుటచే హేయము.

భీష్ము డాసత్యవతీదేవి వాక్యములు విని నీవు చెప్పినది యాప ద్ధర్మమేకాని నాబ్రహ్మచర్యనియమప్రతిజ్ఞ నేను విడువజాలను ఒక మార్గము చెప్పెదను—

"పున ర్భరతవంశస్య హేతుం సంతానవృద్ధయే ।
వక్ష్యామి నియతం మాత! స్తన్మే నిగదత శ్శృణు ॥
బ్రాహ్మణో గుణవాన్ కశ్చి ద్ధనే నోపనిమన్త్ర్యతామ్ ।
విచిత్రవీర్యక్షేత్రేషు య స్సముత్పాదయే త్ప్రజాః ॥"

విచిత్రవీర్యక్షేత్రములయందు సంతతి ననుగ్రహింపగల గుణవంతు డగు బ్రాహ్మణుని ధన మిచ్చి నియోగింపవలెను. అని చెప్పగా నప్పు డాసత్యవతీదేవి వ్యాసమహర్షి జన్మవృత్తాంతము చెప్పి—

"స హి మా ముక్తవాం స్తత్ర స్మరేః కృచ్ఛ్రేషు మా మితి ।
తం స్మరిష్యే మహాబాహో! యది భీష్మ! త్వ మిచ్ఛసి ॥
తవ హ్యనుమతే భీష్మ! నియతం స మహాతపాః ।
విచిత్రవీర్యక్షేత్రేషు పుత్రా నుత్పాదయిష్యతి ॥"

ఆమహర్షి వెనుక కష్టసమయములయందు నన్ను స్మరింపు మని చెప్పెను. నీవంగీకరించినయెడల మహర్షిని స్మరింతును. నీయనుమతిపై యాతడు తప్పక పుత్రుల ననుగ్రహింపగలడు. ఇట్లనగా—
భీష్ముడు—

"తదిదం ధర్మయుక్తం చ హితంచైవ కులస్య నః !
ఉక్తం భవత్యా యచ్ఛ్రేయ స్త న్మహ్యం రోచతే భృశమ్ ॥

నీవన్నది ధర్మయుక్తము, హితమునై యున్నది. శ్రేయస్కరమగు నీసంకల్పము నాకు చాల ఇష్టమైనది; అని చెప్పగా నపుడు—

"కృష్ణద్వైపాయనం కాలీ చింతయామాస వై మునిమ్ ।
స వేదాన్ విబ్రువన్ ధీమాన్ మాతు ర్విజ్ఞాయ చిన్తితమ్ ।
ప్రాదుర్బభూ వావిదితః క్షణేన కురునందన! ।"

సత్యవతీదేవి యామునిని తలచుకొను నంతలో వేదములను పఠించుచున్న ముని తల్లిసంకల్పము గ్రహించి తెలియకుండగనే క్షణములో ప్రత్యక్ష మయ్యెను. అట్లు దర్శనమిచ్చి—

"భవత్యా య దభిప్రేతం తదహం కర్తు మాగతః ।
శాధి మాం ధర్మత త్త్వజ్ఞే! కరవాణి ప్రియం తవ॥"

ధర్మత త్త్వజ్ఞురాలవగు తల్లీ! నీసంకల్పము నెరవేర్ప వచ్చితిని. ఆజ్ఞ యేమి? అనగా సత్యవతీదేవి—

"స త్వం వ్యపేక్షయా భ్రాతు స్సంతానాయ కులస్యచ ।
భీష్మస్య చాస్య వచనా న్నియోగా చ్చ మమానఘ! ॥
అనుక్రోశాచ్చ భూతానాం సర్వేషాం రక్షణాయచ ।
ఆనృశంస్యాచ్చ య ద్బ్రూయాం త చ్ఛ్రుత్వా కర్తుమర్హసి ।
యవీయస స్తవ భ్రాతు ర్భార్యే సురసుతోపమే ।
రూపయౌవనసంపన్నే పుత్రకామేచ ధర్మతః ॥
తయో రుత్పాద యాపత్యం సమర్థోహ్యసి పుత్రక! ।
అనురూపం కులస్యాస్య సంతత్యాః ప్రసవస్యచ॥"
టీ-వ్యపేక్షయా=స్నేహానుబంధేన; నియోగాత్=ఆజ్ఞాతః;
అనుక్రోశాత్=కృపాతః; ఆనృశంస్యాత్=అ_నైష్ఠుర్యాత్."

నీవు సోదరుని స్నేహానుబంధమునుబట్టియు, భీష్ముని వాక్యమునుబట్టియు, నాయాజ్ఞనుబట్టియు, భూతదయనుబట్టియు, మృదుస్వభావమునుబట్టియు, భరతవంశమునకు సంతానముకొరకును, ప్రజారక్షణముకొరకును నేను చెప్పబోవు విషయమును విని యావనిని జేయదగినవాడవు నీయనుజుని భార్యలు ధర్మబుద్ధితో పుత్రసంతతిని గోరుచుండిరి. నీవుతపోబలమున సమర్థుడవు. భరతవంశమునకు అనురూపమైన పుత్రసంతతి ననుగ్రహింపుము. ఇట్లు చెప్పగా మహర్షి—

"వేత్థ ధర్మం సత్యవతి! పరం చాపర మేవచ ।
తథా తవ మహాప్రాజ్ఞే! ధర్మే ప్రణిహితా మతిః ॥"

టీ"పరం ధర్మం=నివృత్తిరూపమ్; అపరం ధర్మం=ప్రవృత్తిరూపమ్; ఆముష్మిక, మైహిక మితివా"

"తస్మా దహం త్వన్నియోగా ద్ధర్మ ముద్దిశ్య కారణమ్ ।
ఈప్సితం తే కరిష్యామి దృష్టం హ్యేత త్సనాతనమ్ ।
భ్రాతుః పుత్రాన్ ప్రదాస్యామి మిత్రావరుణయో స్సమాన్ ।"

తల్లీ! నీవు ఐహికాముష్మికధర్మములు తెలిసినదానవు. నీబుద్ధియు ధర్మానుబద్ధమే. కనుక నీయాజ్ఞవలన ధర్మము నుద్దేశించి నీసంకల్పము నెరవేర్తును. ఇది ప్రమాణసమ్మతమే. అనుజునకు తుల్యులగు పుత్రుల నొసంగుదును.

"వ్రతం చరేతాం తే దేవ్యౌ నిర్దిష్ట మిహ యన్మయా ।
సంవత్సరం యథా న్యాయం తత శ్శుద్ధే భవిష్యతః ।"
నహి మా మవ్రతోపేతా ఉపేయా త్కాచి దంగనా"

వారిరువురు నేచెప్పెడి వ్రతమును యథాన్యాయముగా నొక సంవత్సరము చేయవలెను. అప్పుడు వారు పరిశుద్ధురాం డ్రగుదురు. వ్రతాచరణములేని స్త్రీ నన్ను పొందజాలదు.
ఇట్లు చెప్పగావిని సత్యవతీదేవి—

"సద్యో యథా ప్రపద్యేతే దేవ్యౌ గర్భం తథా కురు ।
అరాజకేషు రాష్ట్రేషు ప్రజాఽనాథా వినశ్యతి॥
నశ్య న్తిచ క్రియా స్సర్వా నాస్తి వృష్టి ర్న దేవతా ।
కథం చారాజకం రాష్ట్రం శక్యం ధారయితుం ప్రభో ॥
తస్మా ద్గర్భం సమాధత్స్వ భీష్మ స్సంవర్ధయిష్యతి ।"

వత్సా! వారు వెంటనే గర్భధారణము చేయునట్లు చేయుము. రాష్ట్ర మరాజక మైనపుడు ప్రజలకు చేటు కలుగును. సర్వక్రియలు లోపించును వర్షముండదు దేవతారాధన ముం డదు. అరాజకమగు రాష్ట్రము నెవ్వడు భరింపగలడు? కనుక వెంటనే సంతతి ననుగ్రహింపుము

అని కోరగా మహర్షి—

"యది పుత్రః ప్రదాతవ్యో మయాభ్రాతు రకాలికః।
విరూపతాం మే సహతాం తయో రేతత్పరం వ్రతం॥
యది మే సహతే గన్ధం రూపం వేషం తథా వపుః।
అద్యైవ గర్భం కౌసల్యా విశిష్టం ప్రతిపద్యతామ్॥"

నేను చెప్పియున్నట్లు కాక యిపుడే పుత్రప్రదానము చేయవల సియున్నచో నావిరూపత్వమును సహింపవలెను. వారికిదిగొప్పవ్రతము. నారూపవేషగంధశరీరములను సహించెనేని యాకౌసల్య కుత్తమసంతా నము కలుగును.

"ఏవ ముక్త్వా మహాతేజా వ్యాస స్సత్యవతీం తదా।
శయనే సాచ కౌసల్యా శుచివస్త్రా హ్యలంకృతా॥
సమాగమన మాకాంక్షే దితి సోఽన్తర్హితో మునిః॥"

ఇట్లు చెప్పి, వస్త్రాద్యలంకృతయై కౌసల్య శయనమున సమాగ మన మాకాంక్షింపవలెను. అని సత్యవతీదేవితో జెప్పి వ్యాసమహర్షి అంతర్హితుడయ్యెను.

ఈగ్రంథసందర్భము జూడ, సత్యవతీదేవియు భీష్ముడును భరత వంశోద్ధరణమునకై ఆపద్ధర్మ మాలోచించి యెక్కడనో తపోనిష్ఠతో కాలముగడుపు పరమపావనుడగు మహర్షియే యిందుకు సమర్థుడని

యెంచి యాతని స్మరించు నంతట మహర్షి ప్రత్యక్షమై యేమి యాజ్ఞ యని యడుగ నామె చెప్పునపుడు ధర్మ్యముగనే నాయాజ్ఞను, భీష్మానుమతిని, భూతదయను, కోమలహృదయమును, పురస్కరించుకొని లోకరక్షణమునకై నీవుత్తమసంతాన మీయవలెనని కోరుటయు, మహర్షి ధర్మదృష్టితోడనే నీవు చెప్పినట్లు చేయుదును. ఒకసంవత్సరము వారు నేను చెప్పెడి వ్రత మాచరింపవలె ననుటయు, ఆవ్రత మేమో అడుగకయే కాలహరణము కాకూడదని తల్లి వెంటనే అనుగ్రహింప గోరుటయు, అట్లైన నారూపవేషాదులను సహించిన నుత్తమసంతతి కలుగునని చెప్పి యంతర్ధానముగుటయు జరిగినట్లు స్పష్టమేకద.

దీనిని ప్రతివాదులు కాముకవ్యాపారముగా భావించి "తల్లి యానతి యను నెపమున రాణివాసము చేరెను." అని మహర్షిని నిందించినారు.

ఆహా! పురుష ధౌరేయు డగు భీష్ముని యనుజ్ఞయా! ఆభీష్ముని సమక్షమందే తల్లి యాజ్ఞయా! లోకరక్షణాది ప్రయోజనములతో ధర్మము ధర్మ మనుచు ప్రార్థించుటా! ధర్మమునే యాధారపడి మహర్షి యంగీకరించుటా! సంవత్సర మైన తరువాత దానికి కాల మనుటా! తత్క్షణమే కావలె నని సహేతుకముగా తల్లి ప్రార్థించుటా! అట్లైన నారూపవేషాదులను వారు సహింపవలె నని మహర్షి యనుటా! దీనిని కాముకవ్యాపార మని ప్రతివాదు లెంచుటా!

అట్లెంచుటకు స్వయముగా మహర్షియే ఆపనికి ప్రోత్సహించెనా? ఆరాజభార్యల మొగ మెరుగునా? ఎప్పుడో చేయుమన్న పనిని అప్పుడే చేయుదు ననెనా? ఆకాంతల మక్కువను గోరి తన రూపవేషాదులను చక్కబరచుకొనెనా? కాముకవ్యాపారరహస్యములు ప్రతివాదులకు తెలియకుండెనా?

"బుద్ధి ర్యథావిధా యస్య స తథా మన్యతే జగత్" అను పద్మపురాణవచనము, ఎవ్వని కేవిధమైన బుద్ధి యుండునో ఆవిధము గానే ఆతడు లోకమును తెలచుచుండు ననుటవలన వ్యాసమహర్షి యెడల ఉపరితివాదుల భావన అజాతిదే.

విధినిషేధములు లేక సంచరించెడి అజ్ఞాని ప్రవృత్తివలెనే జ్ఞాని ప్రవృత్తి యొకప్పుడు కనబడినను చిత్తవృత్తులలో నపార మైన భేద ముండును. క్రియాసామ్య మున్నను భావశుద్ధినిబట్టి పవిత్రతకనుకనే—

"భావశుద్ధిః పరం శౌచం ప్రమాణం సర్వకర్మసు ।
అన్యథాఽఽలింగ్యతే కాంతా భావేన దుహితాఽన్యథా ॥
అన్యథైవ స్తనం పుత్రి శ్చింతయ త్యన్యథా పతిః ।
చిత్తం విశోధయే త్తస్మా త్కిమన్యై ర్బాహ్యశోధనైః ॥"

అను స్కాందవచనము, కాంతాలింగనపుత్రికాలింగనములలో నాలింగనక్రియ యేకరూపముగా నున్నను, ఆసమయములలోని భావ ములలో గొప్పభేద మున్నది. కాంతా స్తనచింతనము పుత్రుడు చేయు టలోను పతి చేయుటలోను సామ్యము కనబడినను, వారల భావము లలో గొప్పభేద మున్నది. కనుక భావశుద్ధి పరమపవిత్రము. అందుచే బాహ్యశుద్ధులతో సమాప్తిచేయక చిత్తశుద్ధికై పాటుపడవలె నని బోధించుచున్నది. అట్టి చిత్తశుద్ధి యోగుల సొమ్ము. వ్యాసభగవా నుడు మహాయోగి. కనుకనే—

"అయం సాక్షా న్మహాయోగీ వ్యాస స్సర్వజ్ఞ ఈశ్వరః"

అని చెప్పబడెను. అట్లు పరమపవిత్రమైన భావశుద్ధికల మహా యోగియగు వ్యాసభగవానుని పరప్రేరణాపూర్వకప్రవృత్తిని కాము కవ్యాపారముగా గ్రహించుట అజ్ఞానము. జ్ఞానియొక్క ప్రవృత్తి యెట్లుండునో యీశ్లోకము జూడుడు—

"ఉద్బోధితోఽపి కబళే కబళే జనన్యా
నిద్రాలస శ్శిశురి వావిదితాన్యభావః ।
ఆలోకయన్నపి దృశా జగ దిందజాల
మంతః కయాపి కలయా న పరిచ్యుతోఽస్తి ॥"

నిద్రలో నున్న బాలునకు అన్నము బెట్టెడి తల్లి ముద్దముద్దకు లేపుచు బెట్టుచుండ బాలుఁడు రుచిగ్రహణములేకయే ప్రేరణనుబట్టి తినుచుండును. అట్లే జ్ఞాననిష్ఠుని ప్రవృత్తి, రాగద్వేషాదిరహితమై యుండు నని భావము. ఈయంశ మింతటితో విడిచి విషయాంతర మును పరిశీలింతము—

—♦ వ్యాసుఁడు పూతిగంధుఁడను ప్రసంగము–తన్నిరాకరణము ♦—

పూర్వోక్త మైన వ్యాససత్యవతీసంవాదములో—

"వ్రతం చరేతాం తే దేవ్యౌ నిర్దిష్ట మిహ యన్మయా ।
సంవత్సరం యథాన్యాయం తత శ్శుద్ధే భవిష్యతః ॥"

అని యొకసంవత్సర మారాజభార్యలు నేచెప్పెడి వ్రతము యథాన్యాయముగా నాచరించిన శుద్ధురాం డ్రగుదు రని వ్యాసమహర్షి చెప్పగా సత్యవతీదేవి కాలహరణము కాకూడదని వెంటనే యనుగ్రహింపఁగోరగా నపుడు—

"యది పుత్రః ప్రదాతవ్యో మయా భ్రాతు రకాలికః ।
విరూపతాం మే సహతాం తయో రేత త్పరం వ్రతం ॥
యది మే సహతే గంధం రూపం వేషం తథా వపుః ।
అద్యైవ గర్భం కౌసల్యా విశిష్టం ప్రతిపద్యతామ్ ॥"

అని మహర్షి తెల్పెను. ఇచ్చట మ. భా. చ. కారుల వ్రాత యి ట్లున్నది—

"మత్స్యగంధి పరాశరుం డిచ్చిన కస్తూరికావిచే యోజన గంధియైనను, వ్యాసుడు మాత్రము నిషాదరూపుడై పూతిగంధుడు గానె యుండె నని మహాభారతములోని వర్ణనమువలన దెలియ నగును. సత్యవతి వ్యాసు నంబికాంబాలికలయందు బిడ్డల గనుమని నియోగించినపుడు వ్యాసుడు తన వికృతరూపమును, దుర్వాసనను మహారాజభార్యలు సహింపలేరని తలచి ఒకసంవత్సరము వ్రతము చేయవలె ననెను. (మ. భా. చ. పు. 147)

"ఆవికారరూపసహిష్ణుత్వము ఒకవత్సరమున కలవడునని తలచి యావ్రతము జేయు మనినాడు. 'ఆఱునెలల సహవాసముచే వారు వీ రగుదురు' అనినట్లులు (మ. భా. చ. పు. 148)

"అంబిక వికృతరూపముతో నుండిన వ్యాసుని జూచి సహింప లేనిదై యారాత్రి యొకమారైన గన్ను దెరవక మూసికొనియే యుండెను... అంబాలికకూడ వ్యాసుని వికృతరూపమును జూచి తెల్లవోయినది." (మ. భా. చ. పు 147)

ఈవ్రాతలోని యంశములను క్రమముగా బరిశీలింతము—

మత్స్యగంధి కస్తూరికావిచే యోజనగంధియైనను వ్యాసుడు మాత్రము పూతిగంధుడుగానె యుండెనట! ఇట్లనుటలో వ్యాసుని యందు పూతిగంధమును స్థిరపరచి దానిని బట్టి తల్లి మత్స్యగంధియే కాని యోజనగంధి కాదనుటయందు ప్రతివాదులకు తాత్పర్యమా? లేక ఆమె యోజనగంధియే వ్యాసుడుమాత్రము పూతిగంధు డనుట యందు తాత్పర్యమా?

మత్స్యగంధో మహా నాసీ త్పురా మమ జుగుప్సితః ।
త మపాస్య శుభం గంధ మిమం ప్రాదా త్స మే మునిః ।"

(ఆ. అ. 104)

నాశరీరమందు బూర్వము జుగుప్సితమైన మత్స్యగంధ మధికముగా నుండెడిది. పరాశరమహర్షి దానిని తొలగించి నాశరీరమున కీసుగంధ మనుగ్రహించెను. అని యున్న సత్యవతీదేవి వాక్యమువలన పరాశరానుగ్రహమునకు బూర్వము మత్స్యగంధియు, పరాశరానుగ్రహమున యోజనగంధియు నని స్పష్ట మగుచుండ యోజనగంధి కాదనుట తప్పు.

మహాభారతరహస్యకర్తలు వ్రాయుచు— "స్వతస్సిద్ధముగా నామె శరీరము మత్స్యగంధభూయిష్ఠమైనది గాదు" (పు. 78) అనుట కూడ పైసత్యవతీవాక్యముచే ప్రతిహతమైనది మఱియు—

"సత్యవతి తన శరీరము మత్స్యగంధభూయిష్ఠ మని చెప్పుటలో పరాశరునకు తనయం దసహ్యము గలుగవలయు ననియు, నా కారణమున నాతనివలన విముక్తిని బడయవలయు ననియు చెప్పిన వాక్యముకాని స్వతస్సిద్ధముగా నామె శరీరము మత్స్యగంధభూయిష్ఠమైనది గాదు. తాను పల్లెత యై యున్నదగుటచే తద్వ్రృత్త్యనుసారముగా వాకుృచ్చెను." (మ. భా. ర. పు 78)

ఇది రహస్యకర్తల వ్రాత. మత్స్యగంధము తన శరీరమందు లేకున్నను పరాశరునకు తనయం దసహ్యము కలుగుటకై యట్లు చెప్పెనట. పరాశరున కసహ్యము కలుగనేలేదు. కనుక నిట్టి నిరర్థక ప్రసంగము ప్రతివాదుల దనుట మంచిదా? ఆసత్యవతీదేవి దనుట మంచిదా? మఱియు, సత్యవతీశరీరమందు మత్స్యగంధమే లేనియెడల ఉపరిచరవసుమహారాజపుత్రికయైన యామె దాశుని పోషణములో నుండవలసినపని యేమున్నది. మత్స్యగంధ ముండుటనుబట్టియే యట్లు జరిగినది. మత్స్యగంధ ముండుటచేతనే యామె వరము కోరుటలో కన్యాత్వమును, సౌగంధ్యమును కోరెను మహర్షి యనుగ్రహమున

సౌగంధ్యము ప్రక్షిప్తించినతరువాతనే మహర్షి కూడెను కనుక యుక్తి యుక్తము, ప్రామాణికము కాని రహస్యకర్తల వ్రాత పరాస్తము.

మఱియు—

"వృణీష్వ చ వరం భీరు యం త్వ మిచ్ఛసి భావిని ।
వృథా హి న ప్రసాదో మే భూతపూర్వ శ్శుచిస్మితే ॥
ఏవ ముక్తా వరం వవ్రే గాత్రసౌగంధ్య ముత్తమమ్ ।
సచాస్యై భగవాన్ ప్రాదా న్మనసః కాంక్షితం భువి ॥
తతో లబ్ధవరా ప్రీతా స్త్రీభావగుణభూషితా ।
జగామ సహ సంసర్గ మృషిణాఽద్భుత కర్మణా ॥"
టీక-వరం = కన్యాభావం సౌగంధ్యం చ లబ్ధ్వా...
"తేన గంధవతీ త్యేవం నామాస్యాః ప్రథితం భువి ।
తస్యాస్తు యోజనాద్గంధ మాజిఘ్రన్త నరా భువి ॥
తస్యా యోజనగంధేతి తతో నామాపరం స్మృతమ్" (ఆ.63.అ)

అని యున్నగ్రంథము- సత్యవతీదేవితో నేమి కావలెనో నీవు వరము కోరుము. నాయనుగ్రహము వ్యర్థ మెన్నడును కాదు. అని పరాశరమహర్షి చెప్పగా నామె తన శరీరమున కుత్తమమైన సౌగంధ్యమును కోరగా నామహర్షి యట్లే యనుగ్రహించెను.' దానిని బట్టి యామె గంధవతి యనుపేరును, ఆగంధమును యోజనపర్యంతము మనుజులు ఆఘ్రాణించుటనుబట్టి యోజనగంధి యనుపేరునుపొందెను. అని స్పష్టముగా జెప్పుచుండ, దీనికి విరుద్ధముగా రహస్యకర్తలు—

"పరాశరుడు యోజనగంధి వగుదువని వరమిచ్చె ననుటలో నామె నిరుత్తర యగుటకు ప్రతిగా జెప్పిన వాక్యముగాని, యోజనములు కొలది సుగంధవ్యాప్తిగల శరీరముగలదానినిగా జేసెననియుగాదు" (పు.78)అనితోచినట్లుశబ్దమర్యాదను పాటింపకవ్రాయుటనింద్యము.

యోజనగంధి వగుదు వని వరమిచ్చె నన్నమాటకు ఆమె నిరుత్తరయగుటకు చెప్పిన వాక్యమని తాత్పర్యమట. నీవు యోజనగంధి వగుదువని యర్థములేనిమాటను మహర్షి చెప్పిన యెడల నేనట్లు కాలేదేమని సత్యవతీదేవి వెంటనే ప్రశ్నించునా? నిరుత్తరయగునా? యోజనగంధియైనపుడే నిరుత్తరయగును కనుక యుక్తికిని ప్రమాణమునకునువిరుద్ధమైన యీవ్రాతకూడ పరాస్తము.

ఇక మ భా. చ కారుల వ్రాతనే అందుకొందము——

పూర్వోక్తప్రకారము యోజనగంధి యైన తరువాత జన్మించిన వ్యాసుడు పూతిగంధుడుగా నుండెనను ప్రతివాదులమాట నిరాధారము, విరుద్ధమునై యున్నది. 'యది మే సహతే గంధమ్' అను వ్యాస వాక్యమే యాధార మందురు కాబోలు. ఆవాక్యములో దుర్వాసన యని యున్నదా?

నిరంతర తపోనిష్ఠచే విలాసజనాదరణీయములగు శరీరసంస్కారముల నాశ్రయింపని మహర్షి అట్లనియుండెను. కాని దుర్వాసనయని కాదు. ఇంకొకటి. వ్యాసమహర్షి మహాయోగి. యోగప్రవృత్తికి ప్రథమచిహ్నములలో జెప్పబడినది సుగంధ మొకటి చూడుడు——

మార్కండేయపురాణము——

"అలౌల్య మారోగ్య మనిష్ఠురత్వం గన్ధశ్శుభో మూత్రపురీషమల్పం,
కాన్తిః ప్రసాద స్స్వరసౌమ్యతాచ యోగప్రవృత్తేః ప్రథమం
హి చిహ్నమ్॥" (అ.37)

కనుక దుర్వాసన యనుట దురూహ. అంబికాదులకు రాగమూలకప్రవృత్తి లేకుండుటచే వ్రతస్థానీయముగా తత్కాలమందు అవి, వారి కుపదేశింపబడిన నియమము లగుటచే తన సౌగంధ్యాదుల

నప్పు డావిష్కరింపజేయుటకుం బుటకు సంకల్పించి సర్వసమర్థుడు కనుక నట్లు చెప్పెనేమో

మఱియొక నిదర్శనము కలదు— వ్యాసమహర్షి సాన్నిధ్యమున నంబికయు, నంబాలికయు నేమి చేసిన ట్లున్నది?

"తస్య కృష్ణస్య కపిలాం జటాం దీప్తేచ లోచనే ।
బభ్రూణి చైవ శ్మశ్రూణి దృష్ట్వా దేవీ న్యమీలయత్ ॥
అంబాలికా మథాఽభ్యాగా దృషిం దృష్ట్వాచ సాపి తమ్ ।
వివర్ణా పాండుసంకాశా సమపద్యత భారత! ॥"

మ. భా. చ. కారు లీశ్లోకములకు వ్రాసిన యర్థ మెట్లున్నది? "వ్యాసునియొక్క కపిలజటను, ప్రజ్వలించుచుండిన నేత్రములను కపిలవర్ణములు గల పొడుగుమీసముల జూచి రాణి కన్నులను మూసుకొనెను.

అంబాలిక కూడ వ్యాసుని వికృతరూపమును జూచి తెల్లవో యినది" అని యున్నది. ఇందు అంబిక కన్నులను మూసుకొనినది. అంబాలిక తెల్లవోయినది' అనియే యున్నది. కాని యొక్కరును ముక్కు మూసికొనినట్లు లేదు. మ. భా. చ. కారు లన్నట్లు వ్యాసుని యందు దుర్వాసనయే నిజమైనయెడల వారు ముక్కు మూసుకొన వద్దా? దుర్వాసన కలిగినపుడు కండ్లు మూసికొనుటయు! తెల్లబోవుట యునా? కనుక అంబికాంబాలికలు ముక్కుమూసికొనినట్లు లేనందున నీనిదర్శనముచే ప్రతివాదులన్న దుర్వాసన, ప్రతివాదుల అంతఃకరణ మందున్నదే కాని, వ్యాసునియందు దున్నది కాదు. ఇక దీనిని విడచి మ. భా. చ. కారుల వ్రాతలోని యంశాంతర మవలోకింతము—

"వ్యాసునిచే జెప్పబడిన వ్రతము చేయకపోవుటచేతను, అతడు

చెప్పిన వికృతరూపమును సహింపకపోవుటచేతను, మాతృదోష
ముచే బుట్టుగుడ్డియు, పాండురోగియు, గలిగిరని కొందరందురు.
కాని వ్యాసుడుచెప్పిన వ్రత మేదియు గాన్పింపదు ''

"విరూపతాం మే సహతాం తయో రేతత్పరం వ్రతమ్ ।''

అనుటచే నాయొక్క వికారరూపమును సహింపవలెను. వా
రిద్దఱికి నిదియె గొప్ప వ్రతము. అనుటచే వికారరూపసహనమే
వ్రత మని యర్థము. ఆవికారరూపసహిష్ణుత్వ మొకవత్సరమున
కలవడు నని తలచి యావ్రతము జేయు మనినాడు. "ఆఱునెలల
సహవాసముచే వారు వీ రగుదురు'' అనినటులు వ్యాసునితో
నొకయేడాది రూపగంధాదికములను సహించి యంబికాదు లుండి
నచో వారి కలహా టయు దాంపత్యానుకూలత గలిగి యుక్త
సంతానము వారికి గలిగియుండును. అట్లు కాకుండుటచేతనే
యయుక్తసంతతి రాణులకు గలిగెను.'' (మ. భా. చ. పు 148)

ఈవ్రాతలో బుట్టుగుడ్డియు, పాండురోగియు గలుగుటకు
హేతువు వ్యాసునిచే జెప్పబడిన వ్రతము చేయకపోవుట ఆతడుచెప్పిన
వికృతరూపమును సహింపకపోవుట యనుమాతృదోషమే యని కొంద
రన్నా రనుచు వారిమాటను ప్రతివాదులు నిరసించినారు. ఆకొంద
రన్నమాటలో వ్రతము చేయకపోవుట, విరూపతను సహింపక
పోవుట అను రెండు దోషము లుదాహరింపబడియున్నవి. అట్లు వా
రనుటకు—

" వ్రతం చరేతాం తే దేవ్యౌ నిర్దిష్ట మిహ యు స్మయా ।
సంవత్సరం యథాన్యాయం తత శ్శుద్ధే భవిష్యతః ॥
యది పుత్రః ప్రదాతవ్యో మయా భ్రాతు రకాలికః ।
విరూపతాం మే సహతాం తయో రేత త్పరం వ్రతమ్ ॥''

అని వ్యాసమహర్షి చెప్పిన వాక్యములే ప్రమాణము. ఇచ్చట నాచే జెప్పబడిన వ్రతమును యథాన్యాయముగా సంవత్సర మాచరింతు రేని యారాజభార్యలు పరిశుద్ధురాం డ్రగుదురు. అట్లు కాక అకాలమందే పుత్రప్రదానము కావలసివచ్చినపుడు నా విరూపత్వము వారు సహింపవలెను. అది గొప్పవ్రతము

అనుచు సంవత్సరవ్రత మొకటియు, తాత్కాలికవ్రత మొకటియు నుపదేశింపబడెను. ఆసంవత్సరవ్రత మెట్టిదో కాలవిలంబమున కిష్టపడని సత్యవతీదేవి యడుగనే లేదు. అందుచే మహర్షి చెప్పలేదు. తాత్కాలికవ్రతస్వరూపమే చెప్పబడెను.

ఇట్లుండ మ. భా. చ. కారులు వికారరూపసహన మొక్కటియే వ్రతమనియు, నది యొకవత్సరమున కలవడునని తలచి యావ్రతము జేయు మనినాడనియు వ్రాసి "ఆఱునెలలసహవాసముచే వారు వీరగుదురు" అను సామెతను తమకల్పనకు బలకరముగా పైవాదము జూపి నిరసింపబూనిరి. వ్యాసమహర్షి యీసామెతను బట్టియే చెప్పిన యెడల నారుమాసములకే వారు వీరగుచుండ సంవత్సరమని యేలచెప్పెను? "యది పుత్రః ప్రదాతవ్యో మయా భ్రాతు రకాలికః; విరూపతాం మే సహతామ్" అనుచు విరూపత్వసహనము అకాలపుత్రప్రదానమునకు అవలంబింపవలసిన వ్రతమని యుండగా సంవత్సరవ్రతమే యిది యనుట యెట్లుపొసగును? కనుక నిది యసంగతము. వ్యాసునితో నొక యేడాది రూపగంధాదికములను సహించి యంబికాదులుండినచో యుక్తసంతానము వారికి గలిగియుండునట! ఆహా! సత్యవతీదేవితో ప్రసంగించి యావ్రతవిషయము జెప్పి—

"సమాగమన మాకాంక్షే దితి సోఽన్తర్హితో మునిః"

నారాకను కోరవలె నని చెప్పి యంతర్ధానమైన వ్యాసభగవానునితో రాజభార్యలకు సంవత్సరసహవాసమా? సత్యవతీదేవికి దర్శన

మిచ్చినదిమొదలు రాజభార్యలలు తననుస్మరించు నంతవరకైనను అచ్చటనిలువక అంతర్థానమైన మహాయోగితో నేడాది సహవా సమా? కనుకనిదియంతయు నసంగతప్రసంగమగుటచే హేయము.
అంశాంతర మవలోకింలము—

వ్యాసుడు మరియొకప్పుడును స్త్రీలోలుడే అను ప్రసంగము తన్నిరాకరణము.

మ భా. చ. కారుల వ్రాత యిట్లున్నది—"వ్యాసుడు మరి యొకప్పుడును స్త్రీలోలుడే అయ్యెను. శాంతిపర్వమున నీగాథ కలదు"—సత్యవతీసూనుం డగ్నికార్యపరుండై యొకప్పు డరణి పుచ్చుకొని మథింపదొడంగిన ఘృతాచియను నప్సరోవనిత లోచ న గోచరయగుటయు, దానును గామగోచరత్వంబు నొందిన న య్యిందువదన యతని తెరం గెఱింగి వంచనం జిలుకయై యుండె నతండును ధైర్యంబవలంబించి యరణికార్యప్రవణుండై యుండ బ్రబలుండగు నంగజుని చెయ్యి నప్సరోరూపాతిశయాసక్తచిత్తుండైన యా సంయమి శుక్లం బయ్యరణియందుం బడియె. నవ్విప్రుండు నిర్వికారంబగు నంతఃకరణంబుతో నరణిమథనం బొనరించె" పిమ్మట శ్రీశుకుడు పుట్టెనను నంశముతో మనకు నిమిత్తము లేదు. కాని వేదవ్యాసు నంతటివాడు పవిత్రమగు నరణిమథనస మయమున వేరటాండ్రపై దృష్టిబరపుటయె కాదు. వలచుట. అం తమాత్రమే కాదు. అరణిని స్వశుక్లముచే నపవిత్రముచేయుట. యెట్టి ధర్మము? " (పు. 160)

ఈప్రతివాదులకు శుక్లనిస్సరణముతోనే పనిగాని సుతో త్పత్తితో బనిలేదట. వారి కంత మాత్రమే అపేక్షిత మన్నమాట. పుత్రార్థియై తపము జేసి యీశ్వరవరము నందుకొనియున్న వేదవ్యా

నభగవానునికిమాత్రము సుతోత్పత్తియే అపేక్షితము. వేదవ్యాసునకు బరమేశ్వరుడు—

"ఏవంవిధ స్తే తనయో ద్వైపాయన! భవిష్యతి !
యథా హ్యగ్ని ర్యథా వాయు ర్యథా భూమి ర్యథా జలమ్ ॥
యథాచ ఖం తథా శుద్ధో భవితా తే సుతో మహాన్ ।
తేజసావృత్య లోకాం స్త్రీ న్యశః ప్రాప్స్యతి తే సుతః॥"

అని వర మిచ్చెను. అద్వితీయుడగు వేదవ్యాసమునీంద్రునకు అట్టిపరమపవిత్రుడైన శుకయోగి జన్మించుటకై కావలసిన కారణసామగ్రి ఘటించుటలో నగ్నికై యరణిని మథించుచున్న మహర్షికీశ్వరవరప్రభావమున భవితవ్యబలముచే నయత్నసిద్ధముగ ఘృతాచీదర్శనము, అపై దైవికముగా మనోవికారము, ఆపైని మనోనిగ్రహసామర్థ్యము, ఆపైన శుక్రనిస్సరణము, అపుడా యరణినుండి శుకయోగీంద్రావిర్భావము, ఇట్లు జరిగినది చూడుడు. శాంతిపర్వము (3?4 అ)

"సతు ధైర్యేణ మహతా నిగృహ్ణన్ హృచ్ఛయం మునిః ।
న శశాక నియన్తుం త ద్వ్యాసః ప్రవిసృతం మనః ॥
భావిత్వా చ్చైవ భావస్య ఘృతాచ్యా వపుషా హృతః ।
యత్నా న్నియచ్ఛత స్తస్య మునే రగ్నిచికీర్షయా ॥
అరణ్యామేవ సహసా తస్య శుక్ర మవాపతత్ ।
సోఽవిశంకేన మనసా తథైవ ద్విజసత్తమః ॥
అరణీ మమన్థ బ్రహ్మర్షి స్తస్యాం జజ్ఞే శుకో నృప ।
శుక్రే నిర్మథ్యమానే స శుకో జజ్ఞే మహాతపాః ॥"

టీ "శుక్రే నిర్మథ్యమానే జాతత్వా చ్ఛుక ఇతి రేఫలోపేన నామకృతమ్.

"పరమర్షి ర్మహాయోగీ అరణీగర్భసంభవః ।
యథాఽధ్వరే సమిద్ధోఽగ్ని ర్భాతి హవ్య ముదావహన్ ॥
తథారూప శ్శుకో జజ్ఞే ప్రజ్వలన్నివ తేజసా ।
బిభ్రత్పితుశ్చ కౌరవ్య! రూపవర్ణమనుత్తమమ్ ॥
బభౌ తథా భావితాత్మా విధూమోఽగ్ని రివ జ్వలన్ ।
ఉత్పన్నమాత్రం తం వేదా స్సరహస్యా స్ససంగ్రహాః ॥
ఉపతస్థు ర్మహారాజ! యథాఽస్య పితరం తథా ।"

అట్లు అరణీగర్భసంభవుఁడైన శుకయోగి తండ్రియగు వ్యాస మహర్షితో సమానమై యుత్తమమగు రూపమును ధరించెననియు, పుట్టినతోడనె వేదవేదాంగవిద్యలు వ్యాసమహర్షికివలెనే శుకయోగికి గూడ స్వయముగా ప్రతిభాసించినవనియు చెప్పబడినది.

ఇట్లు శుకయోగి అరణినుండి శుక్రనిర్మంథనమూలమున నయోనిజుఁడై జన్మించినట్లుగ్రంథము చెప్పుచుండ దీనికి విరుద్ధముగా రహస్యకర్తలు "అరణి కాదు, అరణ్యా యను నొక ఋషికన్యయందు శుకుడు కలిగెను" (పు 82.) అని వ్రాయుట హేయము. "అరణ్యామేవ సహసా తస్యశుక్ర మవాప తత్" అనుటలో 'అరణ్యామ్' అనుపదముచే నరణి యందు కలిగినట్లు చెప్పబడినది. 'అరణికాదు, అరణ్యయను కన్య యందు కలిగెను' అని వ్రాసిన రహస్యకర్తలు ఏమిచూచివ్రాసినట్లు? శ్లోకమందు 'అరణ్యామ్' అని యున్నది. వారియూహ నిజమైనయెడల 'అరణ్యాయామ్' అని యుండవలయును.

మరియు—

'పరమర్షి ర్మహాయోగీ అరణీగర్భసంభవః' అని యున్నదిగాని 'అరణ్యాగర్భసంభవః' అని లేదు. మరియు— దేవీభాగవతములో వ్యాసమహర్షి శుకునితో బ్రసంగించునపుడు "తప స్తప్త్వా మహాఘోరం

ప్రాప్తోఽసి త్వ మయోనిజః' అని నీవయోనిజుడవై మహాతపఃఫలము గా ప్రాప్తించితివని చెప్పెను. ఇన్ని వచనములకు విరుద్ధముగానున్న రహస్యకర్తలవ్రాత నింద్యము.

మ. భా. చ. కారులు శుకయోగి జన్మప్రస్తావముకల శాంతి పర్వగాథను చూపి, శుకుడు పుట్టె నను నంశముతో మనకు నిమిత్తము లేదని "వ్యాసుడు మఱియొకప్పుడును స్త్రీలోలుడే అయ్యెను. పేరటాం డ్రపై దృష్టిబరపెను వలచెను' అని వ్రాయుట వారి దోషదృష్టినే వెల్లడించుచున్నది. ఈ మ. భా. చ. కారులే యొకచోట "యోగ శక్తిచేతను, నింద్రియజయముచేతను వ్యాసు డంతదీర్ఘకాలము జీవిం చియుండె ననుటలో నతిశయోక్తిలేదు" (పు 45) అనుచు వ్యాసుని జితేంద్రియుడన్నారు. ఇచ్చట స్త్రీలోలు డన్నారు వారినోటి కడ్డేమున్నది? వెనుక వేదవ్యాసుని ఛండాలజాతిజు డన్న మ. భా. చ. కారులకు వారు చూపిన శాంతిపర్వ వచనగ్రంథములో వ్యాసుడు విప్రుడనియే యున్నదిసుమా. యని తెలుపుచు నంశాంతర మందుకొ నుచున్నాము—

"దృష్టో ధర్మవ్యతిక్రమః" అను ఆపస్తంబసూత్రము
వ్యాసునియందు వర్తించె నను ప్రసంగము-తన్నిరాకరణము.

మ. భా. చ. కారుల వ్రాత యిట్లున్నది—

"దృష్టో ధర్మవ్యతిక్రమ స్సాహసం చ' అను నాపస్తంబుని సూత్ర మువ్యాసునియందు వర్తించెను. కాన వాల్మీకివలె వ్యాసుడు ధర్మ ప్రతిపాదకస్వభావముగలఋషి కాడనితలంపవలసియున్నది' (పు160)

వ్యాసునియందు ధర్మవ్యతిక్రమము దృష్టమయ్యెనట. అందుచే నాతడు ధర్మప్రతిపాదకస్వభావముగల ఋషి కాడట. వ్యాసుడుతాను

చేసియున్న ధర్మవ్యతిక్రమమునే, లోకులను చేయుమని ప్రతిపాదించి నపుడు వ్యాసుడు ధర్మప్రతిపాదకస్వభావముకలవాడు కాడనవచ్చు నేమో కాని యాతడు ప్రతిపాదించినది ధర్మవ్యతిక్రమము కాక ధర్మమే యగుటచే నట్లనుట ప్రతివాదుల కయుక్తము. ఆధర్మవ్యతిక్రమముచే దోషము వారికి లేదనికూడ నాపస్తంబసూత్రమే చెప్పుచున్నది. చూడుడు—

ఆపస్తంబధర్మసూత్రము— (ప్ర. 2 ఖ13)

"దృష్టో ధర్మవ్యతిక్రమ స్సాహసంచ పూర్వేషామ్ ॥
"తేషాం తేజోవిశేషేణ ప్రత్యవాయో న విద్యతే॥"

వ్యా. కి మిదానీం తేషాం దోషః? నే త్యాహ—తాదృశంహి తేషాం తేజః యదేవంవిధైః పాపభి ర్న ప్రత్యవయన్తి తథాచ ఛాందోగ్యే శ్రూయతే—తద్యథైషీకాతూల మగ్నౌ ప్రోతం ప్రదూయే తైవం హాస్య సర్వే పాప్మానః ప్రదూయన్తే" ఇతి.

"త దన్వీక్ష్య ప్రయుంజాన స్సీద త్యవరః"

వ్యా...తం చ వ్యతిక్రమం తచ్చ సాహస మన్వీక్ష్య దృష్ట్వా స్వయమపి తథా ప్రయుంజానో ౽వరః ఇదానీన్తనః సీదతి ప్రత్యవైతి నహ్యగ్ని ప్సర్వం దహతీ త్యస్మాక మపి తథా శక్తి రితి"

పూర్వులయందు గోచరించిన ధర్మవ్యతిక్రమము సాహసము. వారి తేజోవిశేషముచే నగ్నియందు పడిన దూదివలె భస్మమై వారికి దోష మాపాదింపదు. సర్వమును దహించెడి శక్తి యగ్ని కున్నట్లు అన్యులకు లేదు కనుక వారు చేసినట్లు అన్యుడు చేసిన చేటు తప్పదు. అని భావము.

ఇప్పుడు ప్రతివాదులు వ్రాసిన విధముగా 'దృష్టో ధర్మవ్యతిక్రమ స్సాహసం చ' అను నాపస్తంబసూత్రము వ్యాసునియందు వర్తించినట్లే—

"తేషాం తేజోవిశేషేణ ప్రత్యవాయో న విద్యతే" అను సూత్రముకూడ వర్తించినది. కనుక వ్యాసభగవానుడు పరమపావనుడని ప్రతివాదులకు వారి యాపస్తంబుడే గట్టిగా బోధించెను.

ఆపస్తంబుడు చెప్పినట్లే వ్యాసమహర్షికూడ "యావదధికారమవస్థితి రాధికారికాణామ్" అను బ్రహ్మసూత్రముచేతను, శ్రీమద్భాగవతములో నొకానొకప్రస్తావమున "తేజీయసాం న దోషాయ వహ్నే స్సర్వభుజో యథా" అను వాక్యముచేతను మహాతేజశ్శాలులకు ధర్మవ్యతిక్రమములు తటస్థించినను వారి కవి దోషావహములు కావని చెప్పుచు నన్యు లావిధముగా జేయరాదని బోధించియుండెను. మహర్షులు తమకు తటస్థించిన ధర్మవ్యతిక్రమములను మీరుకూడ జేయుడని లోకులకు జెప్పినవారు కారు. వేదవిధుల ననుసరించి యధికారానుగుణముగా లోకులకు ధర్మములను బోధించినవారే. కనుకనే—

అనుష్ఠితంచ య ద్దేవై ర్మునిభి ర్యదనుష్ఠితమ్ ।
నానుష్ఠేయం మనుష్యై స్త దుక్తం కర్మ సమాచరేత్ ॥"

అను బోధాయనోక్తి దేవతలు చేసిన పనులను, మునులుచేసిన పనులను చేయక మనుష్యులు, ఆదేవతలు మునులు చేయుమనిచెప్పిన పనులనే చేయవలసిన దని తెలుపుచున్నది. ఇట్లుండ వ్యాసునియందు ధర్మవ్యతిక్రమము దృష్టమయ్యెనట! అందుచే వ్యాసుడు ధర్మప్రతిపాదకస్వభావుడు కాడట! ఆహా! అష్టాదశమహాపురాణములను, మహాభారతమును, బ్రహ్మసూత్రములను, వేదభాగమును లోకుల కనుగ్రహించి నారాయణావతారమై అణిమాదిశక్తులుకలిగి విరాజిల్లు వ్యాస

భగవానుడు ధర్మప్రతిపాదకస్వభావుడు కాడా? మహాభారతమంతయు గాలించి మహాభారతచరిత్రము వ్రాసిన ప్రతివాదులకు తుదకు తెలిసిన దిదియా?

"యస్య నాస్తి వివేకస్తు కేవలం యో బహుశ్రుతః।
న స జానాతి శాస్త్రార్థాన్ దర్వీ పాకరసా నివ ॥"

అను శ్లోకము జ్ఞప్తికి వచ్చుచున్నది. పాయసపాత్రిలో మునిగి యను గరిటెకు రుచి తెలియునా?

"వాల్మీకివలె వ్యాసుడు ధర్మప్రతిపాదకస్వభావముగల ఋషి కా" డను ప్రతివాదుల మాటకు రామాయణమువలె మహాభారతము ధర్మప్రతిపాదకము కాదను తాత్పర్య మూహ్య మగుచున్నది.

ఈవిషయమై రామాయణ మహాభారతములను గూర్చి లోకమాన్యుడు వ్రాసిన విషయమును మాత్రమే వారికి వినిపింతము— గీతారహస్యపరిశిష్టము—(పు. 717)

"మహాభారతమువలెనే రామాయణముసైతము ఎల్లవారును గౌరవించునదియు, గొప్పదియు నగు నార్షమహాకావ్యము గాన దానియందును కథాసందర్భమునుబట్టి సత్యములును, పుత్రధర్మములును, మాతృధర్మములును, రాజధర్మములును మొదలగువానియందలి రహస్యము వివేచింపబడినది. కాని యీరామాయణము మహాభారతమువలె ననేకసమయాన్వితము కాదుకనుక (అనగా సూక్ష్మములగు ధర్మాధర్మములయొక్క అనేకన్యాయములతో నిండి యెల్లరకు నన్నివిధములచేతను శీలచరిత్రాదులను బోధించుటకై వాల్మీకి రచియింపలేదు గాన) ధర్మాధర్మములనుగాని, కార్యాకార్యములనుగాని, నీతినిగాని, బోధించువిషయమున మహాభారత

ముతో సమానమైనది గాదని వేఱుగ చెప్పవలదు. మహాభారత మనునది కేవల మార్షకావ్యముగగాని, కేవలమితిహాసముగగాని, యుండక ధర్మాధర్మములయందలి సూక్ష్మవిషయములను నిరూపించు నొక సంహితగ నున్నది"

దీనివి బట్టి మహాభారతకర్తయగు వ్యాసభగవానుడు ధర్మప్రతిపాదకస్వభావుడే యనిస్పష్టమైనది. ప్రతివాదు లుదాహరించినఆపస్తంబుని సూత్రమును బట్టి వ్యాసమహర్షి పరమపావనుడని స్పష్టమైనది. వెనుక ప్రదర్శింపబడిన పూర్వోత్తరమీమాంసాశాస్త్రములుకూడ వ్యాసమహర్షిని పరమపావను డనియే నిరూపించినవి. కనుక మ. భా. చ. కారుల అసంగతప్రసంగ మపాస్తమైనది.
అంశాంతర మవలోకింతము—

ధర్మమును క్రిందుగా నిరూపించినవాడు వ్యాసు డను వాదము-
తన్నిరాకరణము.

"మొత్తమునకు ధర్మమును అర్థకామములచే గ్రిందుగా నిరూపించినవాడు వ్యాసుడు" (మ. భా. చ పు160)

ఈ మ. భా. చ. కారులు మహాభారతమును తా మేపద్ధతిని విమర్శింపబూనిరో తెలుపుచు వెనుక నిట్లు వ్రాసియున్నారు—

"రామాయణమహాభారతములు పాశ్చాత్యవిద్యాపద్ధతి ననుసరించి బహిరంగపరీక్షకు లోనగుచున్నవి. అంతరంగపరీక్షకంటె బహిరంగపరీక్ష జనసామాన్యదృష్టి నాకర్షించి విశేషవివాదములకు గారణ మగును. (బహిరంగపరీక్ష యనగా గాధ జరిగిన కాలము, కవి కాలము, గాథావిశేషములు మొదలగువాని విమర్శనము. అంతరంగపరీక్ష యనగా శబ్దార్థాదివిమర్శనవిశేషములు- (నాశక్తి

కొలది మహాభారతమును బహిరంగపరీక్షచే సంగ్రహముగ విమర్శించుచున్నాడను.'' (పు 4)

దీనినిబట్టి వీరిది పాశ్చాత్యవిద్యాపద్ధతి యనియు, బహిరంగ పరీక్ష యనియు స్పష్టము. ఆబహిరంగపరీక్షలో శబ్దార్థాదివిమర్శన విశేషము లుండవని వారే చెప్పినారు. శబ్దార్థవిమర్శనవిశేషము లేనిదే గ్రంథస్థవిషయ మెట్లు తెలియును? అది తెలియనపుడు గ్రంథమం దేమున్నదో యెట్లున్నదో చెప్పుటకు వీ రనధికారులు. కనుక ధర్మమును క్రిందుగా నిరూపించినవాడు వ్యాసుడను వీరిమాట హాస్యాస్పదము. ఇట్టిప్రతివాదుల కితోధిక ము చెప్పుట యనావశ్యక మగుటచే నింతటితో దీనిని విడిచి యంశాంతర మందుకొందము.

—♦ కర్ణోత్పత్తిప్రస్తావము ♦—

కన్యకలు బిడ్డల గనుట దోషముకాదను వాదము—తన్నిరాకరణము.

"నాడు కన్యకలు బిడ్డల గనుట దోషము కాదని యాశ్రమవాసపర్వములోని కుంతీవ్యాసుల సంభాషణము చెప్పుచున్నది''

''వ్యాసుని తల్లి యగుసత్యవతికూడ కుంతివలె రహస్యముగా వ్యాసుని గని కన్యాభావము నొందుట గమనింపతగినవిషయము. "మామయగు వ్యాసునితో గుంతి తన చిన్నతనపుచేష్టను వెల్లడించినటులు వ్యాసుని తల్లి సత్యవతి సవతికొడుకగు భీష్మునికడ తన చిన్నతనపుజేష్ట నిట్లు సంతోషపూర్వకముగానే చెప్పినది''

"వ్యాసభీష్ములవంటి మహానుభావు లట్టి యధర్మమును ధర్మముగా నంగీకరించుట కానాటి దేశకాల పరిస్థితులే కారణమై యున్నవా? లేక వ్యాసభీష్ములుకూడ ధర్మవైరుధ్యమున కిష్టపడియుండిరా? ఆలోచింప నాటి పరిస్థితులే అట్టివి కావచ్చు నని తోచెడి'' (పు. 77. 80)

ఈప్రతివాదులు- కన్యకయైయుండి వ్యాసుని గని కన్యాత్వమునే వహించిన సత్యవతీదేవిని, కన్యకయైయుండి కర్ణుని గని కన్యాత్వమునే వహించిన కుంతీదేవిని, నిదర్శనముగా జూపి 'నాడు కన్యకలు బిడ్డల గనుట దోషము కా' దని సామాన్యముగా వ్రాసి దాని కాశ్రమవాసపర్వములోని కుంతీ వ్యాససంభాషణము ప్రమాణ మనిరి. అందుకై ముందాసంభాషణమును జూతము —

ఆశ్రమవాసపర్వ—(అ. 30)

"భగవన్! శ్వశురో మేఽసి దైవతస్యాపి దైవతమ్ ।
సమే దేవాతిదేవ స్త్వం శృణు సత్యాం గిరం మమ ॥
తపస్వీ కోపనో విప్రో దుర్వాసానామ మే పితుః ।
భిక్షా ముపాగతో భోక్తుం త మహం పర్యతోషయమ్ ॥
శౌచేన త్వాగస స్త్యాగై శ్శుద్ధేన మనసా తథా ।
కోపస్థానే ష్వపి మహ త్స్వకుప్య న్న కదాచన ॥
స ప్రీతో వరదో మేఽభూ త్కృతకృత్యో మహామునిః ।
అవశ్యం తే గ్రహీతవ్య మితి మాం సోఽబ్రవీ ద్వచః ॥
తత శ్శాపభయా ద్విప్ర మవోచం పున రేవ తమ్ ।
ఏవ మస్త్వితిచ ప్రాహ పున రేవ సమే ద్విజః ॥
ధర్మస్య జననీ భద్రే భవిత్రీ త్వం శుభాననే ।
వశే స్థాస్యన్తి తే దేవా యాం స్త్వ మావాహయిష్యసి ॥
ఇత్యుక్త్వాఽన్తర్హితో విప్ర స్తతోఽహం విస్మితాఽభవమ్ ।
నచ సర్వా స్వవస్థాసు స్మృతి ర్మే విప్రణశ్యతి ॥
అథ హర్మ్యతలస్థాఽహం రవి ముద్యన్త మీక్షతీ ।
సంస్మృత్య తదృషే ర్వాక్యం స్పృహయన్తీ దివాకరమ్ ॥
స్థితాఽహం బాలభావేన తత్ర దోష మబుధ్యతీ ।
అథ దేవస్సహస్రాంశు ర్మత్సమీపగతోఽభవత్ ॥

ద్విధా కృత్వాత్మనో దేహం భూమౌ చ గగనే௨పిచ ॥
తతాప లోకా నేకేన ద్వితీయే నాగమ త్స మామ్ ।
స మా మువాచ వేప న్తీం వరం మత్తో వృణీష్వహ ॥
గమ్యతా మితి తం చాహం ప్రణమ్య శిరసా௨వదమ్ ॥
స మా మువాచ తిగ్మాంశు ర్వృథాహ్వానం న మే క్షమమ్ ।
ధక్ష్యామి త్వాంచ విప్రంచ యేన దత్తో వర స్తవ ॥
త మహం రక్షతీ విప్రం శాపా దనపకారిణమ్ ।
పుత్రో మే త్వత్సమో దేవ భవే దితి తతో௨బ్రువమ్ ॥
తతో మాం తేజసా௨௨విశ్య మోహయిత్వాచ భానుమాన్ ।
ఉవాచ భవితా పుత్ర స్తవే త్యభ్యగమ ద్దివమ్ ॥
తతో௨హ మ న్తర్భవనే పితు ర్వృత్తా న్తరక్షిణీ ।
గూఢోత్పన్నం సుతం బాలం జలే కర్ణ మవాసృజమ్ ॥
నూనం తస్యైవ దేవస్య ప్రసాదా త్పున రేవ తు ।
కన్యా௨హ మభవం విప్ర యథా ప్రాహ స మా మృషిః ॥
స మయా మూఢయా పుత్రో జ్ఞాయమానో௨ ప్యుపేక్షితః ।
త న్మాం దహతి విప్రర్షే యథా సువిదితం తవ ॥
యది పాప మపాపం వా యదేత ద్వివృతం మయా ।
ఇత్యుక్తః ప్రత్యువాచేదం వ్యాసో వేదవిదాం వరః ॥
సాధు సర్వ మిదం భావ్య మేవ మేత ద్యథాత్థ మామ్ ।
అపరాధశ్చ తే నాస్తి కన్యాభావం గతా హ్యసి ॥
దేవా శ్చైశ్వర్యవన్తో వై శరీరా ణ్యావిశ న్తి వై ।
స న్తి దేవనికాయాశ్చ సంకల్పా జ్జనయ న్తి యే ॥
వాచా దృష్ట్యా తథా స్పర్శా త్సంఘర్షేణేతి పంచధా ।
మనుష్యధర్మో దైవేన ధర్మేణహి న దుష్యతి ॥
ఇతి కు న్తి విజానీహి వ్యేతు తే మానసో జ్వరః ।

ఇచ్చట కుంతీదేవి యిట్లు చెప్పుచున్నది—

ఓవ్యాసభగవానుడా! నీవు దేవాతిదేవుడవు. నాసత్యవచనము వినుము. వెనుక నొకప్పుడు మహర్షియగు దుర్వాసుడు నాతండ్రియింటికి భిక్షార్థము వచ్చియున్నప్పుడు మహాతపస్వియు, మహాకోపియునైన ఆమహర్షికి పరిశుద్ధమనస్సుతో నెన్నియో కష్టములను సహించి పరిచర్య జేసితిని. అంతట వరదుడైన మహర్షి సంతుష్టుడై వర మిచ్చి మంత్రముపదేశించి నీ వేదేవతల నాహ్వానింతువో వారు నీకువశులగుదురు. నీవు ధర్మజనని వయ్యెదవు. అని చెప్పి యంతర్హితుడయ్యెను. నేనాశ్చర్యపడితిని. ఆమహర్షి యుపదేశము సర్వావస్థలయందును నాకు స్మృతికి వచ్చుచునే యుండెను. అంతట ప్రాసాదముపైనున్న నే నుదయించుచున్న సూర్యుని జూచి ఋషివాక్యమును స్మరించి బాల్యముచే నేమి చిక్కువచ్చునో యెరుగక సూర్యుని భావన జేసితిని. అపుడాసూర్యుడు దేహాంతరమును ధరించి నాసమీపమునకు వచ్చి వరము కోరుమనగా నేను వందనము జేసి వెళ్ళుచుంటిని.

అప్పుడు సూర్యుడు- నాయాహ్వానము వ్యర్థము కాకూడదు. నీకును నీకు, వరమిచ్చిన విప్రునకును హాని గలిగింతును అని చెప్పగా సూర్యశాపమునుండి దుర్వాసుని రక్షింపదలచి నీతో సమానుడగు పుత్రుడు నాకు గలుగవలెనని కోరితిని. అంతట తేజస్సుచే నన్నావేశించి వ్యామోహితురాలిని జేసి నీకు బుత్రుడు కలుగునని చెప్పి దివమున కేగెను.

తరువాత నేనంతఃపురమందు గూఢోత్పన్నుడైన బాలుని-పితృమర్యాదను కాపాడుదాననై జలమందు విడిచితిని. నిజముగా నాసూర్యదేవుని కజాతుమున మరల నాకు కన్యాత్వము ప్రాప్తించినది. దుర్వాసోమహర్షి చెప్పినట్లే జరిగినది. నేను మూఢురాలనై పుత్రు

నుపేక్షించితిని. పుణ్యమో పాపమో నీయొద్ద వివరింపబడిన యీవిష యము నన్ను పీడించుచున్నది. నీకు విదితమే. ఈకుంతీదేవి ప్రసంగ ముపై వ్యాసభగవానుడు- నీవెట్లు చెప్పితివో అట్లది జరుగవలసిన విధియై యున్నది. (నీకు సూర్యాంశమున సుతుడు గూఢముగా బుట్టి దూరమైపోయి దుర్యోధనునిజేరి యుద్ధహేతువుకావలసిన విధి యట్లు న్నది.) నీకపరాధము లేదు. నీవుకన్యకవైకదా అప్పుడుంటివి. అణిమా దిసిద్ధులుకల దేవతలు శరీరముల నావేశింతురు. సంకల్పముచేతను, వాక్కుచేతను, దృష్టిచేతను, స్పర్శచేతను, రతిచేతను, ఐదువిధములు గా దేవతలు సంతతి నిచ్చుచుందురు మనుష్యధర్మము దైవధర్మముచే దూషితము కాదు. కుంతీదేవీ! నీకు మనోవ్యథతో బనిలేదు. అని చెప్పెను.

ఇందు, కుంతీదేవి మాటలలో కన్యావస్థయందు సూర్యసంబం ధమున తనకు గూఢముగా సుతుడు గలుగుట, తండ్రి మర్యాదను కాపాడుటకై శిశువును జలమందు విడుచుట జరిగె నని యున్నది. అట్లు ఆమె విడుచుట లోకాపవాదభీతిచేతనే యని స్పష్టమగుచున్నది.

వ్యాసభగవానుని మాటలలో గూడ దుర్వాసోమహర్షి యుప దేశము మొదలు సూర్యసంబంధసుతోత్పత్తిసుతపరిత్యాగాంతకృత్య ములు విధివశమున జరిగినవి ఆఘటన యంతయు నీకు కన్యాదశ యందు అట్టి యిచ్ఛలేనప్పుడు తటస్థించినది కనుకను, దేవతలు సంక ల్పాదులచే నైదువిధములుగా సంతతినిచ్చువారు కనుక దేవధర్మముచే మనుష్యధర్మము దూషితము కాదు కనుకను నీతప్పు లేదు అని యున్నది. ఈకుంతీవ్యాససంభాషణములో కన్యకలు బిడ్డల గనుట దోషము కాదని యున్నదా? సూర్యానుగ్రహమున సుతుని గన్న కుంతీదేవి కది దోషము కాదని యున్నదా? మ భా. చ. కారులన్నట్లు నాడు కన్యకలు బిడ్డల గనుట దోషము కానియెడల సహజ

కవచకుండలశోభితుడై యున్న శిశువును ఆమె యేల విడిచినది? పిడు వని యెడల తండ్రికి మర్యాద యేమున్నది? వ్యాసభగవానుడైనను లోకములో కన్యకలు బిడ్డల గనుట ధర్మమే కనుక నీవా బిడ్డను విడిచి వేయుటచే తప్పుచేసినా వని యేల చెప్పలేదు? ఎవ్వనివలన కన్యకలు బిడ్డల గనినను దోషములేనపుడు మనుష్యధర్మము దేవధర్మముచే దూషితము కాదని యేలచెప్పెను? కనుక "నాడు కన్యకలు బిడ్డల గనుట దోషము కాదని...కుంతీవ్యాసుల సంభాషణము చెప్పు చున్నది" అను వ్రాత నింద్యము.

రహస్యకర్తలు—వ్యాసమహర్షి కుంతికిడిన ప్రత్యుత్తరవాక్య మును విచారింతము. అని యిట్లు వ్రాసిరి—ఉత్తమమానవు డొక ప్పుడు తన పాపకర్మకు పశ్చాత్తాపతప్తు డగుట యుక్తమేకాని జీవితకాల మంతయు చింతింపగూడదు...పశ్చాత్తాపముచే పాప పరిహారము గావించుకొని యంతటితో నాపాపచింతను వీడి నిర్మల మైన మనస్సుగలవాడై యిక నాపాపకర్మలవెంట బోవక స్వోచిత ప్రవర్తనుడై మెలంగవలయును ఈ హేతువుచేతనే వ్యాసుడు కుంతితో "ఇక నీకాచింత యుండగూడదు" అని స్పష్టముగా జెప్పియున్నాడు" (పు. 41)

ఈప్రతివాదుల విచారములో— కుంతికి పాపము తటస్థించె ననియు, నది యామె పశ్చాత్తాపముచే బరిహృత మైన దనియు నిక నీకాచింత యుండగూడదని మహర్షి బోధించె ననియు తేలినది.

ఇక గ్రంథమందు 'అపరాధశ్చ తే నాస్తి' 'మనుష్యధర్మో దైవేన ధర్మేణ హి న దుష్యతి । ఇతి కుంతి విజానీహి వ్యేతు తే మానసో జ్వరః" అనుటలో నీకు పాపమే లేదని బోధించె నని యున్నది. కనుక వీరిది దుర్విచారమే. పశ్చాత్తాపముచే పాపపరిహార ము గావించుకొనవలెనట. జీవితకాలమంతయు చింతింపరాదట. ఇంత

కాలము చింతించిన పాపపరిహార మగునని వీరు చెప్పగలరా? కనుక వీరి యసంగతప్రసంగము హేయము.

మఱియు కుంతీదేవి వ్యాసభగవానునియొద్ద దుర్వాసోమహర్షి యుపదేశము మొదలు సుతుని విడుచుపర్యంతము వివరించి చెప్పి—

"త న్మాం దహతి విప్రర్షే...యది పాప మపాపం వా య దే త ద్వివృతం మయా" అనుచు నీయొద్ద వివరింపబడిన యీవిషయము పాపమో పుణ్యమో నన్ను పీడించుచున్న దని తన విచారమును వెల్లడించెను. ఇట్లుండ మ. భా. చ కారులు ఈశ్లోకముల కర్థము జెప్పుచు— "కుంతికి రహస్యముగా బిడ్డం గంటి నను విచారము లేదు కాని ఆబిడ్డను దెలిసియు, నుపేక్షించితి నను నదియే విచారకారణము" (పు. 78)

అని వ్రాయుటయు నింద్యమే

"అథ హర్మ్యతలస్థాహం రవి ముద్యంత మీక్షతీ।
సంస్మృత్య తదృషే ర్వాక్యం స్పృహయంతీ దివాకరమ్॥
స్థితాహం బాలభావేన తత్ర దోష మబుద్ధ్యతీ।"

అనుచు బాల్యముచే సూర్యభగవానుని భావన జేసిన వచ్చెడి దోష మెరుగక హర్మ్యతలము నందుండి సూర్యుని భావన చేసితిని. అని చెప్పుకొనుటలో సూర్యుని భావన జేయుటే తప్పైన దని యామె విచారించినట్లు కనబడలేదా? ప్రతివాదు లన్నట్లు రహస్యముగా బిడ్డను గంటి నని కుంతీదేవికి విచారమే లేని యెడల వ్యాసభగవానుని మాటలలో—

"అపరాధశ్చ తే నాస్తి కన్యాభావం గతా హ్యసి।
దేవా శ్చైశ్వర్యవంతో వై శరీరా ణ్యావిశంతి వై॥

మనుష్యధర్మో దైవేన ధర్మేణ హి న దుష్యతి ।
ఇతి కుంతి! విజానీహి వ్యేతు తే మానసో జ్వరః ॥''

అనుచు కన్యకవై యున్న నీ కపరాధ మేమియు లేదు. దేవతలు శరీరముల నావేశింతురు. దైవధర్మముచే మనుష్యధర్మము దూషితము కాదు. నీమనోవ్యథను తొలగించుకొనుము. అను ప్రసంగమున కవసర మేమి?

రహస్యముగా బిడ్డను గన్న విచార మామెకు పరిహరించుటకే ఆప్రసంగ మవసరమైనది. కనుక నీ మ భా. చ. కారుల వ్రాత హేయము.

— కర్ణోత్పత్తిని గూర్చి రహస్యకర్తల వాదము-తన్నిరాకరణము —

ఈవిషయములో రహస్యకర్త యెంతవిరుద్ధముగా వ్రాసిరో చూడుడు—

"కుంతీపరిచర్యచే తృప్తుండైన యతి యామెకు మంత్రోపదేశ మొనరించినపుడు యౌవనవతి యగు కుంతి యౌత్సుక్యముచే మంత్రసత్త్వమును గ్రహింపగోరి సూర్యమండలాంతర్వర్తి యగు నాధిదైవికపురుషునియందు మనసుంచి తన మంత్ర మొక సత్త్వవంతునియందు ప్రయోగింప నామంత్రశక్తిచే ప్రేరితుండైన పురుషునియందు మంత్రమూర్తి యగు సూర్యు నావహింపజేసి తన్మూర్తియందే లక్ష్య ముంచి యాసత్త్వవంతునితో భోగించెను. అందుచే నామె గర్భమునందు సూర్యసన్నిభుం డగు కుమారుడు జన్మించెను'' (పు. 439)

"ఈకర్ణజననమునుగూర్చి కొందరు విమర్శకులు ఈమె దుర్వాసునకు పరిచర్య చేయుచున్న సమయమున నీమెయందు కామమోహితుడైన దుర్వాసునివలననే యీామె గర్భవతియై యుండును

గానిదుర్వాసుని మంత్రప్రభావమున గాదనియు, గర్భవతి యైన పిమ్మట తద్రహస్యగోపనమునకై యీరీతిగా ప్రవర్తింపు మని దుర్వాసుడే యామెకు బోధించియుండు ననియు, నటుపిమ్మట తన దుష్కర్మకు దాను పశ్చాత్తాపము నొందుచు విధిలేక నామె యట్లే ప్రవర్తించియుండు ననియు చెప్పుచున్నారు.

కాని యిందు సత్య మెంతవరకు గలదో మన మూహింపలేము. దుర్వాసునివంటి దివ్యర్షి యిటువంటి యకృత్యమును గావించెనను టయు సందేహాస్పదముగా నున్నది. కాని యనవసరక్రోధమునకు వశుడైనట్లే కామమునకు గూడ వశుడై యుండవచ్చుననియు తోచుచున్నది. పరాశరుని వంటి తపోధనుడు అవివాహితగా నున్న సత్యవతిని భోగించెను. అట్లే యిచ్చట దుర్వాసుడు కూడ కుంతిని భోగించెనేమో?" (పు619)

ఔరా! వీరి దెంత వక్రమార్గమో ' చూడుడు—కుంతీదేవికి మంత్రోపదేశముచేసినవాడు యతి యగు దుర్వాసుడట. ఆమంత్ర మూర్తి సూర్యుడేనట. సూర్యమండలాంతర్వర్తియందే కుంతీదేవి మన సుంచెనట. తనమంత్రమును మాత్రము సత్త్వవంతుడగు నొక పురుషునియందు ప్రయోగించి యాపురుషునియం దామంత్రశక్తిచే సూర్యు నావహింపజేసెనట సూర్యునియందే లక్ష్యముంచి యాసత్త్వ వంతునితో భోగించెనట. అందుచే సూర్యసన్నిభు డగు కుమారుడు జన్మించెనట. వీరి వ్రాతనుబట్టికూడ మంత్రమూర్తి సూర్యుడే యైయుండ, కుంతీదేవి తనకు లక్ష్యమైయున్న సూర్యునియందే తన మనస్సు నిలిపియుండ, మంత్రశక్తి సంశకరింపక గత్యంతరము వీరికి లేనిదైయుండ, మంత్రశక్తిచే నాసూర్యుడు వచ్చి యెవ్వనియందో

ఆవహింపచెనని చెప్పుట తప్పనిసరియైయుండ, నామంత్రశక్తిచే నానా ర్యుడే దేహాంతరధారియై వచ్చి స్వయముగా కుంతీదేవికి పుత్రు నను గ్రహింపచెనని గ్రంథమందు చెప్పబడినట్లుభావింపక కుకల్పనతో నత్త్వ వంతుడనుచు నెవ్వనినో మార్చిన వీరి కీబకబంధనప్రయాస మేలనో!

ఒకడు బకమును బంధింపదలచి దానియొద్దకుబోయి యింత వెన్న దాని నెత్తిపై నుంచి యది కరగి దానికండ్లలోనికి కారినతరువాత బక మును బంధించెనట. దానినెత్తిపై వెన్నబెట్టినపుడే బంధింపదగియుండ నాపైచర్య వ్యర్థప్రయాసమగుటచే నది బకబంధనప్రయాసమనబడినది.

పాప మీరహస్యకర్తలకు సూర్యుడేమి? శరీరధారియై కుంతీ దేవియొద్దకు వచ్చి సంతాన మిచ్చుటయేమి? అనిపించినది కాబోలు. వీరికి శాస్త్రమర్యాద నొకింత వినిపింతము.—

దేవతాధికరణము- బ్రహ్మసూత్రము—

"భావంతు బాదరాయణోఽస్తి హి"

భాష్యమ్—అస్తి హ్యైశ్వర్యయోగా ద్దేవతానాం జ్యోతిరా ద్యాత్మభిశ్చావస్థాతుం యథేష్టంచ తం తం విగ్రహం గ్రహీతుం సా మర్థ్యం। తథాహి శ్రూయతే... మేధాతిథిం హ కాణ్వాయన మిన్ద్రో మేషో భూత్వా జహార.

స్మర్యతేచ—ఆదిత్యః పురుషోభూత్వా కున్తీ ముపజగామహ" ఇతి... యాదృశం మన్త్రార్థవాదయో రింద్రాదీనాం స్వరూప మవగతం న తత్తాదృశం శబ్దప్రమాణకేన ప్రత్యాఖ్యాతుం యుక్తమ్, ఇతిహాస పురాణమపి వ్యాఖ్యాతేన మార్గేణ సంభవన్మన్త్రార్థవాదమూలత్వా త్ప్రభవతి దేవతావిగ్రహాదిసాధయితుం ప్రత్యక్షాదిమూలమపిసంభవతి. భవతి. హ్యస్మాక మప్రత్యక్షమపి చిరంతనానాం ప్రత్యక్షం తథా।

చ వ్యాసాదయో దేవాదిభిః ప్రత్యక్షం వ్యవహరన్తీతి స్మర్యతే। య స్తు బ్రూయా దిదానీన్తనానామివ పూర్వేషామపి నాస్తి దేవాదిభిః ర్వ్యవహర్తుం సామర్థ్య మితి స జగద్వైచిత్ర్యం ప్రతిషేధేత్. ఇదానీ, మివచ నాన్యదాపి సార్వభౌమః క్షత్రియో స్తీతి బ్రూయాత్. తత శ్చ రాజసూయాదిచోదనా ఉపరున్ధ్యాత్. ఇదానీమివచ కాలాన్తరే ప్యవ్యవస్థితప్రాయాన్ వర్ణాశ్రమధర్మాన్ ప్రతిజానీత.తతశ్చ వ్యవస్థావిధాయిశాస్త్ర మనర్థకం స్యాత్.

తస్మా ద్ధర్మోత్కర్షవశా చ్చిరన్తనా దేవాదిభిః ప్రత్యక్షం వ్యవజహ్రు రితి శ్లిష్యతే... యోగోఽప్యణిమాద్యైశ్వర్యప్రాప్తిఫలః స్మర్యమాణో న శక్యతే సాహసమాత్రేణ ప్రత్యాఖ్యాతుం। శ్రుతిశ్చ యోగమాహాత్మ్యం ప్రఖ్యాపయతి... ఋషీణా మపి మన్త్రబ్రాహ్మణదర్శినాం సామర్థ్యం నాస్మదీయేన సామర్థ్యే నోపమాతుం యుక్తం తస్మా త్సమూల మితిహాసపురాణమ్'

దీనికి తాత్పర్య మేమనగా—యోగశక్తులను బట్టి సూర్యాది దేవతలకు జ్యోతిర్మండలాదిరూపములతో నుండుటకును, ఇష్టము వచ్చిన విగ్రహము ధరించుటకును గూడ సామర్థ్యముకలదు కనుకనే ఇంద్రుడు మేషమై మేధాతిథిని యెత్తుకొనిపోయె నని వేదమందును, సూర్యుడు పురుషరూపముధరించి కున్తీదేవిని బొందె నని యితిహాసమందును చెప్పబడినది. మంత్రార్థవాదములయందు ఇంద్రాదిదేవతల కెట్టి స్వరూపము మనకవగత మగుచున్నదో దానిని శబ్దము ప్రమాణ మనువాడు నిరాకరింప వీలులేదు. మంత్రార్థవాదమూలకము లైన పురాణేతిహాసములుకూడ దేవతావిగ్రహాదికమును సాధింప సమర్థము లగుచున్నవి.

మనకు ప్రత్యక్షము కాకున్నను పూర్వులకు ప్రత్యక్షమగుటచే

నా దేవతావిగ్రహాదికము ప్రత్యక్షసిద్ధము కూడ నగుచున్నది. కనుకనే వేదవ్యాసాదులు దేవతలతో బ్రత్యక్షముగా వ్యవహరించిరని చెప్పబడినది. ఇప్పటివారికివలెనే పూర్వులకు కూడ దేవతలతో వ్యవహరించెడి సామర్థ్యము లేదని యెవ్వడనునో అతడు జగత్తునందు విచిత్రతయే లేదనువాడగును. ఇప్పటివలెనే యెన్నడును సార్వభౌముడగు క్షత్రియుడు లేడనును. దానిచే రాజసూయాదివిధులను భగ్నము చేయును. ఇప్పటివలెనే కాలాంతరమందు గూడ వర్ణాశ్రమధర్మము లవ్యవస్థితములే యనును. దానివలన వ్యవస్థావిధాయకమైన శాస్త్రము నిరర్థకమగును.

కనుక ధర్మాతిశయమును బట్టి పూర్వులు దేవతలతో వ్యవహరించినారనుటే యుక్తము. యోగశాస్త్రోక్తమై అణిమాదిశక్తిసంపాదకమైయున్న యోగమును సాహసమాత్రమున నిరాకరించుట అయుక్తము. వేదముకూడ యోగమహిమలను ప్రతిపాదించుచున్నది. మంత్రద్రష్టలగు మహర్షుల సామర్థ్యము కూడ మనసామర్థ్యము వంటిదే యనుట అయుక్తము కనుక పురాణేతిహాసములు నప్రమాణములే అని.

పరిశీలింపగా మనశాస్త్రమర్యాద యిట్లున్నది. ప్రతివాదిప్రసంగము లట్లున్నవి. కనుక రహస్యకర్తల అప్రామాణికప్రసంగము నింద్యము. వెనుక జూపిన కుంతీదేవి వాక్యములో—

"స్థితాఽహం బాలభావేన తత్ర దోష మపశ్యతీ।"

అని యామె బాల్యమందున్నట్లుండ రహస్యకర్తలు "యౌవనవతియగు కుంతి యని వ్రాయుట" అక్రమము.

"గమ్యతా మితి తం చాహం ప్రణమ్య శిరసాఽవదమ్।"

"తతో మాం తేజసాఽఽవిశ్య" అని కుంతీదేవి అట్టి కోరికకలది కాదు. సూర్యనిర్బంధమునచే అట్లు జరిగిన దని గ్రంథమం దుండ "కుంతీదేవి సత్త్వవంతునితో భోగించెను" అని ఆమెయే ప్రేరేపించి నట్లు వ్రాయుట అక్రమము ఇట్లు పరీక్షింపగా కర్ణోత్పత్తిని గూర్చి రహస్యకర్తల ప్రథమప్రసంగము ప్రతిహతమైనది.
ఇక వారి ద్వితీయప్రసంగవైఖరిని జూడుడు:—

దుర్వాసునకు పరిచర్య చేయుచున్నపుడు కామమోహితుడైన దుర్వాసునివలననే యామె గర్భవతి యై యుండును గాని దుర్వాసుని మంత్రప్రభావమున గాదని కొందరు విమర్శకులు చెప్పుచున్నారట. ఇందు సత్య మెంతవరకు గలదో మన మూహింపలేమట. దుర్వాసుని వంటి దివ్యర్షి యిటువంటి అకృత్యమును చేసె ననుటయు సందేహాస్పదముగా నున్నదట కాని యనవసరక్రోధమునకు వశుడైనట్లే కామమునకు గూడ వశుడై యుండవచ్చు ననియు తోచుచున్నదట. పరాశరునివంటి తపోధనుడు అవివాహితగా నున్న సత్యవతిని భోగించి నట్లే దుర్వాసుడు గూడ గుంతిని భోగించె నేమో అట.

ఇదిమహాభారతగ్రంథవిరుద్ధము, బ్రహ్మసూత్రభాష్యవిరుద్ధము, రహస్యకర్తల ప్రథమప్రసంగమునకు విరుద్ధము.

మఱియు, ఆమె దుర్వాసునివలననే గర్భవతియై యుండును గాని దుర్వాసుని మంత్రప్రభావమున గాదను వారి మాటలో సత్య మెంతవరకు గలదో మన మూహింప లేమందురే. వారికల్పన నిరాధార మనియు, గ్రంథవిరుద్ధమనియు త్రోసివేయక యీరహస్యకర్తలను అందలి సత్య మూహింపు మని కోరనవా రెవరు?

అందు సత్య మెంతవరకు గలదో మన మూహింపలేమన్న వీరు తుదకు దుర్వాసుడు 'కుంతినిభోగించెనేమో' అనియూహించుటకు

సిద్ధపడుట హాస్యాస్పదముకాదా? ఒకవేళ వీరూహింప లేమన్నది సత్య మును గూర్చి కనుక నీయూహించినది యసత్యమన్నయెడల స్వవచన వ్యాఘాత ముండదేమో.

పరాశరుడు సత్యవతియందు ప్రవర్తించినట్లు దుర్వాసుడు కుంతి యందు ప్రవర్తించెనేమో! అందురే. పరాశరుని యాప్రవృత్తి గ్రంథస్థమైయున్నట్లు దుర్వాసుని ప్రవృత్తి గ్రంథస్థముగా లేదేమి? దుర్వాసు డట్లు ప్రవర్తించుటే నిజమైనయెడల నట్టే గ్రంథస్థమై యుండదా? పరాశరప్రవృత్తి నున్న దున్నట్లు చెప్పిన మహా భారతకర్త దుర్వాసుని ప్రవృత్తిని దాచునా? అనవసరక్రోధమునకు వశుడైనట్లే కామమునకు గూడ వశుడైయుండవచ్చునని తోచుచున్న దందురా? క్రోధమునకు వశుడైనసంగతి గ్రంథస్థ మగుటచే ప్రామా ణికము. ఆక్రోధవశుడగుటకూడ నెవ్వనియం దయ్యెనని గ్రంథము చెప్పెనోఅదియేప్రామాణికముగాని మరెవ్వనియందో కల్పించిచెప్పినది యప్రామాణికము.

ఇట్టి స్థితిలో కామవశుడైనట్లు గ్రంథమందు లేనపుడు రహస్య కర్తల యూహ అప్రామాణికమే. ఇంద్రియగోచరముగాని విషయము గ్రహించుట కార్షగ్రంథమే శరణ్యము ఇట్లు రహస్యకర్తల ద్వితీయ ప్రసంగముకూడ పరాస్తమైనది”

ఇంతవరకు మ. భా. చ. కారుల వ్రాతను పరీక్షించుచు ప్రస క్తానుప్రసక్తముగా కర్ణోత్పత్తినిగూర్చిన రహస్యకర్తల వ్రాతను గూడ బరీక్షించి యీ ప్రతివాదిప్రసంగములు హేయములని నిరూపించి నాము—

ఇక మరల మ. భా. చ.కారుల వ్రాతనే అందుకొందము. వారి

వ్రాతలో "నాడుకన్యకలు బిడ్డల గనుట దోషముకాదని యాశ్రమ వాసపర్వములోని కుంతీవ్యాసుల సంభాషణము చెప్పుచున్నది."

అను విషయము ప్రమాణోపపత్తులతో నిరస్తమైనది. "అంశా న్తర మిట్లున్నది.

— ♦ కుంతీసత్యవతుల కన్యాత్వము. ♦ —

"వ్యాసుని తల్లియగు సత్యవతికూడ కుంతివలె రహస్యముగా వ్యాసుని గని కన్యాభావము నొందుట గమనింపదగిన విషయము.

మ భా. చ. కారు లీవ్రాతచే- కర్ణజన్మానంతరము కుంతీదేవికిని, వ్యాసజన్మానంతరము సత్యవతీదేవికిని అనుగ్రహింపబడిన కన్యాత్వము లో నాక్షేపమును సూచించుచున్నారు. గ్రంథమందు ప్రామాణ్య బుద్ధిలేనివారి ధోరణి యిట్లేయుండును. ఇట్టివారు ప్రమాణగ్రంథముల విమర్శించుటకు అనధికారులు ఆప్రమాణగ్రంథస్థవిషయములను శా స్త్రకర్తలు ప్రామాణికములని కీర్తించుచుండ వాని నప్రామాణికము లనుచున్న వీరివ్రాత హేయము.

సత్యవతీదేవికి పరాశరమహర్షియు, కుంతీదేవికి సూర్యభగవాను డును కన్యాత్వము ననుగ్రహించినట్లు మహాభారతము స్పష్టముగా జె ప్పుచున్నది. దీనిని వ్యాకరణశాస్త్రకర్తలు కీర్తించియున్నారుచూడుడు

"కన్యాయాః కనీనచ"

కాశికా- కన్యాయా అపత్యం కానీనః కర్ణః కానీనో వ్యాసః.
కాశికావ్యాఖ్యాపదమంజరీ—

"మునిదేవతామాహాత్మ్యాత్ యా పుంయోగేఽపి న

కన్యాత్వం జహాతి. యథా కుస్తీ, యథా సత్యవతీ సాఽత్రోదా హరణ మితి తదాహ. కానీనః కర్ణః కానీనో వ్యాస ఇతి''

కైయటగ్రంథః—

మునిదేవతామాహాత్మ్యా ద్వా పుంయోగేఽప్యక్షతయోని ర్భవతి. యథా కుస్తీ మన్త్రాహూతదినకరోత్పాదితకర్ణాఖ్యపుత్రాపి పునః కన్యై వాభూత్ తదపత్యం కానీనశబ్దాభిధేయమ్.

దీని తాత్పర్య మేమనగా— కానీనశబ్దమునకు కన్యయొక్క పుత్రు డని యర్థము. కన్య యైనచో బుత్రు డెట్లు? పుత్రుడున్నచో గన్య యెట్లగును? అని విరోధము తటస్థింపగా మునిమహిమచేతను, దేవతామహిమచేతను పురుషసంబంధము కలిగినను ఏ స్త్రీ అక్షత యోనిత్వరూపమైన కన్యాత్వము కలిగియుండునో అట్టి కుంతీదేవియు, సత్యవతీదేవియు నుదాహరణ మగును కనుక విరోధము లేదు. కుంతీ దేవి మంత్రముచే నాహూతుడైన సూర్యునివలన పుత్రవతి యైనను మఱల కన్యకయే యైనది'' అని

కుంతీదేవికి కన్యాత్వము సూర్యానుగ్రహమున సిద్ధించినట్లు వెనుక జూపబడిన కుంతీవ్యాససంభాషణగ్రంథములో స్పష్టము. ఇక సత్యవతీదేవికి పరాశరు డనుగ్రహించిన కన్యాత్వమునుగూర్చిచూడుడు

"తతో మాం మాహ సముని ర్గర్భ ముత్సృజ్య మామకమ్।
ద్వీపేఽస్యా ఏవ సరితః కన్యైవ త్వం భవిష్యసి॥'' (ఆది. 105 అ.)

నీలకంఠీయమ్—

మామకం గర్భ ముత్సృజ్య కన్యైవ త్వం భవిష్యసీతి ముని

మునివచనాత్ జాతాపత్యాయా అపి కన్యాత్వావినాశాత్ పునర్దాశసంసర్గజం హీనవర్ణత్వం న భూత్. కన్యాత్వావస్థాయాం కామభక్షణాదినిషేధాభావాత్. కించ పృథాసత్యవత్యో రనిచ్ఛన్త్యోరేవసూర్యపరాశరాభ్యా మపత్యోత్పాదనం కృత మతో న ద్వయోః కన్యాత్వోచ్ఛిత్తి రితి భావః"

అనగా ఈ నదీసంబంధమైన ద్వీపమందు నాసంబంధమైన గర్భమును విడిచి నీవు కన్యకవే యగుదువని యాపరాశరమహర్షి నాకు చెప్పెను. (ఇది సత్యవతీదేవి వచనము) నీలకంఠీయటీకయు నేమనగా—

నాసంబంధమైన గర్భమును విడిచి నీవు కన్యకవే యగుదువను మునివచనము వలన, పుత్రుడు కలిగినను ఆమెకు కన్యాత్వభంగము కలుగలేదు గనుక, కన్యాత్వావస్థయందు కామభక్షణాదినిషేధము లేనందున మరల దాసుని సంసర్గమును బట్టి కలిగెడి హీనవర్ణత్వము క్షత్రియమైన యాసత్యవతీదేవికి తటస్థింపలేదు. మఱియు కుంతీసత్యవతులు పురుషసంబంధవాంఛలేని దశలో నున్నపుడే సూర్యపరాశరుల వలన వారికి సంతతి కలిగింపబడినందున నాసంతతి కలిగెడికాలమునకు గూడ వారిది కన్యాత్వమే యైనందున వారల కన్యాత్వమునకు విచ్ఛేదమే కలుగలేదని భావము" అని.

ఇట్లు ప్రమాణగ్రంథములు కుంతీసత్యవతుల కన్యాత్వమును విశదీకరించుచున్నందున "వ్యాసుని గని కన్యాభావము నొందుట గమనింపదగిన విషయము" అన్న మ.భా.చ. కారులకు ఆకన్యాత్వమునకై యీచూపిన ప్రమాణగ్రంథసందర్భమును గమనింపుడని చెప్పుచు నంశాంతర మందుకొనుచున్నాము—

"వ్యాసునితో గుంతి తన చిన్నతనపుచేష్టను వెల్లడించినటులు, సత్యవతి భీష్మునికడ తన చిన్నతనపుచేష్టను చెప్పినది. వ్యాసభీష్ము

లవంటి మహానుభావులు అట్టి యధర్మమును ధర్మముగా నంగీక రించుట, కానాటి దేశకాలపరిస్థితులే కారణమై యున్నవా? శ్రీ వ్యాసభీష్ములుకూడ ధర్మవైరుధ్యమున క్లిష్టపడియుండిరా? ఆలో చింప నాటి పరిస్థితులే అట్టివి కావచ్చు నని తోచుచు''

కర్ణోత్పత్తిని గూర్చి కన్యాదశలోని తన వృత్తాంతమును కుం తీదేవి వ్యాసమహర్షితోడను, వ్యాసోత్పత్తినిగూర్చి కన్యాదశలోని తనవృత్తాంతమును సత్యవతీదేవి భీష్మునితోడను చెప్పినపుడు ఆమహా నుభావులు అట్టి యధర్మమును ధర్మముగా నంగీకరించిరట! అది యధ ర్మమే యైన యెడల వారు ధర్మముగా నంగీకరింపరు. వారట్లు అంగీ కరించినపుడు అది యధర్మము కాదు. కనుక నధర్మమును ధర్మముగా నంగీకరించి రనుమాట విరుద్ధము. పూర్వోక్తగ్రంథసందర్భమేమి? యోగశక్తితపోమహిమలచే జరిగిన యాలోకోత్తరఘటనయేమి? ఆఅ క్షతయోనిత్వరూప కన్యాత్వవరప్రాప్తియేమి? భీష్మవేదవ్యాసులు దానిని ధర్మముగా నంగీకరించుట, యేమి? దానిని యీను భా. చ. కారులు అధర్మ మనుటేమి? ధర్మాధర్మనిర్ణాయకు డావ్యాసమునియా? యీవ్యత్యాసమూర్తియా? "తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యా కార్యవ్యవస్థితౌ" అనుటనుబట్టి అకార్య మేదియో కార్య మేదియో తెలిసికొనుటకు శాస్త్రమే ప్రమాణముకాని మనుష్యబుద్ధికాదు. అట్టిస్థితిలో శాస్త్రకర్తయగు వ్యాసభగవానుడును శాస్త్రనిష్ణాతు డగు భీష్ముడును చెప్పినదే నిజము. "వారట్లు చెప్పుటకు నాటి పరిస్థి తులే కారణము'' అనుట తప్పు. పరిస్థితులను బట్టి అధర్మ మెప్పుడును ధర్మము కానేరదు. ధర్మాధర్మనిర్ణాయకము శాస్త్రము కనుక నెట్టి పరిస్థితులలో నైనను శాస్త్రీయమే ధర్మము. అశాస్త్రీయ మధర్మమే.

ఈప్రతివాదులు ఆకుంతీ సత్యవతీచరిత్రములలో రహస్యముగా బిడ్డలను గనుటనుమాత్రమే గ్రహించిరి గాని ఆపై ముఖ్యమైన గన్యా

త్వసిద్ధిని గ్రహింపలేదు. అదియే వారి హృదయదోషము. ఇంతటితో దీనిని విడిచి విషయాంతర మందుకొందము.

— కాశీప్రభువు వ్యాసుని కాశీనుండి తరిమెనను ప్రసంగము —
— తన్నిరాకరణము —

మ.భా.చ. కారులే వ్రాత యిట్లున్నది—

"స్కాందపురాణాంతర్గతమని చెప్పబడు భీమఖండకాశీఖండ ములలోని గాథల బరిశీలించినయెడల వ్యాసుని కాశిలో నుండ నీయక కాశీప్రభు వాతనిని దక్షిణదిశకు దరిమినటులను, కాశిలో నాతనికిని, శిష్యులకుగూడ భిక్షముగూడ లభింపనటులను గాన్పించును" (పు161)

వేదవ్యాసమహర్షికి కాశిలో బిక్ష పుట్టకుండుటెట్టిదో చూడుడు! కాశీఖండ కథాసందర్భ మేమనగా— వేదవ్యాసమహర్షి శిష్యసంఘముతో భిక్షాటనము జేయుచు కాశీనివాసము చేయుచుండ—

"ఏకదా తస్య జిజ్ఞాసాం కర్తుం దేవీం హరోఽవదత్ ।
అద్య భిక్షాటనం ప్రాప్తే వ్యాసే పరమధార్మికే ॥
అథ సర్వగతే క్వాపి భిక్షాం మా యచ్ఛ సుందరి।
తథేత్యుక్త్వా భవానీ సా భవం భవనివారణమ్ ॥
నమస్కృత్వా ప్రతిగృహం తస్య భిక్షాం న్యషేధత్ ॥ (అ 96)

ఒకప్పుడు విశ్వేశ్వరదేవుడు మహర్షిని పరీక్షింపదలచి పరమేశ్వరితో నిట్లనెను. పరమధార్మికు డగు వ్యాసమహర్షి నేడు భిక్షాటనము చేయునపుడు ఎక్కడను భిక్ష దొరకనీయకుము. అదివిని అట్లే యని పరమేశ్వరి-శిష్యసంఘము, వ్యాసమహర్షియు నేయింటికిబోయిన నా యింటనే లోపలనుండి తానే వచ్చి దొఱకదనుచుండ వేళ మించుటచే

నిట్లనుచుండిరి కాబోలు. ననుకొనుచు తిరిగి తిరిగి తమకు భిక్షలభింపక అన్యభిక్షువులకు లభించియుండ నాడు శిష్యులతో మహర్షి నిరాహారుడై యుండెను. మఱునాడు మాధ్యాహ్నికమునిర్వర్తించుకొని ప్రతిగృహము దిరిగిరి. కాని యానాడు కూడ దొరకలేదు. అప్పుడు మహర్షి-శిష్యులతో మీకుకూడ దొఱకనట్లు కనబడుచున్నది. యిట్లుజరుగుట కేమి కారణమో! యని చింతించి యేదేని యుపద్రవముచే పెట్టుట మానిరో, ఈర్ష్యచే నెవ్వనిచే నైన మాన్పింపబడినదో మీరు తెలిసికొని త్వరితముగా రండని బోధింప గొందరు శిష్యులు వెళ్ళి స్థితిగతులు తెలిసికొని వచ్చి మహర్షితో నిట్లు చెప్పిరి.—

"శృణ్వ న్త్వారాధ్యచరణా నోపసర్గోఽత్ర కశ్చన ।
నాన్నక్షయోవా సర్వస్యాం నగర్యా మిహ కుత్రచిత్ ॥
యత్ర విశ్వేశ్వర స్సాక్షాత్ యత్రామరధునీ స్వయమ్ ।
త్వాదృశా యత్ర మునయః క్వభీ స్తత్రోపసర్గజా ॥
విద్యానాం సదనం కాశీ కాశీ లక్ష్మ్యాః పరాలయః ।
ముక్తిక్షేత్ర మిదం కాశీ కాశీ సర్వా త్రయీమయీ ॥"

మహానీయా! ఈపురమం దెట్టి యుపద్రవము లేదు. అన్నక్షయము సంభవింపలేదు. ఏది విశ్వేశ్వరరాజధానియో, యేది అమరనదీపరిశోభితమో, ఏది భవాదృశమునిజనావాసమో అద్దాని కుపద్రవభయమా? ఈకాశీపురము విద్యాసదనము, లక్ష్మీనిలయము, ముక్తిక్షేత్రము అని చెప్పగా విని క్షుత్పీడితులైన శిష్యుల జూచి క్రుద్ధుడై వ్యాసమహర్షి—

"మాభూ త్త్రైపూరుషీ విద్యా మాభూ త్త్రైపూరుషం ధనమ్ ।
మాభూ త్త్రైపూరుషీ ముక్తిః కాశీం వ్యాసోఽశప త్త్వితి ॥

గర్వః పరోఽత్రి విద్యానాం ధనగర్వోఽత్రి వై మహాన్ ।
ముక్తిగర్వేణ నో భిక్షాం ప్రయచ్ఛ స్త్వత్రి వాసినః ॥"

ఇచ్చటి వారు విద్యాగర్వము, ధనగర్వము కలిగి ముక్తి మన పాత్రను గర్వముచే భిక్షను పెట్టకుండి రని "విద్యకాని, ధనముకాని, ముక్తికాని త్రిపురుషవ్యాప్తిగా వీరికి లేకుండుగాక" అని శపించెను. తరువాత మఱల భిక్షకై వెళ్ళి ప్రతిగృహము తిరిగెను. లభింపలేదు. అప్పుడు సాయంకాల మగుచుండుట జూచి భిక్షాపాత్రము పారవైచి యాశ్రమమునకు వచ్చుచుండ నొక గృహద్వారమందు ప్రాకృత స్త్రీరూపముతో పరమేశ్వరి కూర్చుండి మహర్షితో నిట్లనెను—

'భగవన్ భిక్షుకా స్తావ దద్య దృష్టా న కుత్రచిత్ ।
అసత్కృత్యాతిథిం నాథో న మే భోక్ష్యతి కర్హిచిత్ ॥
వైశ్వదేవాదికం కర్మ కృత్వా గృహపతి ర్మమ ।
ప్రతీక్షేతాఽతిథిపథం తస్మా త్త్వ మతిథి ర్భవ ।

మహాత్మా! నేడు భిక్షుకులు లభింపలేదు. అతిథిసత్కారము చేసికాని నానాథుడు భుజింపడు. నీ వతిథివి కమ్ము. ఇట్లనగా వ్యాస మహర్షి—

"భద్రే! కా త్వం కుతః ప్రాప్తా పూర్వం దృష్టా న కుత్రచిత్ ।
పరవా నస్మ్యహం జాత స్తవ దర్శనతోఽధునా ॥
అవశ్యమేవ కర్తాస్మి తవాదేశ్యం తదాదిశ ।
ఏకం తపోవ్యయం హిత్వా కారయిష్యసి యత్పునః ॥
తదేవాహం కరిష్యామి విధేయ స్శుభలోచనే ।
న వచ స్త్వాదృశీనాంహి మహత్త్వం హాపయే త్సతామ్ ॥
వరం త్వం కాసి సుభగే సత్యం బ్రూహి మమాగ్రతః ।"

అమ్మా! నిన్నింతకు బూర్వము చూచియుండలేదు, నీవెక్క
డనుండి వచ్చినావు. నీదర్శనము నన్ను పరవశుని జేయుచున్నది.
ఒక్క తపోవ్యయమును తప్పించి నీవు దేని నాజ్ఞాపించిన దానిని నేను
విధేయుడనై చేయుదును నీవంటి సాధ్వీమణుల వాక్కులు సత్పురు
షుల మహత్త్వమునకు భంగకరములు కానేరవు. నీవిషయమును
చెప్పుము. అని యడుగ నామె నేనిచ్చటి గృహస్థునకు భార్యను. నీవు
మాత్రము నన్నెఱుగవుకాని నిత్యము భిక్షాటనము చేయు నిన్ను నేను
చూచుచునే యున్నాను తపస్వీ! ఆలస్యము చేయక సూర్యాస్తమ
యముకాక పూర్వమే నానాథుని యాతిథ్యము స్వీకరింపుము ఇట్లు
చెప్పగామహర్షి, సూర్యాస్తమయముకాక పూర్వమే, పదివేలమందిశిష్యు
లతో నేను సహపంక్తిచేయవలసియున్నది. నేనొక్కడనే భుజింపను.
అని చెప్పగా నీశిష్యులతో వెంటనే రమ్ము, సర్వము సిద్ధమై యున్న
దనగా నట్లే వచ్చి యభూతపూర్వమైన యాతిథ్యముచే మహర్షి
విస్మితు డయ్యెను. తరువాత పరమేశ్వరుడు వ్యాసుని శాపము కాశీ
పురమునకు వర్తింపకుండునట్లు వ్యాసవాక్యములచేతనే చేయించెను.

ఇప్పు డీగాథనుబట్టి శిష్యసహితుడైన వ్యాసమహర్షికి భిక్ష
యెట్లు లభింపలేదో తెలిసినదా? "కాశిలో నాతనికిని, శిష్యులకుగూడ
భిక్షము గూడ లభింపనటుల గాన్పించును" అన్న మ. భా. చ కారుల
వ్రాతను జూచినారా? అది పార్వతీపరమేశ్వరులు స్వయముగా బరీ
క్షకై చేసిన పనియై యుండ, గృహస్థులు భిక్షమైన పెట్టలేదని లోకు
లకు దోచునట్లు వ్రాయుట యెంత నింద్యము? ఇక కాశీప్రభు వాత
నిని దక్షిణదిశకు దఱుముట యెట్టిదో చూడుడు— భీమఖండకథాసం
దర్భ మిట్లున్నది—

కాశీఖండోక్తప్రకారమే భిక్షలభింపక క్రుద్ధుడై శాపముబెట్ట
నుద్యమింప పరమేశ్వరి యాతిథ్యమున కాహ్వానించుటయు, మహర్షి

యభూతపూర్వమైన యాతిథ్యముచే సంతుష్టు డగుటయు జరిగిన తరువాత పార్వతీసహితముగా నీశ్వరుడు సమీపించి యిట్లనెను—

"త్వ మాగతో౽వా శప్తుం మే పత్నీం శ్రీకాశికాపురీమ్ ।
సదా కైవల్యకల్యాణజన్మభూమి మకారణమ్ ॥
గచ్ఛాన్యదేశం దుర్భాగ్య నిర్గత్య నగరా న్మమ ।
త్వ మన్తేవాసిభి స్సాక మస్మి న్నేవ క్షణే౽ఖిలైః ॥"

సకలకల్యాణములకును, కైవల్యమునకును జన్మభూమియై నాకు పరమప్రేమాస్పదము, అర్ధాంగియు నగు కాశీపురిని శపించుటకు వచ్చితివా? నీవిప్పుడే నీశిష్యులతో నితరప్రదేశమునకు వెళ్ళిపొమ్ము. అని కఠినముగా బలుక నాపార్వతీపరమేశ్వరుల పాదములపై బడి నమస్కరించి, మహర్షి గమనోన్ముఖుడై యుండ నాపరమేశ్వరి—

"భయాకులత్వం మాగా స్త్వం కుమార! బహుధాప్యహమ్।
న విస్మరామి హృదయే కృపయా త్వాం కదాచన ॥
అన్యదేశే జిగమిషాం విహాయ త్వం సుఖేన తామ్ ।
శ్రీదక్షవాటికాం గచ్ఛ ప్రమోదాపూర్ణమానసః ॥
శరణం వ్రజ భీమేశం శరణాగతవత్సలమ్ ।
సమస్తాభ్యుదయా స్తుభ్యం భవన్తు తదనుగ్రహాత్ ।"

వత్సా! నీవు భయపడకుము. దయాపాత్రుండవగు నిన్ను నే నెన్నడును మఱచుదాననుగాను. నీవన్యస్థలమున కేగక సంతోషముతో దక్షవాటిక కరుగుము. శరణాగతవత్సలుడగు భీమనాథుని శరణు నొందుము. ఆభీమేశ్వరానుగ్రహముచే నీకు సర్వాభ్యుదయములు కలుగును" అని సుధామయోక్తుల నుల్లసింపజేయు మహర్షి యట్లే దక్షవాటికకు వచ్చెను అనియున్నది.

ఇచ్చట పరమేశ్వరుడు మహర్షిని కఠినోక్తులాడి వెళ్ళు మను టలో మహర్షిని దోషి యని భావించినట్లా? లేక మహర్షిని దక్ష వాటికయందు ప్రవేశపెట్టుటకు అట్టి నిమిత్తమును కల్పించినట్లా? అని విచారణీయము.

దోషియనియే పరమేశ్వరతాత్పర్యమైనయెడల పరమేశ్వర సమక్షమందు అపరమేశ్వరి మహర్షి నాదరింపబూనుకొనదు. వత్సా! నీవు దయాపాత్రుడవు; నిన్ను నే మరువను. నీవు దక్షవాటికకే యేగి భీమేశ్వరు నాశ్రయించి ఆతని యనుగ్రహము నొందు మని ప్రసం గింపబోదు అట్లామె ప్రసంగించినపుడు వినుచున్న ఈశ్వరుడు కోపిం పక శాంతుడై యుండుట తటస్థింపదు.

పరమేశ్వరుని పాదములపై బడి నమస్కరించిన మహర్షిని ఉపే క్షించియున్న యీశ్వరు డాలకించుచుండ నీవు భీమేశ్వరు నాశ్ర యింపుము. ఆతడు శరణాగతవత్సలుడు. అని పరమేశ్వరి ఆయీశ్వరు నెత్తిపొడిచినట్లు భీమేశ్వరోత్కర్షము నుద్ఘాటింపజాలదు. అట్లుద్ఘా టించినపుడు శాంతుడై యీశ్వరు డుండజాలడు. కనుక నీశ్వరునకు గూడ పరమేశ్వరికి వలెనే అసాధారణవాత్సల్యమే మహర్షియం దున్నది. అది పరమేశ్వరీముఖమున ప్రకటింపబడుట యీశ్వరుని కభి మతము. వాస్తవములో నామభేదము తప్ప విశ్వేశ్వరు డొకడు, భీమే శ్వరు డొకడును కాడు. గనుక నాపరమేశ్వరి చేసిన భీమేశ్వరోత్కర్ష విశ్వేశ్వరోత్కర్షప్రశంసయే.

మహర్షిపై యాగ్రహించుటలో భావము స్వర్గాపవర్గాస్పదమై తనకు పరమ ప్రేమాస్పదమై యున్న కాశీపురికి యేమాత్ర మైన హాని యెంత ముఖ్యుడు తలపెట్టినను శంకరుడు సహింపబో డనియే గ్రహింపవలెను.

ఇక దక్షవాటికకు వెళ్ళుమని యుపదేశించుటలో, వ్యాసమహర్షి కాశీవియోగగ్లాని నది యుపశమింపజేయగలదనియు, అది కాశీపురమున క్షీణించిన దనియు, నీసిద్ధాంతము సకలమునిజనాదర్శభూతుడు, సర్వవంద్యుడు నగు వేదవ్యాసమునీంద్రుని కాస్పదమైనగాని లోకమున కభివ్యక్తము కాదనియు పరమేశ్వరుని సంకల్పమని గ్రహింపవలెను.

ఇట్లుపరిశీలింపగా వ్యాసమహర్షిని కాశీపురినుండి దక్షవాటికకు బంపి తన్మూలమున దక్షవాటికాపవిత్రతను ప్రకటీకరింపదలచి విశ్వనాథదేవుడు అట్టి నిమిత్తమును కల్పించెనేకాని మరొకటి కాదని తేలినది. కనుకనే చతుర్దశాధ్యాయమందు వ్యాసమహర్షి దక్షవాటికకు వెళ్ళినతరువాత ఋషివర్యులు—

"శిష్యసందోహసహితం మునీంద్రం బాదరాయణమ్ ।
ద్వైపాయనం ధిక్కృతవాన్ కోఽపి కాశీపురీపతిః ॥
ప్రాజ్ఞా నస్మా నతః కథం కృపయా ధారయిష్యతి ।
తస్మా దస్మాక ముచితం సర్వేషాం తత్ర వర్తనమ్ ॥
సుఖేన వర్తతే యత్ర కృష్ణద్వైపాయనో మునిః ।
ఇతి కాశీపురా త్సర్వే నిర్గత్య వ్యాసపద్ధతిమ్ ॥
జ్ఞాత్వా శాఖోపశాఖాభి ర్దాక్షారామం సమాయయుః ।"

శిష్యసహితుడైన వ్యాసమహర్షిని ధిక్కరించిన విశ్వేశ్వరుడు ఇచ్చట మనల బ్రతుకనిచ్చునా? మన మందర మక్కడకే పోవుదమని వసిష్ఠాత్రి భరద్వాజ భార్గ వాంగిరసాదులు కాశీపురమునుండి దాక్షారామమునకే వచ్చిరి; అని చెప్పబడినది.

ఇట్లుండ "కాశీప్రభువు వ్యాసుని దక్షిణదిశకు దఱిమె" నని దుర్వ్యుత్పత్తితో వ్రాసినది నింద్యము.

ఈప్రస్తావములో 'వ్యాసునకు బాదరాయణు డను పేరు లేదు,' అను మ. భా. చ. కారులకు ఈశ్లోకములలో 'మునీంద్రం బాదరాయణం ద్వైపాయనమ్' అని బాదరాయణుడనుపేరు వ్యాసమహర్షికి గలదనియే చెప్పబడినదిసుమా? అని తెలుపుచు విషయాంతర మందు కొనుచున్నాము—

పతిలోకము కలుగు నని నమ్మించి దుర్యోధనాదుల భార్యలను
— వ్యాసుడు గంగలో ప్రవేశింపజేసె నను ప్రసంగము—
—తన్నిరాకరణము—

మ. భా. చ. కారులు వ్రాత యిట్లున్నది—'వ్యాసు డావితంతువులకు యుద్ధమృతుల జూపు నెపమున ధృతరాష్ట్రునివనవాసకాలమునధార్తరాష్ట్రభార్యలను మోహపెట్టి, వారికిపతిలోకముకలుగు ననినమ్మించి,యాదుర్యోధనాదుల భార్యలనుగంగలో ప్రవేశించునటులచేసెను.గ్రంథవిస్తరభీతిచే గాధ నంతయు వ్రాయ లేదు' పు158

ఆహా! దుర్యోధనాదుల భార్యలను యుద్ధమృతుల జూపు నెపమున మోహపెట్టెనట! వారికి పతిలోకము కలుగునని నమ్మించెనట! వారు గంగలో ప్రవేశించునటుల చేసెనట ! గ్రంథవిస్తరభీతిచే గాధ వ్రాయలేదట! పతిలోకము కలుగునని నమ్మించె నను మాటకు వారికి ప్రాణత్యాగమే తప్ప పతిలోకప్రాప్తి కలుగ లేదని తాత్పర్యము కాబోలు. ఈప్రతివాదుల కీలోకమే ఆనదే! ఆలోక మానినదా?

వారు భీతిచే వ్రాయనిగాధయే మనకు నిజము తెలుపును. ఆ గాధయిట్లున్నది—

యుద్ధానంతరము ధృతరాష్ట్రుడు ధర్మరాజాదుల సమ్మతింపజేసి గాంధారియు, కుంతీదేవియు శుశ్రూష జేయుచుండ, నాశ్రమవాసము

చేయు నవసరమున ధర్మరాజాదులు కూడ సపరివారముగా సేనలతో వచ్చి, యావనమందే నివశించియున్నపుడు వ్యాసమహర్షి ధృతరాష్ట్రాశ్రమమందు ప్రత్యక్షమై—

"ధృతరాష్ట్ర మహాబాహో కచ్చి త్తే వర్తతే తపః ।
కచ్చి న్మన స్తే ప్రీణాతి వనవాసే నరాధిప ॥
కచ్చి ద్ధృది న తే శోకో రాజన్ పుత్రవినాశజః ।
సంశయచ్ఛేదనార్థాయ ప్రాప్తం మాం విద్ధి పుత్రక ॥
న కృతం యైః పురా కైశ్చి త్కర్మ లోకే మహర్షిభిః ।
ఆశ్చర్యభూతం తపసః ఫలం త ద్దర్శయామి వః ॥
కి మిచ్ఛసి మహీపాల మత్తః ప్రాప్తు మభీప్సితమ్ ।
ద్రష్టుం స్ప్రష్టుమథ శ్రోతుం త త్కర్తాస్మి తవానఘ ॥
శ్రుత్వా సమాగమ మిమం సర్వేషాం వ స్తతో నృప ।
సంశయచ్ఛేదనార్థాయ ప్రాప్తః కౌరవనందన ॥
ఇమే చ దేవగంధర్వా స్సర్వే చేమే మహర్షయః ।
పశ్యన్తు తపసో వీర్య మద్య మే చిరసంభృతమ్ ॥
త దుచ్యతాం మహాప్రాజ్ఞ కం కామం ప్రదదామి తే ।
ప్రవణోఽస్మి వరం దాతుం పశ్య మే తపసో బలమ్ ॥"

ధృతరాష్ట్రా! నీకు తపస్సు జరుగుచున్నదా? పుత్రదుఃఖము లేకుండెనా? నేను సంశయవిచ్ఛేదము చేయుటకు వచ్చితి నని తెలిసికొనుము. ఇదివరలో లోకమునం దేమహర్షులచేతను చేయబడని దేది కలదో అట్టి యాశ్చర్యకరమైన విషయమును నాతపఃఫలముగా మీకు ప్రదర్శించుచున్నాను. నీవు దేనియొక్క దర్శనస్పర్శనశ్రవణముల నపేక్షింతువో దానిని నీకు ఘటింపజేయుదును.

మీయందఱి సమాగమము గ్రహించి సంశయచ్ఛేదనార్థ

మే తెంచితిని. ఈదేవతలు, గంధర్వులు, ఈమహర్షులు చిరకాలార్జిత మైన నాతపశ్శక్తిని యిప్పుడు చూతురుగాక. నీకోరిక నీడేర్చెదను. కోరిక యేదో చెప్పుము. నాతపోబలము జూడుము.

"ఏవ ముక్తస్స రాజేన్ద్రో వ్యాసే నామితబుద్ధినా ।
ముహూర్త మివ సంచిన్త్య వచనా యోపచక్రమే ॥
ధన్యోఽస్మ్యనుగృహీతశ్చ సఫలం జీవితం చ మే ।
య న్మే సమాగమో ఽ ద్యేహ భవద్భి స్సహ సాధుభిః ॥
కిన్తు తస్య సుదుర్బుద్ధే ర్మన్ద స్యాపనయై ర్భృశమ్ ।
దూయతే మే మనో నిత్యం స్మరతః పుత్రగృద్ధినః ॥
అపాపాః పాండవా యేన నికృతాః పాపబుద్ధినా ।
ఘాతితా పృథివీ యేన సహాయా సనరద్విపా ।
రాజానశ్చ మహాత్మానో నానాజనపదేశ్వరాః ॥
ఆగమ్య మమ పుత్రార్థే సర్వే మృత్యువశం గతాః ।
యే తే పితౄంశ్చ దారాంశ్చ ప్రాణాంశ్చ మనసః ప్రియాన్ ॥
పరిత్యజ్య గతా శ్శూరాః ప్రేతరాజనివేశనమ్ ।
కాను తేషాం గతి ర్బ్రహ్మన్ మిత్రార్థే యే హతా మృధే ।
తథైవ పుత్రపౌత్రాణాం మమ యే నిహతా యుధి ।
ఏత త్సర్వ మనుస్మృత్య దహ్యమానో దివానిశమ్ ॥
న శాన్తి మధిగచ్ఛామి దుఃఖశోకసమాహతః ।
ఇతి మే చిన్తయానస్య పిత శ్శాన్తి ర్న విద్యతే ॥"

ఇట్లు ప్రశ్నింపబడిన ధృతరాష్ట్రుడు-మహనీయులగు మీరెల్లరు నిచ్చటికి విచ్చేయుటచే నే ధన్యుడను. కాని, దురాలోచన కల దుర్యోధనుని యవినీతులచేత పుత్రప్రేమ కల నామనస్సు నిత్యము ఖేదవడుచునే యున్నది. ఏపాపము నెఱుగని పాండవులు ఆతనిచే వంచితులైరి, ఆతని మూలమున అనేకజీవవర్గములకు ప్రాణాపాయము కలి

గినది ఎందరో మహారాజులు నాపుత్రుని పక్షమున వచ్చి దారపుత్రాదులను విడిచి ప్రాణముల గోల్పోయిరి. మిత్రకార్యార్థము యుద్ధములో గతించినట్టి యీమహారాజులకును, నాపుత్రపౌత్రాదులకును యెట్టి గతి సంభవించినదో అని యహర్నిశములు చింతించుచున్న నామనస్సునకు శాంతి లేదు. అని చెప్పుచుండ వినుచున్న గాంధారికి, కుంతిదేవికి, ద్రౌపదికి, సుభద్రకు, ధార్తరాష్ట్రభార్యలకు యుద్ధమృతులనే గూర్చిన శోకము రేగినది. అప్పుడు—

"పుత్రశోకసమావిష్టా గాంధారీ త్విద మబ్రవీత్ ।
శ్వశురం బద్ధనయనా దేవీ ప్రాంజలి రుత్థితా ॥
షోడ శేమాని వర్షాణి గతాని మునిపుంగవ ।
అస్య రాజ్ఞో హతాన్ పుత్రాన్ శోచతో న శమో విభో ॥
పుత్రశోకసమావిష్టో నిశ్వసన్ హ్యేష భూమిపః ।
న శేతే వసతీ స్సర్వా ధృతరాష్ట్రో మహామునే ॥
లోకా నన్యాన్ సమర్థోఽసి స్రష్టుం సర్వాం స్తపోబలాత్ ।
కిము లోకా న్తరగతాన్ రాజ్ఞో దర్శయితుం సుతాన్ ॥"

భర్త యంధుడగుటను బట్టి తానుగూడ కన్నులు కట్టుకొని యున్న గాంధారి లేచి యంజలి ఘటించి మహర్షితో నిట్లనెను. మునీంద్రా! గతించిన పుత్రులనుగూర్చి శోకించుచున్న యీమహారాజునకిప్పటికి పదియారు వత్సరములు గడచినను శాంతి కలుగలేదు. పుత్రశోకముతో నిట్టూర్పులు విడుచుచు శయనించుటగూడ లేకుండెను. నీవు తపోబలమున లోకాంతరములను సృజింప సమర్థుడవు లోకాన్తరగతులగు సుతులను మహారాజునకు జూపలేవా?" అని కోరుచు ద్రౌపదీ ప్రభృతులు కూడ సుతులనుగూర్చియు, హితులను గూర్చియు శోకించుచుండిరని చెప్పి—

"పుత్రస్య తే పుత్రశతం నిహతం యుద్ధ్రాజిరే।
తస్యభార్యాశత మిదం దుఃఖశోకసమాహతమ్॥
తవ ప్రసాదా ద్భగవ న్విశోకోఽయం మహీపతిః।
కుర్యా త్కాల మహం చేయం వధూ స్తవ మహామునే।"

మరణించిన పుత్రశతముయొక్క యీభార్యాశతము దుఃఖాక్రాంతమై యున్నది. ఈమహారాజు, నేనును నీయనుగ్రహమున శోకములేక కాలము గడుపవలెను. ఇట్లు గాంధారి చెప్పగా కుంతీదేవి కర్ణునిగూర్చిన తన చింతను వెల్లడింప మహర్షి నీయందు దోషము లేదని చెప్పి గాంధారితో నిట్లనెను—

"భద్రే! ద్రక్ష్యసి గాంధారి పుత్రా న్భ్రాతౄ న్సఖీ న్గణా న్।
వధూశ్చ పతిభి స్సార్ధం నిశి సుప్తోత్థితా ఇవ॥
కర్ణం ద్రక్ష్యతి కున్తీచ సౌభద్రం చాపి యాదవీ।
ద్రౌపదీ పఞ్చ పుత్రాంశ్చ పితౄ న్భ్రాతౄం స్తథైవచ॥"

నీవు పుత్రులను, భ్రాతలను, ఆత్మీయులను, పతులతో గలసియుండెడి కోడండ్రను సుప్తోత్థితులవలె జూడగలవు. కుంతీ ద్రౌపదీ సుభద్రలుకూడ తమతమవారిని జూడగలరు అనిచెప్పి యుద్ధమృతులు మొదలగువారు ఏయే యంశముల జన్మించిరో, మరణించి యెచ్చటి కేగిరో చెప్పి—

"యచ్చ వై హృది సర్వేషాం దుఃఖ మేత చ్చిరం స్థితమ్।
త దద్య వ్యపనేష్యామి పరలోకకృతా ద్భయాత్॥
సర్వే భవన్తో గచ్ఛన్తు నదీం భాగీరథీం ప్రతి।
తత్ర ద్రక్ష్యథ తా న్సర్వా న్యే హతా స్తత్ర సంయుగే॥"

యుద్ధమృతుల కేదుర్గతులు కలిగినవో యని చిరకాలమునుండి

పరితపించు మీకుగల చింతను తొలగింతును. మీరెల్లరు గంగానది యొద్దకు వెళ్ళియుండుడు. అచ్చట మృతుల నందరను జూడగలరు.

ఇతి వ్యాసస్య వచనం శ్రుత్వా సర్వో జన స్తదా ।
మహతా సింహనాదేన గంగా మభిముఖో యయౌ ॥
తతో గంగాం సమాసాద్య క్రమేణ స జనార్ణవః ।
నివాస మకరో త్సర్వో యథాప్రీతి యథాసుఖమ్ ॥
జగామ త దహశ్చాపి తేషాం వర్షశతం యథా ।
నిశాం ప్రతీక్షమాణానాం దిదృక్షూణాం మృతాన్ నృపాన్ ॥
తతో నిశాయాం ప్రాప్తాయాం కృతసాయాహ్నికక్రియాః ।
వ్యాస మభ్యగమన్ సర్వే యే తత్రాసన్ సమాగతాః ॥
తతో వ్యాసో మహాతేజాః పుణ్యం భాగీరథీజలమ్ ।
అవతీర్యాఽఽజుహావాథ సర్వాన్ లోకాన్ మహామునిః ॥
తత స్తుముల శ్శబ్దో జలాన్తే జనమేజయ ।
ప్రాదురాసీ ద్యథాయోగం కురుపాండవసేనయోః ॥
తత స్తే పార్థివా స్సర్వే భీష్మద్రోణపురోగమాః ।
ససైన్యా స్సలిలా త్తస్మా త్సముత్తస్థు స్సహస్రశః ॥
సర్వే భాసురదేహా స్తే సముత్తస్థు ర్జలా త్తతః ।
యస్య వీరస్య యో వేషో యో ధ్వజో యచ్చ వాహనమ్ ।
య ద్వర్మ య త్ప్రహరణం తేన తేన స దృశ్యతే ।
దివ్యాంబరధరా స్సర్వే సర్వే భ్రాజిష్ణుకుండలాః ॥
నిర్వైరా నిరహంకారా విగతక్రోధమత్సరాః ।
ధృతరాష్ట్రస్యచ తదా దివ్యం చక్షు ర్నరాధిప ।
ముని స్సత్యవతీపుత్రః ప్రీతః ప్రాదా త్తపోబలాత్ ॥
త దద్భుత మచిన్త్యంచ సుమహ ద్రోమహర్షణమ్ ।
విస్మిత స్సజన స్సర్వో దదర్శానిమిషేక్షణః ॥"

ఇట్లు వ్యాసమహర్షి చెప్పగా విని యందరు సింహనాదముతో గంగానదికి బయనమైరి సముద్రమువలె నున్న జనసముదాయము క్రమముగా గంగానదిని జేరి, యెప్పు డెప్పు డని చూచుచుండ సాయంకాలము కాగా సాయంకాలకృత్యములు నిర్వర్తించుకొని యచ్చటివారందరు వ్యాసమహర్షిని జేరిరి. తరువాత వ్యాసమహర్షి గంగానదిలో ప్రవేశించి యాహ్వానింపగా నాజలమునుండి కురుపాండవసేనల కలకలధ్వని యుద్భవించినది. తరువాత భీష్మద్రోణాదులు, సైన్యములతో వేలకొలది జలమునుండి పైకి వచ్చినారు. అం దేవీరుని దేవేషమో, యేధ్వజమో, యేవాహనమో, యేకవచమో, యేయాయుధమో, వానితోడనే యాతడు కనబడుచుండెను. అందరు దివ్యాంబరధరులు, కుండలాలంకృతులు, వైరరహితులు, నిరహంకారులునై యుండిరి. వ్యాసభగవానుడు తపోబలముచే ధృతరాష్ట్రునకు దివ్యదృష్టి ననుగ్రహించెను అచింత్యమై, శరీరమునకు గగుర్పాటు గలిగించెడి యా యద్భుతమును జనులు విస్మితులై రెప్పపాటు లేక చూచిరి.

"ఏవం సమాగతా స్సర్వే గురుభి ర్బాంధవై స్సహ ।
పుత్రై శ్చ పురుషవ్యాఘ్రాః కురవో న్యే చ పార్థివాః ॥
తాం రాత్రి మఖిలా మేవం విహృత్య ప్రీతమానసాః ।
మేనిరే పరితోషేణ నృపా స్స్వర్గసదో యథా ॥
సమాగతా స్తాః పితృభి ర్భ్రాతృభిః పతిభిస్సుతైః ।
ముదం పరమికాం ప్రాప్య నార్యో దుఃఖ మథా_త్యజన్ ॥
ఏకాం రాత్రిం విహృ త్యైవం తే వీరా స్తాశ్చ యోషితః ।
ఆమ న్త్ర్యా_న్యోన్య మాశ్లిష్య తతో జగ్ము ర్యథాగతమ్ ॥
తతో విసర్జయామాస లోకాం స్తా న్మునిపుంగవః ।
క్షణే నాన్తర్హితా శ్చైవ పశ్యతా మేవ తే_భవన్ ॥
అవగాహ్య మహాత్మానః పుణ్యాం భాగీరథీం నదీమ్ ।

గతేషు తేషు సర్వేషు సలిలస్థో మహామునిః ॥
ధర్మశీలో మహాతేజాః కురూణాం హితకృ త్తథా ।
తతః ప్రోవాచ తా స్సర్వాః క్షత్రియా నిహతేశ్వరాః ॥
యాయాః పతికృతాఀ ల్లోకా నిచ్ఛన్తి పరమస్త్రియః ।
తా జాహ్నవీజలం క్షిప్ర మవగాహ న్త్వతన్ద్రితాః ॥
తత స్తస్య వచ శ్శ్రుత్వా శ్రద్ధధానా వరాంగనాః ।
శ్వశురం సమనుజ్ఞాప్య వివిశు ర్జాహ్నవీజలమ్ ॥
విముక్తా మానుషై ర్దేహై స్తత స్తా భర్తృభి స్సహ
సమాజగ్ము స్తదా సాధ్వ్య స్సర్వావేవ విశాంపతే ॥
ప్రవిశ్య క్షత్రియా ముక్తా జగ్ము ర్భర్తృసలోకతామ్ ।"

ఇట్లు కురువంశీయులును, ఇతరులునైన పార్థివులు గురుపుత్రబంధుజనముతో గలిసి ప్రీతితో నారాత్రి యంతయు విహరించిరి. ఆస్త్రీలు తమతమ పతులతోడను, సుతులతోడను, భ్రాతృపితృవర్గముతో కలసికొని పరమానందము నొందిరి. ఒకరాత్రియావీరులును, ఆస్త్రీలును పరస్పరప్రేమానుబంధమున ప్రసంగించుకొని వ్యాసమహర్షి విడిచిపెట్టగా నందరు చూచుచుండ గంగానదియందు మునిగి క్షణములో నెల్లరు నంతర్ధానమైరి.

వారందరు నంతర్ధానమైనతరువాత ధర్మశీలుడగు మహర్షి జలగతుడైయుండి మృతభర్తృక లగు క్షత్రియకాంతలను గూర్చి యిట్లనెను. ఏపతివ్రతలు పతిలోకము నపేక్షింతురో వారీగంగాజలమం దవగాహనము చేయుడు, అని. ఆమాట విని పతిలోకము గోరిన యాపతివ్రతలు శ్వశురుడగు ధృతరాష్ట్రుని యనుజ్ఞ దీసికొని గంగాజలమం దవగాహనము జేసి మనుష్యదేహములను విడిచి భర్తృసాలోక్యమును పొందిరి.

ఇదియే మ. భా. చ. కారులు దాచియుంచిన గాథ. ఇందు పతిలోకప్రాప్తి నపేక్షించువారికి దానిని ఘటింపజేతు నని మహర్షి చెప్పినట్లున్నది. పతివ్రతలగు దుర్యోధనాదుల భార్యలు దాని నపేక్షించి ధృతరాష్ట్రుని యనుజ్ఞదీసికొనియే గంగావగాహనపూర్వకముగా పతిలోకమును పొందినట్లున్నది. మహాజనసమక్షమున గాంధారీధృతరాష్ట్రాదుల యంగీకారముతో సంతోషించుచు నాడావితంతువులు పతిలోకము నొందు టేమి? నేడీ మ. భా. చ. కారులు వారికై పరితపించు టేమి?

పతిలోకమును ప్రాప్తింపజేతు ననుట వ్యాసమహర్షికి తప్పైన యెడల దానికై యనుజ్ఞ నిచ్చిన ధృతరాష్ట్రునిది తప్పు కాదా? అందుల కంగీకరించి చూచుచుండిన గాంధారిది తప్పు కాదా? అది యటుండ యుద్ధమృతులను చూడవలె నను కుతూహలము ధృతరాష్ట్రునిది. అతని కట్లు చూపవలసిన దను ప్రార్థన గాంధారిది. అట్లు చూపిన వాడు వ్యాసమహర్షి. చూచిన యందరిలోను జేరినవా రావితంతువులు.

మహర్షి యుద్ధమృతులను జూపుట. మ. భా. చ. కారు లన్నట్లు ఆవితంతువులను మోహపెట్టుటకే యైనయెడల జూపవలసిన దని ప్రార్థించిన గాంధారీధృతరాష్ట్రుల చర్య కూడ తమ కోడండ్రను ఆవిధముగా మోహపెట్టి వారి నావిధముగా వదల్చుకొనుటకే యైయుండు నని యూహింపబడదా? ప్రమాణముల ధిక్కరించి తమపైత్యము జేర్చి ప్రసంగింపబూనిన యెవ్వనివాక్యనింద్యము కాదు? కనుక వ్యాసభగవానుని నిందించు దుర్వ్యృత్తితో గూడిన మ. భా. చ. కారుల వ్రాత నింద్యము.

ఇక మరణించినవారి పునర్దర్శనము సంభవమా? అను సందేహము కలుగును. అందుకై యీగ్రంథము జూడుడు—

నీలకంఠీయమ్—"తతో నిశాయా మిత్యస్మి న్నధ్యాయద్వయే మృతానాం పునర్దర్శన ముక్తం. తేన తేషాం సత్త్వ మస్తీతి స్పష్ట ముక్తమ్. అతో మృతానాం సత్త్వ మస్తి నవేతి సంశయః పరాస్తః. అథ భస్మీభూతానాం కథం ప్రత్యక్షేణ దర్శనమ్. స్వాప్నవ దితి చేత్. వ్యాస స్యైంద్రజాలికత్వాపత్త్యా సంశయోచ్ఛేదకత్వానుపపత్తిః. అథ దేవతాభావం గతానాం తేషాం పునర్భీష్మాదిభావేన యోగబలా దభివ్యక్తి ర్భవతి. తర్హి భస్మీభూతస్య దేహస్య పునరుదయాయోగా త్తత్సదృశై ర్దేహాన్తరై రుపేతానామేవ తేషాం దర్శన మితి వాచ్యం. తథాపి దేహాన్తరే మమాయం భర్తేతి బుద్ధిమతీనాం స్త్రీణాం భ్రాన్తి రేవ. పూర్వదేహనాశస్య దృఢతరస్మరణాత్. అస్మరణేపున స్వాప్నతుల్యతేతి తుల్యమ్.

అత్రబ్రూమః—

హార్దవిద్యాం ప్రకృత్య శ్రూయతే. "త ఇమే సత్యాః కామా అనృతాపిధానాః" ఇతి. దహరాకాశం ప్రకృత్య "ఏతత్సత్యం బ్రహ్మపుర మస్మిన్ సర్వే కామా స్సమాహితా" ఇతి. తథా "యో యో హ్యస్యేతః ప్రైతి న త మిహ దర్శనాయోపలభతే" ఇత్యుపక్రమ్య "యేచాస్యేహ జీవా యేచ ప్రేతా యచ్చాన్య దిచ్ఛ న్నలభతే సర్వం తదత్ర గత్వా విన్దతే" ఇత్యాది। సత్యం బ్రహ్మపురం హృదంబర మిత్యర్థః.

'సమస్త స్సదా స న్నేవా స్త్యతఏవ తత్ర మునయః పశ్యన్త్యతీతాదికం. మిథ్యాబ్రహ్మపురం శరీరం, మమునా సత్యపురం

ఛాదితం సర్పేణ స్ఫురితే త్యముష్య విలయే సత్యం పురం ప్రకా శతే. తస్మా దవిద్యాప్రత్యుపస్థాపిత మపారమార్థికం జైవం రూపం కర్తృభోక్తృరాగద్వేషాద్యనేకార్థకలుషితం తద్విపరీత మపహత పాప్మత్వాదివిశిష్టం పారమేశ్వరం రూపం విద్యయా ప్రతిపద్యతే. సర్పాదివిలయనే రజ్జ్వాదివత్' ఇతి భాష్యాచ్చ.

బ్రహ్మలోకికా ఏవ సత్యా భీష్మాదయోఽన్యత్ర రజన్మాదిభి ర్భావవికారై రావిర్భూయ తిరోభూతా స్సన్తో మహర్షివిద్యయా ఽఽవిర్భూయ స్త్ర్యదిభిశ్చ యాథాత్మ్యేన గృహీతా స్సన్తస్తాభి స్సహ రేమిరే ఇతి యుక్త ముత్పశ్యామః । విశేష స్త్వస్మత్కృతే వేదాన్తకతకే దహరాధికరణే ద్రష్టవ్యః ।

ఇచ్చట సారాంశము—మరణించినవారి పునర్దర్శనము చెప్ప బడుటచే మరణించినవా రుందు రని స్పష్టపరుపబడినది. దీనివలన మరణించినవా రుండిరా? లేరా? అను సంశయము తొలగింపబడినది. ఇక పూర్వపక్షము— భస్మీభూతులైనవారి స్వరూపము లెట్లు ప్రత్య క్ష మైనవి? స్వప్నపదార్థములవలెనా? అట్లైన వ్యాసమహర్షి యైంద్ర జాలికు డగును. కాని 'సంశయచ్ఛేదనార్థాయ ప్రాప్తం మాం విద్ధి' అన్నట్లు సంశయవిచ్ఛేదకుడు కానేరడు.

ఇక మరణించి దేవతాభావము నొందియున్న వారందరకు మహర్షి యోగబలమున మరల భీష్మాదిరూపములతో నభివ్యక్తి యయ్యెనా? అట్లైన భస్మీభూతదేహములకు పునరుత్పత్తి యసంభ వము కనుక తత్తుల్యములైన దేహాంతరములతో వారల దర్శన మైన దని చెప్పవలెను. అప్పుడు వారల పూర్వదేహములు నష్టములైనట్లు దృఢజ్ఞానముకల ఆ స్త్రీలకు ఆ దేహాంతరధారులందు 'ఈతడు నాభర్త' యను బుద్ధి భ్రాంతియే యగును. పూర్వదేహనాశస్మృతి వారికప్పుడు

లేనియెడల మరల స్వప్నతుల్యమే యగును. అను పూర్వపక్షముపై సమాధానము చెప్పబడుచున్నది—ఛాందోగ్యోపనిషత్తునందు అష్టమ ప్రపాఠకమున నిట్లున్నది ఈశరీరమందలి హృదయపుండరీకము బ్రహ్మ స్థానము బ్రహ్మస్వరూపమే సర్వవ్యవహారాస్పదమగుటబట్టి పుర మన బడును. అట్టి బ్రహ్మపురము సత్యము. బాహ్యప్రపంచమందు కోర బడు యావత్పదార్థములు ఆబ్రహ్మపురమందే యున్నవి. కనుక బాహ్యవిషయాసక్తిని విడిచి బ్రహ్మస్వరూపప్రాప్త్యుపాయములనే ఆశ్ర యింపవలెను. శాస్త్రాచార్యోపదేశక్రమమున బ్రహ్మస్వరూపావగతి యెవ్వరికి కలుగునో వారికి సర్వలోకసంచారము సంభవించును.

అట్టివాడు పితృలోకకాముడైన యెడల వాని సంకల్పమాత్ర మున పితరు లావిర్భవింతురు. ఆతడు కోరెడి పదార్థము లన్నియు సంకల్పమాత్రముననే సంభవించును. ఆత్మగతములై పొందశక్యములై యున్న సత్యములైన (అవితథములైన) కామములు బాహ్యవిషయా సక్తిమూలకమైన స్వేచ్ఛాప్రచార మనెడి యనృతముచే నాచ్ఛాదింప బడినవి. కనుకనే మరణించిన పుత్రాదులు తన హృదయాకాశమందే యుండియున్నను వారినిజూడవలెనను సంకల్పము తనకు గాఢముగా నున్నను దర్శనలాభము కలుగుటలేదు.

దహరోపాసనారిపనిషితుడైన జ్ఞానికి మాత్రము జీవించియున్న వారుకాని, మరణించినవారుకాని దుర్లభములైన యితరపదార్థములు కాని హృదయాకాశాత్మకబ్రహ్మస్వరూపమందు సులభములే.

నిధిని దెలిసికొనక నిధికి పైభాగమందు సంచరించువానికి నిధి లభ్యముకానట్లు అవిద్యోపహతులకు హృదయాకాశమందే యున్న సత్యకామములు లభ్యములు కాకున్నవి.

అని ఛాందోగ్యమందును, భాష్యమందును చెప్పబడుటవలన బ్రహ్మస్వరూపగతులై సత్యాత్మకులైన భీష్మాదులు అనృతములైన జన్మాదివికారములచే నావిర్భవించి యదృశ్యులై వ్యాసమహర్షి విద్యామహత్త్వమును బట్టి యావిర్భవించి స్త్రీపురుషసామాన్యముచే యథార్థముగా గ్రహింపబడి వారలతో విహరించి రనుట యుక్తము.

ఇతోఽధికవిశేషము మా 'వేదాంతశతకము' అను గ్రంథమందు దహరాధికరణమున జూడనగును. ఇది నీలకంఠీయములోని విషయము.

ఈగ్రంథసందర్భమునుబట్టి మరణించినవారి పునర్దర్శనము సంభవమే యనియు, నీవిషయము మహర్షిప్రతిపాదితమే యనియు, వేదవ్యాసభగవానుని యసాధారణ విద్యాప్రభావమున నాడు ధృతరాష్ట్రాదుల కది ఘటించినదనియు, స్పష్టమైనది. ఈవిషయము శాస్త్రజ్ఞానశూన్యులకు తెలియునదికాదు. కనుకనే ప్రతివాదులు ఆ లోకోత్తరప్రజ్ఞుని, ఆపరమపావనుని, ఆమునిజనమూర్ధన్యుని, ఆకలికల్మషహరుని యేమేమో దుర్భాషలాడినారు. అవి యసంగతములని ప్రమాణోపపత్తులతో నిరూపించినాము. ఇక దీనిని విడిచి విషయాంతర మందుకొందము—

వ్యాసుడు పాండవపక్షముగా వ్రాసిన జయమును సంజయునకు కూడ జూపలేదను వాదము—తన్నిరాకరణము:—

మ.భా.చ. కారులవ్రాత యిట్లున్నది—"యుద్ధమిక నగుననగా ధృతరాష్ట్రునితో వ్యాసుడిట్లనెను. ఓధృతరాష్ట్రా! ఈకౌరవులయొక్కయు, పాండవులయొక్కయు, అందఱియొక్కయు కీర్తినినేను ప్రకటన జేయుగలను. విచారింపకుమా' ఇట్లని వ్యాసుడు మూడేండ్లు 'జయ' గ్రంథము జేసి ధృతరాష్ట్రాదులు గతించిన పిమ్మటగాని

లోకమున వెల్లడింపలేదు. జయమును సంజయునకుగూడ వ్యాసుడు చూపినటుల లేదని సౌతి యనుక్రమణికాధ్యాయములో వ్యాసుని 8800 శ్లోకములను 'సంజయో వేత్తివా నవా' సంజయుడు కూడ నెఱుగునో యెఱుగడో అని చెప్పుటచే నూహింపబడుచున్నది. మొత్తమునకు వ్యాసుడు పాండవపక్షపాతియై జయమును పాండవపక్షముగా వ్రాసియుండుటచే బ్రత్యక్షముగా వ్యవహారముల జూచిన సంజయునకుగూడ జయమును చూపకుండుటలో నాశ్చర్యములేదు. వ్యాసుడు వాల్మీకివలె ధర్మాతిశయనిరూపకకవి గాక, అర్థాతిశయనిరూపకకవియై యన్యాయమున కొడబడినవాడుగా గాన్పించును" (పు 158)

మ.భా.చ. కారులిచ్చట మహర్షిపై నారోపించిన నిందలు మూడు. అందు ధృతరాష్ట్రునితో నేనందరికీర్తిని ప్రకటింతునని చెప్పి వ్రాసిన జయమును ధృతరాష్ట్రాదులు గతించినపిమ్మటగాని వెల్లడింపకపోవుట యొకటి. సంజయునకుగూడ జయమును చూపకుండుట యొకటి. వీనిని క్రమముగా పరిశీలింతము

ధృతరాష్ట్రునితో వ్యాసమహర్షి యేమని చెప్పెను?
"అహంతు కీర్తిమే తేషాం కురూణాం భరతర్షభ ।
పాండవానాంచ సర్వేషాం ప్రథయిష్యామి మానుచః॥"

అనియేకదా! ఇందు అందరి కీర్తిని ప్రకటింపగలను. అని మాత్రమే యున్నదికాని ధృతరాష్ట్రాదులు జీవించియుండగనే ప్రకటింతుననికాని, గ్రంథము ధృతరాష్ట్రాదులకు వినిపింతుననికాని లేదే. ఇట్టి స్థితిలో ధృతరాష్ట్రాదులు గతించిన తరువాత వెల్లడించిన నేరమేమి? ప్రతివాదుల యూహానుబట్టి పాండవపక్షముగా వ్రాయబడిన గ్రంథమును పాండవు లుండగా వెల్లడించుటకాని, పాండవులకు వినిపించుట

కాని జరిగెనా? పరీక్షిత్కాలములోగూడ వెల్లడింపక జనమేజయసర్ప సత్రమందు 'వైశంపాయనముఖమున ప్రసక్తిని బట్టి వెల్లడించె' నని కదా యున్నది. ఇట్లుండ ధృతరాష్ట్రాదు లుండగా వెల్లడింపలేదని యొక నేరమా? ధార్తరాష్ట్రుల కీర్తిని తనగ్రంథమందు వర్ణింపక పోవుటే అప్పుడు వెల్లడింపకపోవుటకు కారణ మందురా? వారలకీర్తిని వర్ణింపక బోవుటేమి?

"శౌర్య శ్లాఘా భవే త్కీర్తి ర్యశ శ్శుత్రువధే ప్రథా" అను నిర్వచనమును బట్టి శౌర్యమును శ్లాఘించుట కీర్తియగును. కనుక దుశ్శాసనాదుల శౌర్యమును 'ద్యూతసభకు ద్రౌపది నీడ్చుకొని వచ్చెను' అని వర్ణింపలేదా? ఈ మ. భా. చ. కారులే దుశ్శాసనుని గూర్చి వ్రాయుచు—

"దుశ్శాసనుడు బాహుబలశాలి, శస్త్రాస్త్రవిద్యాకోవిదుడు. కీచక సైంధవులంగూడ బోరగిలం ద్రోయఁగలిగిన ద్రౌపతి నీడ్చి తీసి కొనిరాగలిగెను" (పు271)

అని దుశ్శాసనుని యాశౌర్యమును శ్లాఘింపలేదా? కనుక మొదటినింద నిరస్తమైనది ఇక రెండవదానిని జూతము—

వ్యాసుడు తనగ్రంథమును సంజయునకుగూడ జూపినట్లు లేదట. ఇట్లనుట కాధారము—

"గ్రన్థగ్రన్థిం తదా చక్రే ముని ర్గూఢం కుతూహలాత్ ।
యస్మిన్ ప్రతిజ్ఞయా ప్రాహ ముని ర్ద్వైపాయన స్త్విదమ్ ॥
అష్టౌ శ్లోకసహస్రాణి అష్టౌ శ్లోకశతానిచ ।
అహం వేద్మి శుకో వేత్తి సంజయో వేత్తి వా నవా ॥"

అను గ్రంథమట. ఇచ్చట, గ్రంథగ్రంథిరూపములై యున్నవి.

యెనిమిదివేల యెనిమిదివందల శ్లోకము లనియు, వానిని సంజయుడెఱుగునో యెఱుగడో అనియు జెప్పబడినదికాని వ్యాసుని గ్రంథమే కావన్మాత్ర మని చెప్పబడలేదు. వ్యాసునిది లక్షగ్రంథము. 'అనేకకర్తృత్వ నిరాకరణము' లో నీవిషయము నిర్ధారితమైయున్నది. ఇప్పుడు వ్రతివాదు లన్నట్లాలోచించినను లక్షగ్రంథములోని 8800 ఘట్టశ్లోకములనుమాత్రము సంజయునకు జూపకున్న నేరమేమి? అది తప్ప కథాసందర్భముకేయావద్గ్రంథము జూపబడినట్లేకదా.

మఱియు "సంజయో వేత్తివా నవా" అని యుండుటను బట్టి సంజయునకు గ్రంథము జూపినట్లు లేదందురే. చూపనట్లు మాత్రమున్నదా? 'వేత్తివా నవా' అనుదానికి చూపనట్లర్థమా?

మఱియు వ్యాసమహర్షి యన్నమాట యేమి? గ్రంథగ్రంథులైన 8800 శ్లోకములను నేనెరుగుదును. శుకుడెఱుగును. సంజయుడెరుగునో యెరుగడో అని కదా! దీనితాత్పర్యము, ఆశ్లోకముల గూఢార్థము నాకును శుకునకును తెలియును. సంజయునకట్లు గూఢార్థము తెలియునో లేదో అనియేకదా.

ఇప్పుడు సంజయుడు ఆ 8800 శ్లోకముల మొగమే యెఱుగకుండుట నిజమైనయెడల నాతని కాశ్లోకముల గూఢార్థము తెలిసెనో లేదో యను సంశయమే అసంభవము. శ్లోకోక్తమైయున్న యీసంశయమును బట్టియే సంజయుడా 8800 శ్లోకములను తప్పక చూచియుండెనని నిర్ణయింపవలసియున్నది. అట్లు సంజయుడు చూచుట వ్యాసమహర్షి చూపుటచేతనే అనవలసియున్నది. కనుక మహర్షి సంజయునకు చూపినట్లు లేదను మ.భా.చ. కారులవ్రాత హేయము.

దీనినిబట్టియే "వ్యాసుడు పాండవపక్షముగా వ్రాసియుండు

టచే ప్రత్యక్షముగా వ్యవహారములఁ జూచిన సంజయునకుగూడ జూప కుండుటలో నాశ్చర్యము లేదు" అను వ్రాతగూడ బరాస్తమైనది.

ప్రత్యక్షముగా వ్యవహారముల జూచిన సంజయునకు పూర్వోక్తప్రకారము వ్యాసమహర్షి తనగ్రంథమును చూపినట్లే సిద్ధించుట చేతగూడ మహర్షి న్యాయముగనే గ్రంథము వ్రాసె నని ధ్రువపడుచున్నది.

ఇట్లుండుటచే, సంజయునకు జూపినట్లు లేదను కల్పనమీద మహర్షి యన్యాయమున కొడబడె నన్న మూడవనిందకూడ పరాస్తమైనది.

సంజయుడు ప్రత్యక్షముగా జూచిన వ్యవహారములలో యుద్ధవ్యవహారములు వ్యాసభగవానుని కటాక్షముచేతనే చూడగలిగెను సుమా. యని మ. భా. చ. కారులకు దెలుపుచున్నాము. ధృతరాష్ట్రుడు యుద్ధమును సాకల్యముగా దెలిసికొనగోరుచున్నా నని ప్రార్థింపగా-వ్యాసమహర్షి—

"ఏష తే సంజయో రాజన్ యుద్ధ మేత ద్వదిష్యతి ।
చక్షుషా సంజయో రాజన్ దివ్యేనైవ సమన్వితః ॥
కథయిష్యతి తే యుద్ధం సర్వజ్ఞశ్చ భవిష్యతి ।
ప్రకాశంవాఽప్రకాశంవా దివావా యదివా నిశి ॥
మనసా చిన్తిత మపి సర్వం వేత్స్యతి సంజయః ।"

సంజయుడు దివ్యదృష్టికలిగి ప్రకాశముగా గాని, ప్రచ్ఛన్నముగా గాని, పగటియందుగాని, రాత్రియందుగాని, యేమి జరిగినను, మనస్సులలో నేమేమి యాలోచింపబడినను సర్వము దెలిసికొని నీకు జెప్పును. అని వర మిచ్చియుండెను. కనుకనే యావద్వృత్తాంతమును

ధృతరాష్ట్రునకు సంజయుడు చెప్పగలిగెను జరిగినది జరిగినట్లు కాక ప్రతివాదు లన్నట్లు అన్యాయముగా గ్రంథము రచించినయెడల మహర్షి యథార్థము గ్రహింపగల దివ్యదృష్టిని సంజయున కిచ్చి కూర్చుండబెట్టునా? కనుక 'అన్యాయమున కొడబడెను' అను మ. భా. చ. కారుల మాట నింద్యము.

దీనిచే "వ్యాసుడు వ్రాసిన జయము రణరంగమునకు సైన్యము నడచువఱకు మాత్రమె విపులముగా జెప్పబడి యుద్ధవృత్తాంత మేసంజయునివలననో విని యావ్యాసుడు ముక్తసరుగా జెప్పి యుండును." (మ భా. చ. పు 68)

అనువ్రాత నిరస్తము. యుద్ధవృత్తాంతమును వ్యాసునకు వచ్చి సంజయుడే చెప్పుచుండె ననునది కేవలము దురూహ. విషయాంతర మందుకొందము—

వ్యాసుడు సంకీర్ణజాతీయు డగుటచే సంకీర్ణజాతీయులగు
పాండవులకు దోడ్పడెనను ప్రసంగము—తన్నిరాకరణము.

మ. భా. చ. కారుల వ్రాత యిట్లున్నది—"వ్యాసుడు సంకీర్ణ జాతీయు డగుటచేతనే సంకీర్ణజాతివా రగు పాండవులకు బెక్కు చోటుల బెక్కుభంగుల దోడ్పడెను" (పు. 149) ఇతరులనుగూర్చి వ్రాత కూడ నిట్లే యున్నది.

"ఎట్టులైనను విదురుడు సంకీర్ణుడే. అందువలననే సంకీర్ణజాతివా రగు పాండవులపై ననురాగము" (పు. 128)

"కృపుడు...సంకీర్ణుడు...కౌరవుల కూడు దినుటచే నీతడు కౌరవపక్షముగా బోరెనుకాని సంకీర్ణులగు పాండవులపక్షమున మాటలాడువాడు" (పు. 126)

"ద్రోణుడు తనవలె సంకీర్ణసంభవులగుటచేగాబోలు పాండవు లపై నభిమానము జూపుచుండెను." (పు. 124)

"భీష్ముడు, పాండవులు గాలికి వానదేవత మొదలగువారికి బుట్టినటుల దాను నదికి బుట్టిన సంకీర్ణుడుగాన పూర్వాచారపరు డగు దుర్యోధనుని కపకృతిని, సంకీర్ణులగు ధర్మరాజాదుల కువకృ తిని జేసియున్నా డని ముమ్మాటికిని జెప్పవచ్చును" (పు. 121)

"పాండవపక్షపాతు లెవరు? నేటి కాలపు సామాన్యజను లందరు పాండవపక్షపాతులే" (పు 120)

ఈవ్రాతచే పాండవులు సంకీర్ణజాతీయు లనియు, నట్టి పాండ వులయందు వేదవ్యాసాదులు పక్షపాతము కలవా రనియు, వారి కాపక్షపాతము తాముకూడ సంకీర్ణజాతీయు లగుటచేతనే కలిగె ననియు తేల్చి ధర్మతత్త్వవిదులగు వేదవ్యాస భీష్మద్రోణ కృపాచార్య విదురులను సంకీర్ణజాతీయు లనియు, పక్షపాతు లనియు చులకనగా దీసి వేసినారు. ఈప్రతివాదుల నోటిమాటను బట్టుకొనియే మ oదు పరిశీ లింతము—

సంకీర్ణజాతివారికి సంకీర్ణజాతివారియందే పక్షపాత మని వ్రాత లోని సారాంశము. ప్రతివాదినిర్ణయప్రకారము వ్యాసాదులవలె భిన్న జాతీయస్త్రీపురుషసంబంధమును బట్టి ధృతరాష్ట్రుని, కర్ణుని గూడ సంకీర్ణజాతివా రని యనవలసినదే. వీరిరువురు సంకీర్ణజాతీయులై యుం డియు సంకీర్ణజాతీయు లనబడిన పాండవులయందు పక్షపాతము లేని వారు అందుచే 'సంకీర్ణజాతివారికి సంకీర్ణజాతివారియందే పక్షపాతము' అను మాట ప్రతిహత మైనది. ఇంతేగాక సంకీర్ణజాతివా రగు కర్ణ ధృతరాష్ట్రులకు పూర్వాచారపరు డని ప్రతివాదు లన్న దుర్యోధనుని

యందే పక్షపాత ముండుటను బట్టి సంకీర్ణజాతివారికైనను పూర్వాచారపరులయందును పక్షపాత ముండు నని యేర్పడినది.

మఱియు, పాండవులయందు సంకీర్ణజాతీయులైయుండియు ధృతరాష్ట్రున కనాదరణము కర్ణునకు ద్వేషము నుండుటనుబట్టి ప్రతివాదు లన్నట్లు ఒక్కపాండవపక్షపాతులే సంకీర్ణజాతివారు కాక పాండవద్వేషులుగూడ సంకీర్ణజాతివారే యని సిద్ధించినది. పాండవద్వేషులే గాక దుర్యోధనపక్షపాతులుగూడ సంకీర్ణజాతివా రని సిద్ధించినది.

ఇట్లు ప్రతివాదుల నోటిమాటలనే తీసికొని చూచినను పాండవపక్షపాతమునకును, సంకీర్ణజాతికిని యేమాత్రము సంబంధము లేదని తేలినది

ఈప్రస్తావములో పుత్రుడగు దుర్యోధనుని మందలించిన గాంధారి యుపదేశమును చూడవలసియున్నది. ప్రతివాదు లీగాంధారిని గూర్చి—

"మరణసంశయముగు యుద్ధమున కేగుచు దన్ను దీవింపు మని వచ్చిన కుమారుని "యతో ధర్మ స్తతో జయః" అని ధర్మైకాగ్రచిత్తయై దీవించిన ధర్మపరితాము తల్లిక' మ. భా. చ. (పు268) అని ప్రశంసించియే యున్నారు.

ప్రతివాదు లుదాహరించిన యీదీవనకు తాత్పర్యము ముందు గ్రహింపవలసియున్నది జయము ధర్మాధీనముకనుక ధర్మ మెచ్చటనో జయ మచ్చట, అని 'యతో ధర్మ స్తతో జయః' అనుమాటకు తాత్పర్యము.

ఇది దుర్యోధనుని విజయమునకు జేసిన దీవనకాదు. అట్టిదీవనయే యైన మహాపతివ్రత దీవన వ్యర్థమగునా? అట్టిదీవన 'విజయీభవ' అనియో, 'నీధర్మమే నీకు విజయమిచ్చుగాక' అనియోయుండును.

ధర్మము దుర్యోధనునిపట్ల లేదుకనుకనే 'యతో ధర్మ స్తతో జయః' అని యన్న దన్నమాట. ఈదీవననుబట్టి దుర్యోధనునిది ధర్మ మని ప్రతివాదులు భ్రాంతిపడిరి కాబోలు. పాండవులదే ధర్మ మని గాంధారి పుత్రునకు జెప్పియున్నది ఆప్రసంగము జూడుడు—

"దుర్యోధన యదాహ త్వాం పితా భరతసత్తమ ।
భీష్మో ద్రోణః కృపః క్షత్తా సుహృదాం కురు తద్వచః ॥
యథా భీష్మ శ్శాంతనవో ద్రోణశ్చాపి మహారథః ।
అహతు స్తాత తత్సత్య మజేయౌ కృష్ణపాండవౌ ॥
శ్రీమద్భి రాత్మవద్భి స్తై ర్బుద్ధిమద్భి ర్జితేన్ద్రియైః ।
పాండవై ర్విగ్రహ స్తాత భ్రంశయే న్మహత స్సుఖాత్ ॥
యచ్చ త్వం మన్యసే మూఢ భీష్మద్రోణకృపాదయః ।
యోత్స్యన్తే సర్వశక్త్యేతి నైత దద్యోపపద్యతే ॥
సమం హి రాజ్యం ప్రీతిశ్చ స్థానం హి విదితాత్మనామ్ ।
పాండవే ష్వథ యుష్మాసు ధర్మ స్త్వభ్యధిక స్తతః ॥"
(ఉద్యో అ. 129)

దుర్యోధనా! నీతండ్రియు, భీష్మద్రోణకృపవిదురులు నీకు చెప్పియున్న విధముగనే నీవు చేయుము. వారు ప్రేమకలవారు. పూజ్యులైన భీష్మద్రోణులు చెప్పినది సత్యము. కృష్ణార్జునులు అజేయులే. గుణవంతులగు పాండవులతో విరోధము సుఖభ్రష్టత కలుగ జేయును. మూఢుడా? భీష్మద్రోణకృపాచార్యాదులు సర్వశక్తులతో యుద్ధము జేయుదు రని భావించుచున్నావు; కాని యిప్పుడది సాగదు. మీయందును, పాండవులయందును ప్రీతిమొదలైనవి యాగిదితాత్ములకు సమానములే యైయున్నను ఆపాండవులయందు ధర్మమభ్యధికము. ఈయుపదేశములో భీష్మద్రోణకృపవిదురులు దుర్యోధనునియందు సౌహార్దము కలవా రని గాంధారి యన్నది. ఆభీష్మాదులు సంకీర్ణ

జాతీయులు, పాండవపక్షపాతులు, దుర్యోధనునకపకారులు అని మ. భా. చ. కారు లన్నారు. ధర్మము పాండవపక్షమం దున్న దని గాంధారి యన్నది. కౌరవపక్షమందే యున్నట్లు మ. భా. చ. కారు లందురు. ఇందెవ్వ రెట్టివారో ఆగాంధారికి తెలియునా? ఈ మ. భా. చ. కారులకు తెలియునా?

మఱియు పాండవులు సంకీర్ణజాతివా రని మ. భా. చ కారు లన్నారు. తనతో సమానజాతివారే పాండవు లనిదుర్యోధనుడన్నాడు. చూడుడు—

ధృతరాష్ట్రుడు, సంజయునితో పాండవు లధికబలులు— వారికి జయము తప్పదు. నేవలదనుచున్నను దుష్పుత్రుడు యుద్ధమునే కోరు చుండెను. అన్నపుడు దుర్యోధనుడు—

"ఉభౌ స్వ ఏకజాతీయౌ తథోభౌ భూమిగోచరౌ ।
అథ కస్మా త్పాండవానా మేకతో మన్యసే జయమ్ ॥"ఉద్యో అ57

"మే మిరువురము నేకజాతివారము, భూపతులము నైయుండ నొక్కపాండవులకే జయ మని తలచెదవేమి?" అనెను. దీనిచే పాండవులకును, దుర్యోధనాదులకును జాతిభేదము లేదని సిద్ధించినది. ఇప్పు డాలోచింప పాండవుల జాతి యేదో ఆదుర్యోధనునకు దెలియునా? ఈ మ. భా. చ. కారులకు దెలియునా?

మఱియు. ద్రోణకృపులను సంకీర్ణజాతివారని (భిన్నజాతీయ స్త్రీపురుషసంజాతులని) మ. భా. చ కారు లన్నారు.

వారినిగూర్చిదుర్యోధను డయోనిజు లని చెప్పెను. చూడుడు—
"బ్రహ్మర్షేశ్చ భరద్వాజా ద్ద్రోణో ద్రోణ్యా మజాయత ।
కృప శ్చాచార్యముఖ్యోఽయం మహర్షే ర్గౌతమా దపి ॥

శరస్తంబోద్భవ శ్శ్రీమా నవధ్య ఇతి మే మతిః।
అయోనిజా స్త్రయో హ్యేతే పితా మాతాచ మాతులః॥
అశ్వత్థామ్నో మహారాజ సచ శూరః స్థితో మమ।" ఉద్యో అ55

ఇచ్చట బ్రహ్మర్షియగు భరద్వాజుని వలన ద్రోణి (పాత్రవిశేషము) నుండి జన్మించినవాడు ద్రోణుడనియు, గౌతమమహర్షి వలన శరస్తంబమునుండి జన్మించినవాడు కృపాచార్యుడనియు, నశ్వత్థామయొక్క తండ్రియగు ద్రోణాచార్యులు, తల్లియగు కృపి, మేనమామయగు కృపాచార్యులు నను ముగ్గురును అయోనిజు లనియుజెప్పబడినది.

ఇట్లుండ ద్రోణాదులను గూర్చి దుర్యోధనునకు తెలియునా? ఈ మ. భా. చ కారులకు తెలియునా? కనుక మ భా. చ. కారుల వ్రాత నింద్యము. అయోనిజజన్మప్రామాణికత్వము 'ద్రౌపదీనిందానిరాకరణ' మను ప్రకరణమున నిరూపింపబడెను. ఇక వ్యాసమహర్షినిగూర్చి చెప్పవలసియున్నది.

మహర్షి విప్రుడే యని వెనుక గొంత చెప్పియుంటిమి. ఆవిషయ మింకను ముందు చెప్పబడును కనుక "వ్యాసుడు సంకీర్ణజాతీయు డగుటచేతనే సంకీర్ణజాతివా రగు పాండవులకు బెక్కుచోటుల బెక్కుభంగుల దోడ్పడెను" అను మ. భా. చ. కారుల మాటలో వ్యాసుడు సంకీర్ణజాతీయు డను మాట త్రోసివేయబడినది.

పాండవులు సంకీర్ణజాతివా రను మాట, పూర్వము చూపిన దుర్యోధనవాక్యముచే నిరస్తము. ఇక వ్యాసమహర్షి పాండవులకు దోడ్పడెను. అన్నమాట యున్నది. ఆపన్నులైన పాండవులకు దోడ్పడుట వ్యాస మహర్షికి తప్పా? ఇటు కౌరవులయందును, అటు పాండవులయందును సమానదృష్టియే మహర్షి కున్నను ఆపన్ను లగుటచే పాండవులయందు కరుణాతిశయము కలిగినది. అదియే ధర్మ

త్ముల లక్షణము. ఈవిషయమును ధృతరాష్ట్రునితో సంభాషించునపుడు శక్రసురభిసంవాద ముదాహరించుచు వ్యాసమహర్షియే చెప్పియుం డెను. చూడుడు—

సురభిః—

"యది పుత్రసహస్రాణి సర్వత్ర సమమేవ మే ।
దీనస్యతు సత శ్శక్ర పుత్ర స్యాభ్యధికా కృపా ॥
తద్వథా సురభిః ప్రాహ సమ స్త్వేవాఽస్తు తే తథా ।
సుతేషు రాజన్ సర్వేషు హీనే ష్వభ్యధికా కృపా ॥
యాదృశో మే సుతః పాండు స్తాదృశో మేఽసి పుత్రక ।
విదురశ్చ మహాప్రాజ్ఞః స్నేహా దేత ద్బ్రవీ మ్యహమ్ ॥
చిరాయ తవ పుత్రాణాం శత మేకశ్చ భారత ।
పాండోః పంచైవ లక్ష్యన్తే తేఽపి మన్దాస్సుదుఃఖితాః ॥"

నీలకంఠీయమ్—

"మన్దాః=త్వత్పుత్రవత్ కపటానభిజ్ఞాః ।"
కథం జీవేయు రత్యన్తం కథం వర్ధేయు రిత్యపి ॥
ఇతి దీనేషు పార్థేషు మనో మే పరితప్యతే ।
భవన్తి హి నరవ్యాఘ్ర పురుషా ధర్మచేతసః ॥
దీనాభిపాతినో రాజ న్నాత్ర కార్యా విచారణా ।
పాండో స్సుతా యాదృశా మే తాదృశా స్తవ భారత ॥
దీనా ఇతీవ మే బుద్ధి రభిపన్నాఽద్య తాన్ ప్రతి ।" (వనప. ౮9)

ధృతరాష్ట్రా! సురభియను దేవధేనువు-మున్నుచు దుర్బలస్థితి లోనుండి దెబ్బలుతినుచున్న పుత్రుని జూచి ఖేదపడి యింద్రునితో పుత్రులందరియందు నాకు సమానదృష్టియే కాని యాపన్నుడైన పుత్రునియం దధికదయ యనిచెప్పియున్నది.

ఆసురభి చెప్పినట్లు నీకు పుత్రులందరియందును సమబుద్ధి యుండవలసినదే. ఆపన్నులయందు మాత్ర మధికదయ యుండవలెను. నాకు పాండురాజు, నీవు, విదురుడు అను ముగ్గురు సమానులే నీకు చిరకాలమునకు శతాధికసుతులుకలిగిరి. పాండురాజునకు గలిగినవారైదుగురే. వారు నీపుత్రులవలెగాక కపట మెరుగనివారును, దుఃఖాక్రాంతులునై యున్నారు. వారెట్లు జీవింతురు? ఎట్లు వర్ధిల్లుదురు? అని నామనస్సు పాండవులను చూచి పరితపించుచున్నది. ధృతరాష్ట్రా! ధర్మాత్ములకు దీనోద్ధరణము కర్తవ్యమే కదా. నాకు పాండుపుత్రు లెట్టివారో నీపుత్రులు నట్టివారే వారు దీనులైయున్నా రని యిప్పుడు నాబుద్ధి వారియందు సంసక్తమైనది. అని తాత్పర్యము.

ఇట్లే లక్కయింటినుండి తప్పించుకొని జటాధారులై తాపసవేషములతో కుంతీసహితముగా నేకచక్రపురమందు పాండవులు ప్రవేశింపబోవు నపుడు మహర్షి దర్శన మిచ్చి చెప్పెను—

"మయేదం వ్యసనం పూర్వం విదితం భరతర్షభాః ।
యథాతు తై రధర్మేణ ధార్తరాష్ట్రై ర్వివాసితాః ॥
తద్విదిత్వాఽస్మి సంప్రాప్త శ్చికీర్షుః పరమం హితమ్ ।
న విషాదోఽత్ర కర్తవ్య స్సర్వ మేత త్సుఖాయ వః ॥
సమాస్తే చైవ మే సర్వే యూయం చైనం న సంశయః ।
దీనతో బాలత శ్చైవ స్నేహం కుర్వన్తి మానవాః ॥
తస్మా దభ్యధిక స్నేహో యుష్మాసు మమ సాంప్రతమ్ ।
(ఆది అ. 156)

దుర్యోధనాదులు అధర్మబుద్ధితో హస్తినాపురమునుండి మిమ్ములను వెడలగొట్టిన విధానము నేను ముందే గ్రహించితిని. మీకు హితము గలిగింప వచ్చితిని. యిది మీకు మంచికే వచ్చినది. ఖేద

పడకుడు. నాకు దుర్యోధనాదులును, మీరును సమానులే. దీనులయందును, బాలులయందును ప్రేమాతిశయ ముండుట మనుష్యసామాన్య ధర్మముకనుక నా కిప్పుడు మీయందు ప్రేమాతిశయము. అని తాత్పర్యము.

ఇట్లున్న వేదవ్యాసవాక్యములను చూడగా ధృతరాష్ట్రునితో సంభాషించునపు డెట్లు కౌరవులును, పాండవులును నాకు సమానులే యని చెప్పెనో, అట్లే కేవలము పాండవులతో మాట్లాడునపుడుగూడ మీరును, దుర్యోధనాదులును నాకు సమానులే. యనుటవలన కౌరవుల యందు దయారహితు డనుట ప్రతివాదుల తప్పు. పాండవులు దీనులై యున్నందున ప్రేమాతిశయ మనుటచే 'వ్యాసుడు పాండవ పక్షపాతి' అను తమ బుద్ధిని 'వ్యాసమహర్షి దీనదయాపరుడు' అని దిద్దుకొనవలెను. దీనదయాపరు డగు వ్యాసమహర్షి దీనులైయున్న పాండవులకు తోడ్పడుట దోష మని ప్రతివాదుల కనిపించినది కాని ప్రాజ్ఞుల కనిపింపదు కనుక ప్రతివాదుల వ్రాత హేయము.

—♦ వేదవ్యాససంకీర్ణజాతీయతానిరాకరణము ♦—

వేదవ్యాసమహర్షిని సంకీర్ణజాతీయుడన్న మ. భా. చ. కారులు అచ్చటచ్చట మహర్షిని గూర్చి యెట్లు వ్రాసిరో చూడవలసి యున్నది—

"వ్యాసుడు, జాబాలి, కవషుడు మొదలగువారు వారితల్లు లేజాతివారైనను బీజప్రాధాన్య తపోవిశేషములచే మహర్షులైరి."

"జన్మముచే స్మృతుల ననుసరించి నిషాదుడును, తపోమహిమ బీజప్రాధాన్యముల ననుసరించి బ్రహ్మర్షియు నగువ్యాసునకు క్షత్రియాంగనలయందు రాజులగు ధృతరాష్ట్ర పాండురాజు లుద్భవించిరి." (పు. 72)

అని వ్రాసియున్నారు. ఇందు బీజప్రాధాన్యము బీజప్రాధాన్య మనుటవలన పరాశరమహర్షిని బట్టి మహర్షియందు బ్రాహ్మణత్వమే కలదని వారన్నట్లేకద.

ఇక 'జన్మముచే స్మృతుల ననుసరించి నిషాదుడు' అన్నమాట కర్థమేమి? బీజప్రాధాన్య మనునది స్మృతుల ననుసరించి కాదా? స్మృతులే బీజప్రాధాన్యమును చెప్పి, జన్మముచే నిషాదు డని యాస్మృతులెట్లు చెప్పును? జాతి జన్మసిద్ధముకనుక నిషాదుడే యైనయెడల బీజప్రాధాన్యమే పోయినది. బీజప్రాధాన్యమే యున్నయెడల నిషాదత్వము పోయినది. ఇట్టిస్థితిలో బీజప్రాధాన్య మనుట, నిషాదు డనుట విరుద్ధము. అట్టి నిషాదునకు క్షత్రియాంగనలయందు జన్మించిన ధృతరాష్ట్రాదులు క్షత్రియు లగుటకూడ స్మృతులనుబట్టి విరుద్ధమే. అసలు నిషాదు డనుటకు గల వారి యూహలు వెనుక నిరసింపబడియే యున్నవి.

ఇంకొకటి, యెవ్వరో, 'వ్యాసజననియగు సత్యవతీదేవి బ్రాహ్మణియే' యన్నా రని యావాదమును త్రోసివేయుటకు గొన్ని ప్రమాణములు చూపుచు మ. భా. చ. గారు లిట్లు వ్రాసిరి—

"ధర్మశాస్త్రగ్రంథములలో నుత్కృష్టగ్రంథమగు మనుస్మృతికి వ్యాఖ్యానమగు 'మన్వర్థముక్తావళి' యందు కుల్లూకభట్టు బీజక్షేత్రప్రాధాన్యముగూర్చి వ్రాయుచు వ్యాసధృతరాష్ట్రాదులఁ జేర్కొని నాడు. చూడుడు—

"విశిష్టం కుత్రచి ద్బీజం స్త్రీయోని స్త్వేవ కుత్రచిత్॥ మను. 9అ

వ్యా...క్వచి ద్బీజం ప్రధానం జాయతే. యదర్థ ముప్తోయ మితి న్యాయేన ఉత్పన్నో బీజినో బుధఇవ సోమస్య. తథా వ్యాసబు

శ్యశృంగాదయః బీజినామేవ సుతాః. క్వచిత్ క్షేత్రస్య ప్రాధాన్యమ్ ...అతఏవ విచిత్రవీర్యక్షేత్రే క్షత్రియాయాం బ్రాహ్మణోత్పాదితా అపి ధృతరాష్ట్రాదయః క్షత్రియాః క్షేత్రిణఏవ పుత్రా బభూవుః. మన్వర్థముక్తావళి.

ఒక్కొక్కచోట బీజము ప్రధాన మగును. "ఎందుకై పుట్టింపబడె నతడు" అనున్యాయముచే బీజివలన బుట్టింపబడినవాడు-సోమునకు బుధునివలె. అట్లే వ్యాసఋష్యశృంగాదులు బీజముకలవారికే సుతులైరి. ఒక్కొకచోట క్షేత్రమునకు ప్రాధాన్యము కలదు. కనుకనే విచిత్రవీర్యుని క్షేత్రముగు క్షత్రియయందు బ్రాహ్మణోత్పాదితులైనను ధృతరాష్ట్రాదులు క్షత్రియులే యైరి" (మ భా. చ. పు 66)

ఇందొక చిత్రమున్నది కుల్లూకభట్టీయములో "క్వచి ద్బీజం ప్రధానం జాయతే యదర్థ ముత్పోయ మితి న్యాయే నోత్పన్నో బీజినః" అని యున్నదని, దాని కర్థము=ఒక్కొకచోట బీజము ప్రధాన మగును 'ఎందుకై పుట్టింపబడె నతడు' అను న్యాయముచే బీజివలన బుట్టింపబడినవాడు. అని వ్రాసిరికదా. 'యదర్థ ముత్పోయమ్' అను న్యాయస్వరూప మేమి? దానికి 'ఎందుకై పుట్టింపబడె నతడు' అని యర్థ మేమి? అట్టిన్యాయముచే బీజప్రాధాన్యపక్షమున కుపోద్బల మేమి? అని విచారింపకయే ప్రతివాదులు కనబడినదానికి తోచిన ట్లర్థము జెప్పినారు. ఇదియే చిత్రము! కుల్లూకభట్టీయములో 'యదర్థ ముత్పోయమ్' అని కాక యాదృశ మ్నాప్యతే బీజమ్' అనిపాఠము.

"యాదృశమ్నాప్యతే బీజం క్షేత్రే కాలోపపాదితే।
తాదృ గ్రోహతి తత్తస్మిన్ బీజం స్వై ర్వ్యంజితం గుణైః॥"

అనునది మనుస్మృతిలో నుత్తరశ్లోకము. అది బీజప్రాధాన్య

పక్షనిరూపణమునకే చెప్పబడినది. అదియే కుల్లూకభట్టీయమందుదా హృతమైన న్యాయము.

ఇక ప్రకృతమునకు వత్తము— ఎవ్వరో వ్యాసజనని యగు సత్యవతీదేవిని బ్రాహ్మణి యనగా నామాట తప్పనుటకు ఏ మనుస్మృతి వచనమును, వ్యాఖ్యానమును మ. భా. చ కారులు ప్రదర్శించిరో అవియే 'విశిష్టం కుత్రచి ద్బీజమ్' అనియు, 'వ్యాసఋశ్యశృంగాదయో బీజినా మేవ సుతాః' అనియు, 'విచిత్రవీర్యక్షేత్రే క్షత్రియాయాం బ్రాహ్మణోత్పాదితాః' అనియు వ్యాసమహర్షి బీజప్రాధాన్యమును బట్టి బ్రాహ్మణుడే యని స్పష్టముగా జెప్పియుండగా నట్టి ప్రమాణములకు విరుద్ధముగా వ్యాసుడు సంకీర్ణజాతీయు డనుట నింద్యము. ఆమను స్మృతివచనము, ఆవ్యాఖ్యానము పరుల వాదమును ఖండించుటకే ప్రమాణముకాని తమ వాదమును ఖండించుటకు బ్రమాణము కావుకాబోలు.

ఇక బీజప్రాధాన్య మన్నను, సంకీర్ణజాతియన్నను ఒకటే యనుటకు సిద్ధపడుదురేమో! వాని భేదము దెలుపుదము. బీజప్రాధాన్య పక్షములో పితృజాతి, క్షేత్రప్రాధాన్యపక్షములో మాతృజాతి, ఆ రెండుపక్షములు కానపుడు సంకీర్ణజాతి ఈవిషయము ఆమనుస్మృతి వ్యాఖ్యానమందే యున్నది చూడుడు— "సంకీర్ణజాతీనాన్తు అశ్వతరవ న్మాతాపితృజాతివ్యతిరిక్తజాత్యన్తరత్వమ్"

ఇట్లు పరిశీలింపగా వ్యాసుడు సంకీర్ణజాతీయు డను ప్రతివాదుల వ్రాత ప్రమాణవిరుద్ధము, స్వవచనవ్యాహతము, సందర్భవిరుద్ధము నగుటచే హేయము

వేదవ్యాసమహర్షి బీజప్రాధాన్యమున బ్రాహ్మణుడేకనుక "సంకీర్ణజాతీయమగు ద్వైపాయన పక్షముపై నీసు వహించి వైదికఋషులు

తమవాఙ్మయములో ద్వైపాయనపక్షాధ్వర్యయుక్తధర్మజాశ్వమేధము పేరుగూడ జెప్పరైరి." (పు. 156)

అను మ. భా. చ. కారుల దుష్ప్రసంగము దూరాపాస్తమైనది. పాపము వీరి కొక్క ధర్మరాజాశ్వమేధము పేరు వైదికవాఙ్మయములో జెప్పనట్లు కనబడినదట! రామాయణప్రసిద్ధములైన దశరథాశ్వమేధము, సగరాశ్వమేధము, రామాశ్వమేధము మున్నగువాని పేరులు వీరికి గనబడినని కాబోలు! అప్పై వైదికఋషులు సంకీర్ణజాతీయమగు ద్వైపాయనపక్షముపై నీసు వహించిరట! ఈ సంకీర్ణజాతివ్రసంగ మింక మానవలసిన దని చెప్పియున్నాము. వైదికవాఙ్మయములో "సహోవాచ వ్యాసః పారాశర్యః" అని వ్యాసమహర్షి కీర్తింపబడియుండ వైదికఋషులకు ద్వైపాయనపక్షముపై నీసా? కనుక వీరివ్రాత హేయము.

ఇక దీనిని విడిచి పూర్వము ప్రస్తావింపబడిన బీజప్రాధాన్యక్షేత్రప్రాధాన్యపక్షములలో నెప్పు డేపక్షము గ్రాహ్య మని యున్నదో చూతము—

—♦ బీజప్రాధాన్యక్షేత్రప్రాధాన్యవ్యవస్థ ♦—

"య స్తల్పజః ప్రమీతస్య క్లీబస్య వ్యాధితస్య వా ।
స్వధర్మేణ నియుక్తాయాం స పుత్రః క్షేత్రజస్స్మృతః ॥" మను అ9

వ్యా "యో మృతస్య, నపుంసకస్య, ప్రసవవిరోధివ్యాధ్యుపేతస్య భార్యాయాం ఘృతాక్తత్వాదినియోగధర్మేణ గురునియుక్తాయాం జాతః స క్షేత్రజః పుత్రో మన్వాదిభిః స్మృతః"

మరణించినవాని భార్యయు, నపుంసకుని భార్యయు, సంతానప్రతిబంధమైనవ్యాధికలవాని భార్యయు, పుత్రసంతతికై గురుజన

ముచే నియోగింపబడినపుడు అట్టి స్త్రీయందు, దేహమంతట నెయ్యి పూసికొనుట మొదలగు నియోగధర్మ మవలంబించినవానిచే గలిగిన పుత్రుడు క్షేత్రజుడు. అట్టివానియందు క్షేత్రప్రాధాన్య మన్నమాట. కనుకనే—

"విశిష్టం కుత్రచి ద్బీజం స్త్రీయోని స్త్వేవ కుత్రచిత్ "

అను శ్లోకమునకు వ్యాఖ్యానములో "క్వచిత్ క్షేత్రస్య ప్రాధాన్యం, యథా య స్తల్పజః ప్రమీతస్యేతి వక్ష్యతి, అతఏవ విచిత్రవీర్యక్షేత్రే క్షత్రియాయాం బ్రాహ్మణోత్పాదితా అపి ధృతరాష్ట్రాదయః క్షత్రియాః క్షేత్రిణఏవ పుత్రా బభూవుః" అని క్షేత్రప్రాధాన్యపక్షమునకు నియోగవిధినిబట్టి కలిగిన ధృతరాష్ట్రాదులు నిదర్శనముగా జూపబడిరి.

"తపోబీజప్రభావైస్తు తే గచ్ఛన్తి యుగేయుగే ।
ఉత్కర్షమ్" (అ10. 42శ్లో॥

వ్యా "సజాతిజానన్తరజాః తపఃప్రభావేణ విశ్వామిత్రవత్. బీజప్రభావేణ ఋశ్యశృంగాదివత్. కృతత్రేతాదౌ మనుష్యమధ్యే జాత్యుత్కర్షం గచ్ఛన్తి"

"జాతో నార్యా మనార్యాయా మార్యా దార్యో భవే ద్గుణైః ।
జాతో ఽప్యనార్యా దార్యాయా మనార్య ఇతి నిశ్చయః ॥
యస్మా ద్బీజప్రభావేణ తిర్యగ్జా ఋషయోఽభవన్ ।
పూజితాశ్చ ప్రశస్తాశ్చ తస్మాద్బీజం ప్రశస్యతే ॥"

వ్యా—యస్మా ద్బీజమాహాత్మ్యేన తిర్యగ్జాతిహరిణ్యాదిజాతా. అపి ఋశ్యశృంగాదయో మునిత్వం ప్రాప్తాః పూజితా శ్చాభివాద్యత్వాదినా వేదజ్ఞానాదినా ప్రశస్తా వాచా సంస్తుతాః"

ఇచ్చట సమానజాతి స్త్రీలయందుగాని, యన్యతరజాతి స్త్రీల యందుగాని జన్మించినవారు విశ్వామిత్రునివలె తపఃప్రభావముచేతను, ఋశ్యశృంగాదులవలె బీజప్రభావముచేతను కృత త్రేతాదియుగము లలో జాత్యుత్కర్షమును పొందిరి. అనార్య స్త్రీయందు ఆర్యునివలన జన్మించినవాడు ఆర్యుడగును, యార్యస్త్రీయందనార్యునివలన జన్మించినవా డనార్యుడే యగునని నిర్ణయము హారిణ్యాదులయందు జన్మించినను ఋశ్యశృంగాదులు బీజప్రభావమున మునులై వేదవిదులై పూజితు లగుటచే బీజము ప్రధాన మైనది; అని చెప్పబడినది. దీనిచే నియోగసంబంధము లేనపుడు ఋష్యాదుల విషయమై బీజప్రాధాన్య పక్ష మని స్పష్టమైనది.

కనుకనే "విశిష్టం కుత్రచి ద్బీజం" అన్నపుడు వ్యాఖ్యానములో "వ్యాస ఋశ్యశృంగాదయో బీజనా మేవ సుతాః" అని వేదవ్యాసాదులు బీజప్రాధాన్యపక్షమునకు నిదర్శనముగా జూపబడిరి.

"వ్యభిచారేణ వర్ణానా మవేద్యావేదనేనచ ।
స్వకర్మణాంచ త్యాగేన జాయన్తే వర్ణసంకరాః ॥" (10-24)

వ్యా—బ్రాహ్మణాదివర్ణానా మన్యోన్య స్త్రీగమనేన సగోత్రాదివివాహేన ఉపనయనరూపస్వకర్మత్యాగేన వర్ణసంకరోనామ జాయతే.

దీనినిబట్టి అన్నివర్ణములవారును అన్యోన్య స్త్రీగమనరూపమగు వ్యభిచారము చేయుగా గలిగెడి సంతతియందు బీజప్రాధాన్య ములే నందున పితృజాతియు క్షేత్రప్రాధాన్యము లేనందున మాతృ జాతియు కాక సంకీర్ణజాతి యని తేలినది. ఇది యీపక్షములయొక్క వ్యవస్థ. ఇప్పుడు క్షత్రియకాంత లగు పాండురాజధర్మపత్నులయందు పాండురాజనియోగమును బట్టి దేవతానుగ్రహమున జన్మించిన

పాండవులు ము. భా. చ. కారు లన్నట్లు సంకీర్ణజాతివా రెట్లగుదురు. వారును ధృతరాష్ట్రాదులవలె క్షేత్రజు లగుటచే క్షేత్రప్రాధాన్యమున క్షత్రియులే యైయుండ ము. భా. చ. కారులు వారిని సంకీర్ణజాతివా రనుట నింద్యము.

> ఈవ్యవస్థచేతనే "వీర్యప్రాధాన్యమునే లెక్కగొనవలసి యుండి నచో వ్యాసుని వీర్యమునబుట్టిన శ్రీశుకుడు మహర్షియు, ధృతరాష్ట్ర పాండురాజులు క్షత్రియులు, విదురుడు శూద్రుడు నెట్లయిరి? యిచ్చట వీర్యప్రధానత కాక క్షేత్రప్రాధాన్యమే వన్నెకెక్కెను." (ము. భా. చ. పు 151)

అను వ్రాతకు శ్రీశుకు డయోనిజుడగుటచేగూడ వీర్యప్రాధాన్యమే యనియు, ధృతరాష్ట్రాదులు నియోగవిధిచే గలిగినందున వారియందు క్షేత్రప్రాధాన్యమే అనియు సమాధానము చెప్పబడినది.

ఇంకొక విశేషము— ఋషులలో బ్రాహ్మణదంపతులకు జన్మింపని కొందటికి బ్రాహ్మణ్యము చెప్పబడియున్నది. దాని కుపపత్తి యేమనగా వేదమంత్రములు వారికి స్వయముగా ప్రతిభాసించుటవలన వారికి బ్రాహ్మణ్య మని. కనుకనే—

"స్వయంప్రతిభాతవేదమంత్రత్వాఖ్య మేవ బ్రాహ్మణ్యమ్. బ్రాహ్మణ్యం బ్రాహ్మణా దజాతానా మపి" (ధర్మప్రదీపము)

అని చెప్పబడినది. వేదము లట్లు స్వయముగా ప్రతిభాసించుటకు నిదర్శనము వేదవ్యాసమహర్షియు, శుకయోగియు. శుకయోగిని గూర్చి యిట్లు చెప్పబడినది.

"ఉత్పన్నమాత్రం తం వేదా స్సరహస్యా స్ససంగ్రహాః ।
ఉపతిష్ఠు ర్మహారాజ యథాఽస్య పితరం తథా ॥" (శాం॥ అ 324)

పుట్టినతోడనే శుకయోగిని వేదములు సాకల్యముగా నీతని తండ్రి యగు వ్యాసమహర్షి నాశ్రయించిన ట్లాశ్రయించిన వని భావము..

ఇట్లే ఆయాఋషులు గూడ స్వయంప్రతిభాతవేదవశమున బ్రాహ్మణ్యముకలవా రైరని గ్రహింపబడుచున్నది.

ఇక దీని నిటుంచి క్షేత్రప్రాధాన్యపక్షమున కాధార మైన నియోగమును గూర్చి మనుస్మృతివ్యాఖ్యానములో నుదాహరింపబడిన బృహస్పతివచనము లవలోకింతము—

"ఉక్తా నియోగా మనునా నిషిద్ధా స్వయమేవ తు ।
యుగక్రమా దశక్యోఽయం కర్తు మన్యై ర్విధానతః ॥
తపోజ్ఞానసమాయుక్తాః కృతత్రేతాయుగే నరాః ।
ద్వాపరేచ కలౌ నృణాం శక్తిహాని ర్వినిర్మితా ॥
అనేకధా కృతాః పుత్రా ఋషిభిశ్చ పురాతనైః ।
న శక్యతేఽధునా కర్తుం శక్తిహీనై రిదంతనైః ॥"

అనగా- నియోగపద్ధతిని మను వుపదేశించియు, యుగక్రమము నుబట్టి యానియోగవిధి యథోక్తముగా నన్యులచే నిర్వహింపశక్యము కాదని నిషేధించెను. కృతత్రేతాద్వాపరములలోనివారు తపోబలము, జ్ఞానబలము గలవారు. కలియుగమందు మనుజులశక్తి క్షీణమైనది. పురాతనులైన ఋషులు మంత్రశక్తులతో పుత్రేష్టులతో నొకటేమి అనేకవిధముల బుత్రుల ననుగ్రహించిరి. ఇప్పుడు శక్తిహీనుల కది యశక్యము. అని తాత్పర్యము. ఈనియోగవిధి ననుసరించువారి నియమములు వెనుక 'వితంతూద్వాహప్రసంగనిరాకరణ' సందర్భములో జెప్పబడినవి. ఇచ్చట వాని ననుసంధింపవలెను.

ఇట్లు పరిశీలింపగా నాటి నియోగవిధి కర్తిపై సాముకాని, కాముకేళి కాదనియు, దానిని యథోక్తనియమములతో నిర్వహింప గల సమర్థత అప్పటివారికే యుండెడి దనియు స్పష్టమైనది. ఇక దీనిని విడిచి విషయాంతర మందుకొందము—

వ్యాసుడు భారత మన్యాయముగా వ్రాయుటచే చింతించి
భాగవతము రచించె నను ప్రసంగము—తన్నిరాకరణము.

మ. భా. చ. కారుల వ్రాత యిట్లున్నది—"న్యాయ మన్యాయ ముగాను, అన్యాయము న్యాయముగాను వ్రాయుటచే వ్యాసుడే చింతించి నారదోపదేశముచే భాగవతమును రచించియుండుటయే కాక మనసింకను బాధించుటచే గాబోలును సుయోధనునకు స్వర్గ సౌఖ్యప్రాప్తిని పాండవులకు గొంతకాలము నరకప్రాప్తినిగూడ బిమ్మట జెప్పియున్నాడు" (పు294)

ఈవ్రాతలో వెల్లడింపబడిన యంశములు రెండు; వ్యాసుడు భారత మన్యాయముగా రచించి దానికి తాను చింతించి నారదోపదేశమున భాగవతము రచించియుండె నని యొకటి. ఆచింతచేతనే సుయోధనునకు స్వర్గసౌఖ్యప్రాప్తిని చెప్పి పాండవులకు గొంతకాలము నరకప్రాప్తిని జెప్పెనని యొకటి. వీనిని గ్రమముగా బరిశీలింతము.

భారతకథలో దుర్యోధనపక్ష మొకటియు, పాండవపక్ష మొకటియు కలదు. మ. భా. చ కారులు, 'న్యాయ మన్యాయముగా వ్రాసె' నను మాట దుర్యోధనపక్షమును గూర్చి యన్నట్లున్నది. మ. భా. చ. కారులకుగూడ మహాభారతమునుబట్టి దుర్యోధనపక్ష మన్యాయముగా బ్రవర్తించినట్లర్థమైన దన్నమాటే. కాని దుర్యోధనాదు లన్యాయముగా బ్రవర్తించినట్లు మహర్షి వ్రాసెనేకాని వారు న్యాయముగనేప్రవర్తించినారని వీరికల్పన. ఈకల్పన కాధార మేమో?

దుర్యోధనాదులది న్యాయమని చెప్పెడి యార్షగ్రంథ మేదైన గలదా? మహర్షిగ్రంథ మక్రమమును మ. భా. చ. కారుల కల్పన సక్రమమునా? ప్రమాణగ్రంథమునే అప్రమాణమనువారిమాట యెవ్వనికి ప్రమాణ మగును?

ఆప్తవాక్యము ప్రమాణ మని జగత్ప్రసిద్ధము. ఆప్తు లెవ్వరో యీచరకసంహితావచనములు చెప్పుచున్నవి. చూడుడు —

"ఆప్తా స్తావత్ —

రజ స్తమోభ్యాం నిర్ముక్తా స్తపోజ్ఞానబలేన యే ।
యేషాం త్రికాల మమలం జ్ఞాన మవ్యాహతం సదా ॥
ఆప్తా శ్శిష్టా విబుద్ధా స్తే తేషాం వాక్య మసంశయమ్ ।
సత్యం వక్ష్యన్తి తే కస్మా దసత్యం నీరజ స్తమాః ॥"

అనగా- తపోబలజ్ఞానబలములచే నెవ్వరు రజ స్తమస్సుల నంతరింపజేసికొనినారో, నిర్మలమైన త్రికాలజ్ఞాన మవ్యాహతముగా నెవ్వరికి గలదో, అజ్ఞానులు అశిష్టులు ఆప్తులు. వారివాక్యము నిస్సంశయము రజ స్తమోరహితులై శుద్ధసత్త్వసంపన్నులైనవారు సత్యమే చెప్పుదురు. అసత్యము జెప్పరు. అని భావము

ఇప్పుడు మహాభారతమం దున్నది ప్రమాణమా? మ. భా. చ. కారు లన్నది ప్రమాణమా? ఆతపోబలజ్ఞానబలములు మహర్షి కున్నవా? మ. భా. చ. కారుల కున్నవా? ఆత్రికాలజ్ఞానము మహర్షిదా? మ. భా. చ. కారులదా? ఆరజ స్తమోరహితుడు మహర్షియా మ. భా. చ. కారులా? ఆఅసత్యమాడనివాడు మహర్షియా? మ. భా. చ. కారులారా? మనకట్టి యాప్తుడు మహర్షియా? మ. భా. చ. కారులా? కనుక ప్రతివాదుల వ్రాత హేయము.

న్యాయముగా బ్రవర్తించినా రని భారతములో జెప్పబడిన పాండవుల నుద్దేశించి 'యన్యాయము న్యాయముగా వ్రాసెననియున్న మాటకూడ హేయమే

మఱియొకటి. కౌరవపాండవుల న్యాయాన్యాయముల వ్యత్యాసము చేసి భారతము వ్రాసి వ్యాసుడే చింతించి నారదోపదేశమున భాగవతము రచించెనట! వీరన్నదే నిజమైనయెడల వ్యాసుడు చింతించినట్లున్న గ్రంథములో నేను వ్యత్యాసము జేసి వ్రాసితినని చింత పడిన ట్లుండవలెను. నీవావ్యత్యాసము జేయనేల. ఈచింతపడనేలయని నారదుడు మందలించిన ట్లుండవలెను. ఆచింతమీదనే వ్రాసిన భాగవతములో దుర్యోధనాదులది న్యాయమని, పాండవుల దన్యాయ్య మని యాయాప్రసంగములలో జెప్పియుండవలెను.

వ్యాసమహర్షిచింత యట్లుండనప్పుడును, నారదమహర్షి యట్లు మందలింపనప్పుడును, దుర్యోధనాదులను గూర్చి భాగవతమం దట్లు చెప్పనప్పుడును ఈప్రతివాదులవ్రాతలు తోసివేతయేకద ఇంక జూడుడు— వ్యాసమహర్షి చింతించినట్లున్నగ్రంథము శ్రీమద్భాగవతము. అందిట్లున్నది

సూత॥—

" స్త్రీశూద్రద్విజబన్ధూనాం త్రయీ న శ్రుతిగోచరా ।
కర్మశ్రేయసి మూఢానాం శ్రేయ ఏవం భవే దిహ ॥
ఇతి భారత మాఖ్యానం కృపయా మునినా కృతమ్ ।
ఏవం ప్రవృత్తస్య సదా భూతానాం శ్రేయసి ద్విజాః ॥
సర్వాత్మ కేనాపి యదా నాతుష్య ద్ధృదయం తతః ।
నాతిప్రసన్నహృదయః సరస్వత్యా స్తటే శుచౌ ॥
వితర్కయన్ వివిక్తస్థ ఇదం చోవాచ ధర్మవిత్ ।

ధృతవ్రతేన హి మయా ఛందాంసి గురవోఽగ్నయః ॥
మానితా నిర్వ్యళీకేన గృహీతం చానుశాసనమ్ ।
భారతవ్యపదేశేన హ్యామ్నాయార్థః ప్రదర్శితః ॥
దృశ్యతే యత్ర ధర్మాదిః స్త్రీశూద్రాదిభి రప్యుత ।
తథాపి బత మే దైహ్యో హ్యాత్మా చైవాత్మనా విభుః ॥
అసంపన్న ఇవాభాతి బ్రహ్మవర్చస్యసత్తమః ।
కింవా భాగవతా ధర్మా న ప్రాయేణ నిరూపితాః ॥
ప్రియాః పరమహంసానాం తఏవ హ్యచ్యుతప్రియాః ।" స్క 1 అ 8

ఇచ్చట సూతు డిట్లు చెప్పెను—శ్రేయస్సాధనమైన కర్మమార్గమందు మూఢత్వము వహించినవారికి గూడ మహాభారతమూలమున శ్రేయస్సు కలుగవలె నని యెంచి మహర్షి లోకానుగ్రహబుద్ధితో మహాభారతమును రచించినప్పటికిని హృదయమునకు సంతుష్టి యేర్పడక సరస్వతీనదీతీరమండలి వివిక్తప్రదేశమందు గూర్చుండి మహర్షి యిట్లనుకొనెను —నియమపూర్వకముగా వేదములు, గురువులు, అగ్నులు నాచే నిష్కపటముగా నారాధింపబడినవి సర్వసామాన్యముగా ధర్మాదు లవగతము లగునట్లు భారతగ్రంథములో వేదార్థము వివరింపబడినది. అయినను నాకు బరమాత్మతాదాత్మ్యము కలుగకున్నది. కార్యశేష మున్న ట్లున్నది పరమహంసప్రియములైన భాగవతధర్మములు బహుళముగా నిరూపింపబడలే దనియేమో! అని.

ఇది యీగ్రంథతాత్పర్యము. ఇందు మ భా. చ. కారు లన్నట్లు మహర్షి భారతములో తాను వ్యత్యాసముగా వ్రాసితి నని చింతింపలేదు సరికదా శ్రేయస్కరమైన గ్రంథము రచించితి ననియే యనుకొనెను. ఇక నారదమహర్షి ప్రసంగము జూడుడు—

"జిజ్ఞాసితం సుసంపన్న మపి తే మహ దద్భుతమ్ ।
కృతవాన్ భారతం య స్త్వం సర్వార్థపరిబృంహితమ్ ॥
జిజ్ఞాసిత మధీతంచ బ్రహ్మ య త్త త్సనాతనమ్ ।
తథాపి శోచ స్యాత్మాన మకృతార్థ ఇవ ప్రభో ॥
భవతాఽనుదితప్రాయం యశో భగవతోఽమలమ్ ।
యథా ధర్మాదయ శ్చార్థా మునివర్యాఽనువర్ణితాః ॥
న తథా వాసుదేవస్య మహిమా హ్యానువర్ణితః ।"

సర్వార్థోపబృంహితమై, మహత్తరమై, యద్భుతమైన భారతమును రచించుటచే నీకపేక్షితార్థసిద్ధియైనది. ఐనను నీవకృతార్థునివలె జింతించుచున్నావు.

నీవు భగవానుని మహిమను ధర్మాదులనువలె వర్ణింపలేదు. అని నారదమహర్షి వ్యాసమహర్షితో బ్రసంగించెను. ఇందుగూడ నీవు భారతమును వ్యత్యాసముజేసి వ్రాసినావని మందలింపలేదు సరికదా నీవుత్తమగ్రంథమును వ్రాసినావనియే నారదమహర్షి శ్లాఘించెను

ఇక భాగవతములో, నేప్రసంగములయందైనను కౌరవుల న్యాయము, పాండవుల అన్యాయము జెప్పినట్లున్నదేమో చూచుట మిగిలియున్నది. కుంతీదేవి- శ్రీకృష్ణస్తవము జేయునపుడిట్లు ప్రసంగించెను—

"యథా హృషీకేశ ఖలేన దేవకీ
కంసేన రుద్ధా సుచిరం శుచార్పితా ।
విమోచితాఽహంచ సహాత్మజా విభో
త్వయైవ నాథేన ముహు ర్విపద్గణాత్ ॥

"విషా న్మహాగ్నేః పురుషా దదర్శనా
దసత్సభాయా వనవాసకృచ్ఛ్రతః।
మృధేమృధేఽనేకమహారథా స్త్రతో ద్రౌణ్య
స్త్రత శ్చాఽస్మ హరేఽభిరక్షితాః॥" (స్క-1-అ8)

కృష్ణా! కంసునిచే బాధింపబడిన నీతల్లి దేవకీదేవి నుద్ధరించుట కంటె నెక్కువగా నున్న, నాబిడ్డలను, ఎన్నిసారులో ననేకవిపత్తుల నుండి యుద్ధరించినావు, నాడు భీమునకు పెట్టబడిన విషాన్నమునుండి రక్షించినావు; లక్కయింటినుండి కాపాడినావు; హిడింబాదిరాక్షసుల నుండి కాచినావు; ద్యూతసభనుండి తేల్చినావు; వనవాసక్లేశములను వదల్చినావు; మహారథుల యస్త్రజ్వాలలనుండి రక్షించినావు ఈకుంతీ దేవి మాటలు భారతోక్తములైన దుర్యోధనాదుల దుశ్చేష్టలనే యుట్టంకించుచున్నవి.

శరతల్పగతుడై భీష్ముడు ధర్మరాజాదులతో నిట్లనును—

"అహో కష్ట మహోఽన్యాయం యద్యూయం ధర్మనందన।
జీవితుం నార్హథ క్లిష్టం విప్రధర్మాచ్యుతాశ్రయాః॥" (స్క-1 అ9)

ధర్మజా! విప్రులను, ధర్మమును, అచ్యుతు (శ్రీకృష్ణు) నాశ్రయించియున్న మీరు జీవించుట కర్హత లేకపోయెను. ఎంత కష్టము. ఎంత యన్యాయము

ఈభీష్ముని మాటలు భారతోక్తమైన పాండవుల న్యాయప్రవృత్తినే వెల్లడించుచున్నవి.

విదురమైత్రేయసంవాదోపక్రమములో శ్రీశుకుడిట్లుచెప్పెను—

"ద్యూతే త్వధర్మేణ జితస్య సాధో
స్సత్యావలంబస్య వనాగతస్య।

న యాచతో౽ దాత్స్యమయేన దాతుం
తమోజుషాణో యదజాతశత్రోః ॥"

ద్యూతమందధర్మముగా జయింపబడినవాడు, సత్యసంధుడు, వనవాసాజ్ఞాతవాసములను పూర్తిజేసి వచ్చినవాడు, సత్పురుషుడు నగు ధర్మజుడు, ద్యూతకాలనిర్ణయప్రకారము మా రాజ్య మిమ్మని యాచింప దామసుడై యివ్వలేదు. అని.

ఈమాటలు పాండవుల యోగ్యతను, కౌరవుల అయోగ్యతను భారతోక్తప్రకారమే తెలుపుచున్నవి. ఇట్లేఅనేకస్థలములయందున్నది.

దీనిని బట్టి భారతమందు యెట్లు చెప్పెనో అట్లే భాగవతమందుగూడ కౌరవుల అన్యాయమును, పాండవుల న్యాయమును ఆయా ప్రసంగములలో మహర్షి చెప్పియే యుండుటచే 'ద్విర్బద్ధం సుబద్ధం భవతి' అన్నట్లు కౌరవుల అన్యాయ్యప్రవృత్తియు, పాండవుల న్యాయ్యప్రవృత్తియు స్థిరపడినది. కనుక నక్రమమైన మ భా. చ. కారుల వ్రాత కింక త్రోసివేతయే. భాగవతము వ్యాసకృతమని యున్న యీవ్రాతచే నది బోపదేవకృతమను తమ వ్రాతకు గూడ త్రోసివేతయే.

అంశాంతరము జూతము—

—♦దుర్యోధనస్వర్గ, పాండవనరకవృత్తాంతము♦—

మ. భా. చ. కారుల వ్రాతలో మిగిలిన యంశ మిది— 'భాగవతము రచించియు, మన సింకను బాధించుటచే గాబోలును! సుయోధనునకు స్వర్గసౌఖ్యప్రాప్తిని, పాండవులకు గొంతకాలము నరకప్రాప్తిం గూడ బిమ్మట జెప్పియున్నాడు.

సుయోధనునకు స్వర్గము స్వర్గారోహణపర్వమందు జెప్పబడి

నది. ఆపర్వము భారతాంతర్గతమే ఇట్లురెండ భారతము రచించి భాగవతము వ్రాసెను. పిదప స్వర్గారోహణపర్వము వ్రాసెను' అన్నట్లున్న వీరి వ్రాత విరుద్ధము.

ప్రతివాదులు- దుర్యోధనునికి స్వర్గము, పాండవులకు నరకము చెప్పబడెనని, స్వర్గము న్యాయస్థునకుగాని రాదని, నరకము అన్యాయస్థునకు గాని రాదని యూహించి దుర్యోధనునిది న్యాయమేయనియు, పాండవుల దన్యాయ మనియు వ్రాసినారు. ప్రతివాదుల కిప్పుడు ఆ స్వర్గనరకముల పరిస్థితిని వెల్లడింతము— దుర్యోధనునకు యుద్ధమరణమును బట్టి వచ్చిన స్వర్గము గాని, ధర్మాత్ము డని వచ్చిన స్వర్గము కాదు. గ్రంథసందర్భ మిట్లున్నది—

మనుష్యశరీరముతోడనే స్వర్గమునకు వెళ్ళిన ధర్మజుడు ఆసనాసీనుడై యచ్చట గూర్చుండి యున్న దుర్యోధనుని జూచి యిట్లనెను.

"ఎవ్వని మూలమున వనవాసులమై, కష్టపడిన మాచే సుహృద్బాంధవవర్గము యుద్ధమున హతమైనదో, ఎవ్వనివలన ధర్మచారిణి యగు ద్రౌపది మహాసభ కీడ్వబడినదో అట్టి యీ దుర్యోధనుని మొగము నే జూడను" ఇట్లనగా నారదు డిట్లనెను—

'యుధిష్ఠిర! మహాబాహో! మైవం వోచః కథంచన ।
దుర్యోధనం ప్రతి నృపం శృణు చేదం వచో మమ ॥
ఏష దుర్యోధనో రాజా పూజ్యతే త్రిదశైస్సహ ।
సద్భిశ్చ రాజప్రవరైర్య ఇమే స్వర్గవాసినః ॥
వీరలోకగతిం ప్రాప్తో యుద్ధే హత్వాఽఽత్మన స్తనుం ।
"స ఏష క్షత్రధర్మేణ స్థాన మేత దవాప్తవాన్ ।
భయే మహతి యోఽభీతో బభూవ పృథివీపతిః ॥
న తన్మనసి కర్తవ్యం పుత్ర యద్ద్యూతకారితమ్ ।

ద్రౌపద్యాశ్చ పరిక్లేశం న చిన్తయితు మర్హసి ॥
యేచాన్యేపి పరిక్లేశా యుష్మాకం జ్ఞాతికారితాః ।
సంగ్రామే ష్వథవాఽన్యత్ర న తాన్ సంస్మర్తు మర్హసి ॥"

యుధిష్ఠిరా! నీవట్లనవద్దు. దుర్యోధనునిగూర్చి యీమాట వినుము. ఈతడు దేవతలచే బూజింపబడుచున్నాడు. ఈస్వర్గవాసు లందరు యుద్ధమందు శరీరములు విడిచి వీరస్వర్గము నొందినవారు. ఈ దుర్యోధనుడు భయంకరసమయములో నిర్భయుడై క్షత్రధర్మమైన యుద్ధమరణముచే నీస్థానము నొందెను. ద్యూతమందుగాని, ద్రౌపదీ విషయమైగాని, మరెప్పుడుగాని మీకు జ్ఞాతులచే నేయేకష్టములు కలిగింపబడినవో వానిని స్మరింపవద్దు. అని.

అంతట ధర్మజుడు- అనుజులను, ద్రౌపదిని జూడదలచి దేవ దూతను పురస్కరించుకొని వెళ్ళుచుండగా సమీపములో నరక యాతనలనుభవించు వారి యాక్రందనధ్వనులు వినబడెను. తన యను జులును, ద్రౌపదియు బాధలు పడుచున్నట్లు గోచరించెను. అప్పుడు దుఃఖితుడై ఆశతువునకు స్వర్గము, అనుజులకు నరకమునా? అని క్రుద్ధుడై ధర్మమును గర్హించి, దేవతలను గర్హించి చీకాకుపడుచుండ నచ్చటి కిందుకును ధర్మదేవతయు సపరివారముగా వచ్చిరి. ఆక్షణ మందే ఆనరకయాతనలు, ఆయార్తనాదములు అదృశ్యమైనవి. అప్పు డింద్రుడిట్లనును—

"నచ మన్యు స్త్వయా కార్య శ్శృణు చేదం వచో మమ ।
అవశ్యం నరక స్తాత ద్రష్టవ్య స్సర్వరాజభిః ॥
శుభానా మశుభానాంచ ద్వౌ రాశీ పురుషర్షభ ।
యః పూర్వం సుకృతం భుఙ్క్తే పశ్చా న్నిరయమేవ సః ॥
పూర్వం నరకభా గ్యస్తు పశ్చా త్స్వర్గ ముపైతి సః ।

భూయిష్ఠం పాపకర్మా యః స పూర్వం స్వర్గ మశ్నుతే ॥
తేన త్వమేవం గమితో మయా శ్రేయోఽర్థినా నృప ॥
వ్యాజేనహి త్వయా ద్రోణ ఉపచీర్ణ స్సుతం ప్రతి ।

టీ-హతః కుంజర ఇత్యశ్వత్థామవధే ద్రోణ ఉపచీర్ణః వంచితః. గజవాచీశబ్దో మనుష్యపరత్వేన జ్ఞాపిత ఇత్యుపచారచ్ఛలేనేత్యర్థః.

వ్యాజేనైవ తతో రాజన్ దర్శితో నరక స్తవ ।
యథైవ త్వం తథా భీమ స్తథా పార్థో యమౌ తథా ॥
ద్రౌపదీచ తథా కృష్ణా వ్యాజేన నరకం గతాః ।"

యుధిష్ఠిరా! ఆగ్రహింపకుము. రాజుల కందరకును నరక దర్శనము తప్పదు శత్రువునకు స్వర్గము, అనుజులకు నరకమునా? అని విషాదపడకుము. పుణ్యరాశి యొకటి, పాపరాశి యొకటి. ముందు పుణ్యఫలమైనస్వర్గ మనుభవించినవాడు తరువాత పాపఫలమైన నరక మనుభవించును. ముందు నరక మనుభవించినవాడు తరువాత స్వర్గ మనుభవించును. ఆపుణ్యపాపములలో నేది యల్పమైయుండునో దాని ఫలము ముందును, ఏది యధికమై యుండునో దాని ఫలము తరువాతను అనుభవింపబడును. పాపకర్మఫల మత్యధికకాల మనుభవింప వలసినవానికి అల్పకాలానుభవనీయమైన స్వర్గము ముందు ప్రాప్తించును. నీవశ్వత్థామవిషయమై ద్రోణునకు జెప్పునప్పుడు 'హతః కుంజరః' అని గజవాచకశబ్దమును పురుషపరముగా వ్యాజముతో దెలుపుటవలన నీకును వ్యాజముచేతనే నరకము ప్రదర్శింపబడినది. నీకువలెనే అనుజులకును, ద్రౌపదికిని ప్రదర్శింపబడినది. అని.

ఈగ్రంథసందర్భమును బట్టి దుర్యోధనునకప్పుడు ప్రాప్తించిన స్వర్గముయుద్ధమరణమూలకమే అనియు, నదిస్వల్పకాలానుభవనీయమే

యనియు, పిమ్మట విశేషకాలము పాపఫలానుభవ మున్నదనియు స్పష్టమైనది. పాండవులకు ద్రోణునితో నశ్వత్థామవిషయము జెప్పుటలో వచ్చిన దోషము తప్ప యితరదోషము లేదనియు, నదియానరకదర్శనమాత్రముచే క్షణమాత్రమే అనుభూతమైన దనియు, నిక చిరకాలము పుణ్యఫలానుభవమే యనియు స్పష్టము. ఇంద్రుడు చెప్పిన తరువాత ధర్మదేవత యిట్లు చెప్పెను.

"విశుద్ధోఽసి మహాభాగ సుఖీ విగతకల్మషః ।
నచ తే భ్రాతరః పార్థ నరకార్హా విశాంపతే ॥
న కృష్ణా రాజపుత్రీ చ నరకార్హా కథంచన ।
మాయైషా దేవరాజేన మహేన్ద్రేణ ప్రయోజితా !
అవశ్యం నరకా స్తాత ద్రష్టవ్యా స్సర్వరాజభిః ।
తత స్త్వయా ప్రాప్త మిదం ముహూర్తం దుఃఖ ముత్తమమ్ ॥"

మహానీయా! నీవు నిష్కల్మషుడవై పరిశుద్ధుడ వైతివి. నీసోదరులు కాని, ద్రౌపదికాని నరక మనుభవింపదగినవారు కారు. మాయామాత్రమైన యీదృశ్య మింద్రునిచే గల్పింపబడినది. నరకదర్శనము తప్పని దగుటచే నీవీముహూర్తకాలము దుఃఖము నొందితివి. ఇట్లు చెప్పి ఆకాశగంగాస్నానపూర్వకముగా దివ్యదేహము ప్రాప్తింపజేసెను

ఇట్లుండుటచే బాండవులు, ద్రౌపదియు నరకార్హులు కారనియే స్పష్టమైనది. ప్రతివాదు లాదుర్యోధనుని యీస్వర్గప్రాప్తిని జూచి యెట్లు ప్రవర్తించినను దుర్యోధనదృష్టాంతముచే స్వర్గము వచ్చు నని భ్రాంతిపడరానిదనియు, నాతని దుష్ప్రవృత్తి ఫలము ముందున్నదనుటచే దానికి భయపడవలసినదే యనియు, తెలిసికొనవలసి యున్నది. ఆదుర్యోధనస్వర్గమును బట్టి దుర్యోధనునిది న్యాయమే యను దుర్భ్రమ

ము, అధర్మరాజాదిసరకదర్శనమును బట్టి వారల దన్యాయమే యను దుర్భ్రమమును పొందవల దని ప్రతివాదులకు దెలుపుచు, విషయాంతర మందుకొనుచున్నాము.

—♦సంస్కృతాంధ్రభారతములు సుయోధనాపకర్షగా రచింపబడిన వను ప్రసంగము—తన్నిరాకరణము♦—

మ. భా చ. కారుల వ్రాత యిట్లున్నది— "జయము రచించిన వ్యాసుడు పాండవహితు డగుటచేతను, భారతమును రచించిన వైశంపాయనుడు, అర్జునప్రపౌత్రు డగు జనమేజయున కిష్టముగా భారతగాధను జెప్పవలసివచ్చుటచేతను, సౌతి కృష్ణద్వైపాయనుని శిష్యపుత్రు డగుటచేతను, సంస్కృతమహాభారతము సుయోధనాపకర్షముగా రచింపబడె నని తిరిగి చెప్పవలసి యున్నది.

ఆంధ్రీకృతభారతములో- నన్నయ కేవలము పాండవవంశసంభూతుడ నని చెప్పుకొను రాజనరేంద్రునకు గృతి నిచ్చుటచేతను, తిక్కన, యెఱ్ఱనలు సూర్యచంద్రవంశస్థు లగు రాజుల నాశ్రయించువారే యగుటచేతను, ఆంధ్రభారతములో గూడ దుర్యోధనునకపకర్షణమె వర్ణింపబడెను" (పు 268)

ప్రతివాదులు సంస్కృతమహాభారతమునకు ముగ్గురు కర్తలని కల్పించి, యందు వ్యాసుడు పాండవహితు డని, వైశంపాయనుడు కథ వినెడి జనమేజయున కిష్టముగా జెప్పినవా డని, సౌతి వ్యాసశిష్యుని పుత్రుడేయని, యీ కారణముచే నాగ్రంథము సుయోధనాపకర్షముగా రచింపబడె నని తిరిగి చెప్పవలసియున్నదని యనుచున్నారు.

వీరి కిప్పుడు సౌతివైశంపాయనులు మహాభారతమును వినిపించినవారే కాని రచించినవారు కారనియు, భవిష్యద్గాథతో మహాభా

రతమును రచించినవాఁడు త్రికాలజ్ఞాననిధి యగు వేదవ్యాసభగవాను డే యనియు, నాతఁడు చెప్పినదే సత్యమనియు, నాతఁడు దీనదయాపరుడే కాని రాగద్వేషములు కలవాఁడు కాడనియు, సుయోధను డపకర్షముగా సంచరించుటచేతనే యాతని విషయము అపకర్షముగా జెప్పబడిన దనియు మరల జెప్పుచున్నాము.

ఆంధ్రభారతకర్త లగు నన్నయాదులు వేదవ్యాసభారతము నాంధ్రీకరించినవా రగుటచే యథార్థమైన మూలము ననుసరించి వారు వ్రాసియుండ నన్నయాదులపై దోషారోపణము జేయుట దుర్నయము.

ఒకని నాశ్రయించి యున్నవాడు ప్రమాణవిరుద్ధమైనను ఆతని యిష్టప్రకారమే గ్రంథమును సాగింపవలె ననునది మ. భా. చ. కారుల కనుభవసిద్ధమేమో కాని ప్రమాణబద్ధులైన నన్నయాదుల లక్షణమది కాదు. వారిచే నాంధ్రీకరింపజేసిన రాజనరేంద్రాదిప్రభువులు గూడ వేదవ్యాసమహాభారతప్రతిపాదితార్థమునే చెప్పవలసిన దని కోరినవారు కాని తమ కిష్టమైనట్లు వ్రాయవలసిన దన్నవారు కారు. రాజనరేంద్రుడు నన్నయార్యునితో నేమని చెప్పినట్లున్నదో చూడుడు!

క. జననుత కృష్ణద్వైపా
యనమునివృషభాభిహితమహాభారతబ
ద్ధనిరూపితార్థ మేర్పడ
దెనుగున రచియింపు మధికధీయుక్తి మెయిన్.

దీనిని బట్టి సంస్కృతభారతము నాధారముగా జేసికొని యాంధ్రీకరించి యున్న నన్నయాదులపై 'ప్రభుప్రీతికై దుర్యోధనయశోపకర్షణము వర్ణించినారు' అను దోషము నాపాదించుట దుర్నయము కాక మరేమగును? కనుక ప్రతివాదుల వ్రాత హేయము.

ఈపద్దెములో దెనిగింపవలసినది మహాభారత మనియు, నది కృష్ణద్వైపాయనమునీంద్రప్రణీత మనియు స్పష్టముగా నున్నందున సంస్కృతమహాభారతమునకు ముగ్గురు కర్తలనెడి మ. భా. చ. కారుల మాట త్రోసివేయబడినది. అంశాంతరము—

—♦ వ్యాసాదులు దుర్యోధనునిపై గల యీర్ష్యను గాంధారిపై గూడ దొరలించిరను ప్రసంగము-తన్నిరాకరణము ♦—

మ. భా. చ కారులవ్రాత యిట్లున్నది— "దుర్యోధనునిపై గల యీర్ష్యను మహాపతివ్రత యగు గాంధారిపై గూడ వ్యాసాదులు కొంత దొరలించి యామె తనతోడికోడలగు కుంతి బిడ్డల గనుచున్న దని తాను కడుపు బాదుకొని మాంసఖండము గనిన దనిప్రకృతివిరుద్ధపుగాధ నొకదాని గల్పించిరి. అట్టిది తోడికోడల సంతతి జూచి కడుపు బాదుకొనునా?" (పు. 268)

వ్యాసాదులకు దుర్యోధనునిపై యీర్ష్యయట. ఆయీర్ష్యను వారు గాంధారిపై గూడ దొరలించిరట. వ్యాసాదు లనగా సంస్కృతాంధ్రమహాభారతకర్తలన్నమాట. ఈప్రతివాదులు వెనుక 'సంస్కృతాంధ్రభారతములు సుయోధనాపకర్షముగా రచింపబడినవి.' అనుటకు హేతువులు 'వ్యాసుడు పాండవహితు డగుట, మిగిలినవారు ప్రభుప్రీతి నపేక్షించినవా రగుటయు,' నని చెప్పిరేకాని వ్యాసాదులకు దుర్యోధనునియందుగల యీర్ష్య యని చెప్పలేదు. ఇక్కడ జెప్పిన యీర్ష్యనే యక్కడ జెప్పినయెడల నన్ని కుకల్పనలు ప్రతివాదుల కవసరము లేకపోవును

వ్యాసమహర్షికి దుర్యోధనునియం దీర్ష్య యని ప్రతివాదు లనుట నింద్యము. మహర్షి పాండవులకు దోడ్పడిన విషయము నిరూపించినపు డుదాహరింపబడిన శక్రసురభిసంవాదవచనము, వేదవ్యాస వచనమును మఱియొకసారి చూడుడు—

సురభి:—

"యది పుత్రసహస్రాణి సర్వత్ర సమమేవ మే।
దీనస్యతు సత శ్శక్ర పుత్ర స్యాభ్యధికా కృపా॥"

నాకు బుత్రసహస్రమందును సమత్వమే కాని యాపన్నుడైన పుత్రునియం దధికదయ. అని సురభి చెప్పినమాట. ఇచ్చట నాపన్నునియం దున్న దయాధిక్యమును బట్టి యన్యులయం దీర్ష్య యన వచ్చునా?

వ్యాస:—

"పాండో స్సుతా యాదృశా మే తాదృశా స్తవ భారత!
దీనా ఇతీవ మే బుద్ధి రభిపన్నాఽద్య తాన్ ప్రతి॥"

'ధృతరాష్ట్రా! నాకు పాండుపుత్రు లెట్టివారో, నీ పుత్రులు నట్టివారే. వా రాపన్నులై యుండిరని యిప్పుడు నాబుద్ధి వారియందు సంసక్తమైనది' అని మహర్షి చెప్పినమాట. ఇట్లుండ దుర్యోధనుని యం దీర్ష్య యనుట లోకజ్ఞానశూన్యతను వెల్లడించుచున్నది.

వ్యాసుడు మహాపతివ్రత యగు గాంధారిపై గూడ నీర్ష్యవహించెనట. కుంతి బిడ్డల గనుచున్నదని యామె తన కడుపు బాదుకొనెనని వ్రాసెనట. గాంధారి మహాపతివ్రత యని చెప్పినవాడును, ఆమె గర్భతాడనము జేసికొనె నని చెప్పినవాడును గూడ మహర్షియే. మహాపతివ్రత యనుటలో లేని యీర్ష్య గర్భతాడనకథనములో వచ్చిపడెనా? ఆగర్భతాడనప్రస్తావ మెట్లున్నదో చూడుడు—

"క్షుచ్ఛ్రమాభిపరిగ్లానం ద్వైపాయన ముపస్థితమ్।
తోషయామాస గాంధారీ వ్యాస స్తస్యై వరం దదౌ।
సా వవ్రే సదృశం భర్తుః పుత్రాణాం శత మాత్మనః।

తతః కాలేన సా గర్భం ధృతరాష్ట్రా ద్దథాగ్రహీత్ ॥
సంవత్సరద్వయం తంతు గాంధారీ గర్భ మాహితమ్ ।
అప్రజా ధారయామాస తత స్తాం దుఃఖ మావిశత్ ।
శ్రుత్వా కుంతీసుతం జాతం బాలార్కసమతేజసమ్ ।
ఉదర స్యాత్మనః స్థైర్య ముపలభ్యాఽన్వచింతయత్ ।
అజ్ఞాతం ధృతరాష్ట్రస్య యత్నేన మహతా తతః ।
సోదరం ఘాతయామాస గాంధారీ దుఃఖమూర్ఛితా॥" ఆది.అ.15

ఒకప్పుడు వ్యాసమహర్షికి గాంధారి శుశ్రూష జేసి యామహర్షిని తనకు నూర్గురు పుత్రులు కలుగునట్లు వర మిమ్మని కోరెను. మహర్షి యట్లే వర మిచ్చెను. తరువాత నామె ధృతరాష్ట్రునివలన గర్భవతి యయ్యెను. ఆగర్భమును ఆమె రెండు సంవత్సరములు ధరించియుండియు పుత్రోత్పత్తి కాక దుఃఖపడినది. కుంతీదేవికి పుత్రుడు పుట్టుట విని తన గర్భము కదలిక లేక స్థిరమై యుండుటను జూచి చింతించి దుఃఖాతిరేకమున గర్భతాడనము జేసికొనెను. అనితాత్పర్యము.

దీనిని బట్టి చిరకాలగర్భధారణక్లేశ మనుభవించుచున్న గాంధారికంటె ముందుగా కుంతీదేవికి పురుడు వచ్చుటను బట్టియు, తనకు పురుడు వచ్చు సూచన గోచరింపకుండుటనుబట్టియు పరితాపము హెచ్చి యట్లు చేసినదని తెలియుచున్నది. గర్భవతులకు గాలాతిక్రమణమైనకొలది భారముచే క్లేశము కలుగుచుండుటయు, నందులో నొకరు ప్రసవించినపుడు తమ కట్టి ప్రసవసమయము రాకపోయెనని దిగులు పడుచుండుటయు సహజము. అట్టి దిగులే గాంధారికి సంభవించినది. ఆపై గర్భమునకు చలనము కూడ లేకున్నపుడు ఆమె కెంతయైన పరితాప ముండును. కనుక ప్రతివాదులు 'కుంతి బిడ్డల గనుచున్న దని గాంధారి కడుపు బాదుకొనె' నని వ్రాయబడినట్లు తెలుపుట అక్రమము.

ఇక గర్భతాడనము కాగా జరిగిన విషయ మేమోచూడుడు—

"తతో జజ్ఞే మాంసపేశీ లోహాష్ఠీలేవ సంహతా ।
ద్వివర్షసంభృతా కుక్షౌ తా ముత్స్రష్టుం ప్రచక్రమే ॥
అథ ద్వైపాయనో జ్ఞాత్వా త్వరిత స్సముపాగమత్ ।
తాం స మాంసమయీం పేశీం దదర్శ జపతాం వరః ॥
తతోఽబ్రవీ త్సౌబలేయీం కి మిదం తే చికీర్షితమ్ ।
సా చాత్మనో మతం సత్యం శశంస పరమర్షయే ॥
జ్యేష్ఠం కున్తీసుతం జాతం శ్రుత్వా రవిసమప్రభమ్ ।
దుఃఖేన పరమే ణేద ముదరం ఘాతితం మయా ॥
శతంచ కిల పుత్రాణాం వితీర్ణం మే త్వయా పురా ।
ఇయం చ మే మాంసపేశీ జాతా పుత్రశతాయ వై ॥"

టీ—లోహాష్ఠీలా=లోహమయా గండికా; తద్వత్సంహతా=కఠినా;

గర్భతాడనమువలన లోహఖండమువలె కఠినమైన మాంసపేశి బహిర్భూతము కాగా రెండుసంవత్సరములు కుక్షియం దుండి తుద కారూపముతో వెలువడిన మాంసపేశిని పారవేయుటకు గాంధారి యత్నించుచునంతలో వ్యాసభగవానుడు తెలిసికొని ప్రత్యక్షమై మాంసపేశిని జూచి గాంధారీ! నీవిట్లు చేసితి వేమని యడుగ ముందుగా కుంతీదేవి ప్రసవించి చక్కని పుత్రుని కన్న దని విని నే నిట్లే యుండి పోతి నని పరమదుఃఖముచే గర్భతాడనము జేసికొంటి నని సత్యము చెప్పి మహర్షీ! నాకు నూర్గురు పుత్రులు కలుగుదు రని వరమిచ్చితివి. దానికి బదులు నాకీమాంసపేశి కలిగినది. అని పలుకగా మహర్షి—

"ఏవ మేత త్సౌబలేయి నైత జ్జా త్వన్యథా భవేత్ ।
వితథం నోక్తపూర్వం మే స్వైరేష్వపి కుతోఽన్యథా ॥"

గాంధారీ! ఆపుత్రశతము దీనినుండియే యుద్భవించును. నే నెన్నడును అసత్య మాడినవాడను గాను. అని చెప్పి మహర్షి స్వయముగనే యామాంసపేశిని శీతోదకముతో తడిపి, అంగుష్ఠపర్వప్రమాణముగల భాగములుగా విడదీసి యొక్కొక్క భాగమును ఒక్కొక్క ఘృతకుంభమునందు పెట్టించి పదిలముగా కాపాడవలసిన దని చెప్పి అంతర్ధాన మయ్యెను. ఈవిషయ మీశ్లోకములలో నున్నది.—

"తాం మాంసపేశీం భగవాన్ స్వయమేవ మహాతపాః ।
శీతాభి రద్భి రాసిచ్య భాగం భాగ మకల్పయత్ ॥
"యో యథా కల్పితో భాగ స్తం తం ధాత్ర్యా తథా నృప ।
ఘృతపూర్ణేషు కుండేషు ఏకైకం ప్రాక్షిప త్తదా ॥" (ఆది అ116)

ఈకథాసందర్భము జూడగ, గాంధారిచే నారాధింపబడినవాడును, గాంధారికి పుత్రశతవర మిచ్చినవాడును, ఆ మాంసపేశిని స్వహస్తములతో విభజించి యిచ్చి పుత్రుల నావిర్భవింపజేసినవాడును వ్యాసభగవానుడే యని స్పష్ట మగుచుండ నామహర్షికి గాంధారియం దీర్ష్య యనియు, నది దుర్యోధనుని యందలి యీర్ష్యనుబట్టి కలిగిన దనియు నున్న ప్రతివాదులవ్రాత నింద్యము. దుర్యోధనుడు పుట్టక పూర్వము పుట్టినది మాంసపేశి. అది గర్భతాడనమునుబట్టి పుట్టినది. ఆగర్భతాడనకథనములో 'దుర్యోధనునియందు గల యీర్ష్యను గాంధారియందు చూరలించెను' అన్న ప్రతివాదులకు వెఱ్ఱియా? బుద్ధియా?

కడుపు బాదుకొని మాంసఖండము గనినదని ప్రకృతివిరుద్ధపు గాథ నొకదానిని కల్పించిరట "ప్రకృతిసిద్ధ మిదం హి దురాత్మనామ్" అన్నారుకనుక నందఱిప్రకృతులు నొకవిధమైనవి కావు. అందుచే ప్రతివాదుల ప్రకృతికి విరుద్ధమైనను యున్యుల ప్రకృతికది యవిరుద్ధమే. ఈస్కాందపురాణవచనములను కూడ జూడుడు—

"మాయామయ మిదం విశ్వం దృశ్యతే శ్రూయతేచ యత్ ।
కిం భావ్యం కిమభావ్యంచ సంసారేఽస్మిన్ క్షణాత్మకే ॥
అనిరూప్య మభూతార్థం మాయయా జాయతేస్ఫుటమ్ ।
ఈశ్వరస్య వశే మాయా తస్య కో వేద చేష్టితమ్ ॥
దేవతానాం మహర్షీణాం శాపేనచ వరేణచ ।
అయుక్త మపి యత్కర్మ యుజ్యతే నాత్ర సంశయః ॥"

అనగా. నీప్రపంచ మంతయు మాయామయము. క్షణభంగురమైన యీసంసారమం దేమూలనో పుట్టిపోవువారికి సంభావ్యమేమి? అసంభావ్య మేమి? అనిరూప్యము, అభూతపూర్వము నైనది మాయచే స్ఫుటముగా గలుగుచున్నది. అట్టిమాయ యీశ్వరున కధీనము. ఆ యీశ్వరుని చర్య యెవ్వని కెరుక? దేవతలయొక్కయు, మహర్షుల యొక్కయు శాపముచేగాని, వరముచేగాని అఘటితఘటన జరుగును. సంశయము లేదు. అని భావము.

కనుక, మాంసపేశి కలిగిన దనుట ప్రకృతివిరుద్ధ మను ప్రతివాదులకు శాస్త్రజ్ఞానము, తన్మూలకమగు లోకజ్ఞానము లేనందున వారి వ్రాత హేయము

ఇట్లు పూర్వోక్తప్రకారము వ్యాసమహర్షి యనుగ్రహమున గాంధారికి దుర్యోధనాదిపుత్రశతము ఏకగర్భమునసే యామాంసపేశి నుండి జన్మించె నని తెలిసినది. ఈశ్లోక మందీవిషయము చెప్పబడినది.

''కథితో ధార్తరాష్ట్రాణా మార్షః స్సంభవ ఉత్తమః ।
అమనుష్యో మనుష్యాణాం భవతాబ్రహ్మవాదినా ॥"

టీ॥ ఆర్షః=ఋషిప్రసాదహేతుకః; అమనుష్యః=మనుష్యేష్వదృష్టః; యుగప ద్భవానాం జనాత్ ॥ ఈశ్లోకవిషయముచే-

"ఈమె (గాంధారి) కుమారులలో నల్వురే యౌరసులుగా గాన్పింతురు ఔరసులుండినను స్వయందత్తాదులను పుత్రులుగా నంగీకరింప పూర్వపుస్మృతు లంగీకరించుచున్నవి. ఈస్వయందత్తాదులన్య జాతిజులుగా గూడ నుండవచ్చును. ఇట్టివారే గాంధారి యొక్క తొంబదియారుగురు పుత్రులును" (పు 268) అను మ. భా. చ. కారుల అసంగతప్రసంగ మపాస్తము.

—♦గాంధారీపుత్రుల కపార్థముల నిచ్చు నామములను వ్యాసాదులే పెట్టి రను ప్రసంగము—తన్నిరాకరణము♦—

మ భా. చ. కారుల వ్రాత యిట్లున్నది— గాంధారీపుత్రుల కపార్థముల నిచ్చు దుర్ముఖాదినామములను వ్యాసాదులు కల్పించి యుందు రని తలతును. నామకరణముల జేయునపుడు గృహ్యా సూత్రకారులు శుభచిహ్నముగా నుంపు మనిరే కాని యశుభ చిహ్నముగా నుంపు మనలేదు. పెంటయ్య మొదలగు నవీననామములును, శునశ్శేపాదిప్రాచీననామములును, కారణాంతరముచే బెట్టబడియుండును. వ్యాసాదులు దుర్యోధనుపక్షము గ్రిందుపరచు రీతిని వ్రాసిన ప్రక్రమముం గమనింప కుండాశ్యాదినామములు వ్యాసకృత మగునని చెప్పవలసియున్నది." (పు. 269)

ఈ మ. భా. చ కారులే గాంధారీధృతరాష్ట్రుల కౌసరపుత్రులు నలువురే యనియు, వారు దుర్యోధన, దుశ్శాసన, వికర్ణ, చిత్రసేను లనియు, మిగిలిన 96 గురు స్వయందత్తాదు లనియు వెనుక వ్రాసి యున్నారు. (పు. 105)

ఇప్పు డిచ్చట గాంధారీపుత్రుల కపార్థ మిచ్చు దుర్ముఖ కుండాశ్యాదినామములను వ్యాసుడు కల్పించె నని వ్రాసినారు. ఆదుర్ముఖకుండాశ్యాదినామధారులు ప్రతివాదుల వ్రాతను బట్టి గాంధారీ

గర్భసంభూతులు కారు. గాంధారీగర్భసంభూతు లగు దుర్యోధన, దుశ్శాసన, వికర్ణ, చిత్రసేనుల నామములు అపార్థ మిచ్చునవి వ్యాసు నిచే గల్పింపబడినవి. యని ప్రతివాదులే అనలేదు.

ఇట్టిస్థితిలో కథానాయకు లగు దుర్యోధన, దుశ్శాసనాదులకే అపార్థ మిచ్చెడి నామములను కల్పించి యెరుగని మహర్షి—యప్రసిద్ధులైయున్న దుర్ముఖాదులకు ఆనామములు కల్పించునా?

ఇంకొకటి— దుర్యోధన దుశ్శాసననామములను వారి తల్లి తండ్రులే పెట్టుకొనియున్నట్లు దుర్ముఖాదినామములు వారల తల్లి దండ్రులే పెట్టుకొనినవి యేల గావు? ఇంకొకటి దుర్ముఖాదినామములు వ్యాసకల్పితము లనువారు వారి కసలు తల్లితండ్రులుచేసిన నామకరణ మేదో చెప్పగలరా? శునశ్శేఫాదినామములకు ప్రతివాదు లేకారణాంతర మున్న దనిరో అదియే యీదుర్ముఖాదినామములకు గూడ గారణ మేల గాదు.? కనుక నీప్రతివాదుల యసందర్భపు వ్రాత నింద్యము.

—♦పరాశరుడే సమస్తపురాణప్రవర్తకుడు కాని కృష్ణద్వై పాయనుడు కాడను ప్రసంగము—తన్నిరాకరణము♦—

మ. భా. చ. కారుల వ్రాత యిట్లున్నది— పరాశరుడే సమస్తపురాణప్రవర్తకు డని విష్ణుపురాణములో గలదు. వ్యాసబిరుదముచే సమస్తపురాణకర్తృత్వము కృష్ణద్వైపాయనునకే స్థూలదృష్టిచే లోకము కట్టిపెట్టుచున్నది. విష్ణుపురాణములోని ఈ యంశమును జెప్పు పరాశరవాక్యములగు రెండుపద్యముల నిట వ్రాయుచున్నాను—

మ. విను మైత్రేయ! మదీయశైశవకథావృత్తాంత మంభోరుహా
సనపుత్రుండు జగన్నుతుం డగు పులస్త్యబ్రహ్మ యేతెంచి మ

స్నన లేపారగ నన్ను గన్గొని పురాణశ్రేణికిం గర్త వీ
వని నాకున్ వరమిచ్చి పోయె బ్రహ్మదవ్యాపార మేపారగన్.

క. అది కారణంబుగా నా
కొదవె పురాణప్రవీణయోగ్యత నీవె
ట్టిది గోరి నన్ను నడిగితి
వది నీకుం జెప్పువాడ నాద్యంతంబున్.

పై కారణములచే బురాణకర్త యగు వ్యాసుడు పరాశరుడే కాని కృష్ణద్వైపాయనుడు కాడు" (పు. 141)

ఆహా! కృష్ణద్వైపాయనుడు సమస్తపురాణకర్త యని లోక మనుచున్న దని జెప్పుచు నాతడు పురాణకర్త కాడను ప్రతివాదులు లోకాతీతు లన్నమాట. స్థూలదృష్టిచే లోక మనుచున్న దనుటవలన వీరి కాస్థూలదృష్టి లేదన్నమాట పరాశరుడు పురాణకర్త యని చెప్పు పద్యములకు కృష్ణద్వైపాయనుడు పురాణకర్త కాడని యర్థ మన్నమాట. వీరికి లోకానుసరణముతో బనిలేదన్నమాట ఆ విష్ణుపురాణములోనే ముం దేమున్నదో చూచుకొనవలసిన పని కూడ లేదన్నమాట. ఇదియే విమర్శకలక్షణ మన్నమాట. కానిండు. మన మిప్పుడు లోక మనుచున్నది నిజమో, ఈ లోకాతీతు లన్నది నిజమో వారు చూపిన విష్ణుపురాణమును బట్టియే 'నిర్ణయింతము

చతుర్థాశ్వాసమం దిట్లున్నది—

ఈవైవస్వతమన్వంతరమం దతీతము లయిన అష్టావింశతి (28) మహాయుగంబులలోని ద్వాపరయుగములందు గల వ్యాసులను మైత్రేయునకు పరాశరు డుపదేశించు ప్రస్తావములో—

"మజ్జనకుం డైన శక్తియును, నేనును, జాతుకర్ణుండును, మత్పుత్రుం డయిన కృష్ణద్వైపాయనుండును వేదవ్యాసరూపంబులు ధరించి

వేదవేదాంగధర్మశాస్త్రపురాణాగమంబులు మొదలుగా బదునెనిమిది విద్యలు జగంబులం బ్రసిద్ధంబు జేసితిమి. ద్రోణపుత్రుం డయిన యశ్వత్థామ ముందటి ద్వాపరయుగంబున వేదవ్యాసుండు కాగలవాడు' అని చెప్పబడినది.

దీనినిబట్టి యీమన్వంతరములోనిప్పటి కిరువదియెనిమిదిద్వాపర యుగములుగడచినవనియు, నొక్కొక్క ద్వాపరయుగమందొక్కొక్కతపోధనుడు వేదవ్యాసుడగుచుపురాణములురచించి యష్టాదశవిద్యలనులోకమునవ్యాపింపజేయుచుండు ననియు, నట్లుపరాశరుడువెనుక నొకద్వాపరమున వేదవ్యాసుడును, కృష్ణద్వైపాయను డీకలియుగమునకు వెనుకటి ద్వాపరమందు వేదవ్యాసుడును అయియుండె ననియు స్పష్టమైనది. ఇప్పుడు పరాశరు డెట్లు సమస్తపురాణకర్తయో అట్లు కృష్ణద్వైపాయనుడునుసమస్తపురాణకర్తయే.ప్రతివాదులుచూపినపద్యములుపరాశరుడు పురాణకర్త యనునవేకాని కృష్ణద్వైపాయనుడు పురాణకర్త కాడనునవి కావు. ఇప్పుడు లోకమనుకొనుచున్నదే నిజమైనది. లోకము ననుసరింపనివారి పాట్లు తుద కిట్టివే. దీని నింతమాత్రముతో విడిచి విషయాంతర మందుకొందము.

- బ్రహ్మసూత్రకర్త కృష్ణద్వైపాయనుడు కాడను ప్రసంగము- - తన్నిరాకరణము.

మ. భా. చ. కారుల వ్రాత యిట్లున్నది-"బ్రహ్మసూత్రకర్త యగు బాదరాయణుడు కృష్ణద్వైపాయనుడు కాడని లోకమాన్య తిలకుగారు గీతారహస్యములోను, శ్రీపురాణపంతమల్లయ్యశాస్త్రిగా రాంధ్రబ్రహ్మసూత్రభాష్యపీఠికలోను స్పష్టపరచినసంగతి జదువగా బ్రహ్మసూత్రకర్తృబాదరాయణసంబంధము సాత్యవతేయునకు లేదని తలతును" (పు144)

ఈప్రతివాదుల మాట యెంత సత్యమో వీరుదాహరించిన

గ్రంథములు చూచిన తేలును. అందుకై క్రమముగా నాగ్రంథముల లోని నిర్ణయము ప్రదర్శింపబడుచున్నది—

గీతారహస్యపరిశిష్టము—పు. (734)

"మామతమున నిస్సందేహము నివృత్తియగుటకు మార్గ మొక్కటియే యున్నది. బ్రహ్మసూత్రములను రచించినవారే మూలభారతమును గీతలనుకూడ ప్రకృతమున్నరీతిగ రచియించినా రందుమేని యేమియు విరోధ ముండనేరదు. బ్రహ్మసూత్రములను వ్యాససూత్రము లని చెప్పుట పరిపాటియై యున్నది" "శేషత్వా త్పురుషార్థవాదోఽథాన్యే ష్వితి జైమినిః" అను వేదాంతసూత్రముయొక్క-శాంకరభాష్యమునకు టీక జేయుచు 'జైమిని వేదాంతసూత్రకారులగు వ్యాసులకు శిష్యుడని యానందగిరి చెప్పెను. మఱియు నారంభమందు చేసిన మంగళాచరణములో సైతము "శ్రీమద్వ్యాసపయోనిధి ర్నిధిరసౌ" అని బ్రహ్మసూత్రములను వర్ణించెను... ఈవిషయములను మనస్సున నునిచికొని విచారించితిమేని మూలభారతమునకును, తదంతర్గతగీతలకును, ప్రకృతమునందున్న స్వరూపమును వ్రాయుటయు, బ్రహ్మసూత్రములను రచించుటయు, నను కార్యముల నొక బాదరాయణు లగు వ్యాసులే చేసియుందురని యూహింపవచ్చును"

ఇది. తిలకుగారు గీతారహస్యములో స్పష్టపరచిన సంగతి. యిందులో బ్రహ్మసూత్రకర్త యగు బాదరాయణుడు వ్యాసు డనబడు కృష్ణద్వైపాయనుడే యని నిర్ణయింపబడినదికదా. రెండవదానిని జూడుడు—

ఆంధ్రబ్రహ్మసూత్రభాష్యపీఠిక—"ఏదియెట్లున్నను సంప్రదాయజ్ఞులగు భాష్యవ్యాఖ్యాతలు సూత్రకర్త వ్యాసులే యనిచెప్పుటచేతను, పౌరాణికులును వ్యాసబాదరాయణ లొక్కరే యని వ్యవహరించినట్లు కాన్పించుటచేతను వారిద్దరు నొక్కరే యనునిర్ణయము చేయవలసియున్నది"

ఇది మల్లయ్యశాస్త్రిగారి పీఠిక. దీనిలోగూడ వ్యాసబాదరాయణు లొక్కరే యని నిర్ణయింపబడినదికదా! ఈగ్రంథములు రెండును బ్రహ్మసూత్రములు వ్యాససూత్రములే యని చెప్పుచుండ వ్యాససూత్రములు కావని చెప్పుచున్నవని వంచకులై యెంత యన్యాయముగా వ్రాసిరో చూడుడు.

వీరు 27-12-45 తేదీనుండి ఆంధ్రపత్రికలో 'బాదరాయణుడు వ్యాసుడు కాడు' అను పేరుతో వ్యాసములు ప్రకటించినారు. ఆవ్యాసములలోని విషయము లసంగతము లని నిరూపించుచు 'కల్పవల్లి' 'దివ్యవాణి' పత్రికలలో ప్రకటించితిని. తరువాత 4-5-47 తేదీ శ్రీఅన్నవరదేవస్థానమున విద్వత్సభలో సభ్యుల కోరికపై ముగ్గురు మధ్యవర్తులను పురస్కరించుకొని వాదోపవాదతత్త్వనిర్ణయము చేయసంకల్పింపబడినది. అప్పుడు ఆంధ్రపత్రికలో బ్రకటించిన వ్యాసములనే వారు చదువగా, నే ప్రకటించిన ఖండనవ్యాసములు నేను చదివి యాపై యనేకప్రమాణములను గూడ నప్పుడు ప్రదర్శించితిని. ఆవాదోపవాదముల స్వరూపము, ఆమధ్యస్థుల తీర్మానములు 'బ్రహ్మసూత్రకర్తృనిర్ణయము' అను గ్రంథమున విశదము కాగలవు. కనుక బ్రహ్మసూత్రకర్త వేదవ్యాసమహర్షియే యనుటకు మనకు ప్రమాణము ప్రతివాదులు పరిగ్రహించిన గ్రంథములే యగుటచే నితోఽధికనిరూపణముతో బనిలేకయే ప్రతివాదుల వ్రాత నిరస్తమైనది.

—♦వ్యాసభగవానుని ఘనత♦—

మనమిప్పుడొకసారి వ్యాసభగవానుని ఘనత ననుసంధింతము. వేదవిభాగము జేసెను; బ్రహ్మసూత్రములు నిర్మించెను; అష్టాదశమహాపురాణములు రచించెను; మహాభారతము ననుగ్రహించెను; తన యనన్యసాధారణతపశ్శక్తిచే ధృతరాష్ట్రాదులకు యుద్ధమృతుల జూపి పరస్పరసంభాషణాదుల జరిపించెను; జాత్యంధునకు దృష్టి నప్పుడను గ్రహించెను; సంజయునకు యుద్ధభూమియందలి యావద్వృత్తాంతము కర

తలామలకముగా దెలిసికొనునటులు దివ్యదృష్టి బ్రసాదించెను; గాంధారికి బుత్రశతోత్పత్తి వరమిచ్చెను;బహిర్యాతమై,యగోచరమై,యతికఠినమై యున్న మాంసపేశిని శీతోదకసేచనముతో నంగుష్ఠపర్వప్రమాణముగా విభజించి దుర్యోధనాదులనుత్పాదింపజేసెను; ఎప్పటికప్పుడు తనయోగశక్తిచే బ్రత్యక్ష మగుచు వచ్చెను. పరాశరపుత్రుడై, యాజన్మసిద్ధుడై, స్వయంప్రతిభాతవేదమంత్రవిరాజితుడై, బ్రహ్మర్షియై, శ్రీహరి యవతారమై, జీవన్ముక్తుడై, లోకోద్ధరణదీక్షాధురంధరుడై, దీనావన తత్పరుడై, త్రికాలజ్ఞాననిధియై విలసిల్లెను. ఇట్టి మునిజనమూర్ధన్యుని ఇట్టి జగద్వంద్యుని, యీప్రతివాదు లేమని నిందించిరో యిపుడొక్కసారి మనము స్మృతిపథమునకు దెచ్చుకొందము.

— ♦ప్రతివాదివైఖరి♦ —

వ్యాసుడు నిషాదు డనిరి; చండాలజాతిజు డనిరి. రాణివాసము జేరి రాణుల గూడినా డనిరి; దుర్వాసనకలవా డనిరి; మఱియొకప్పుడును స్త్రీలోలుడే యనిరి; ధర్మప్రతిపాదకస్వభావుడు కాడనిరి; కాశీప్రభువుచే కాశీనుండి తఱుమబడె ననిరి; కాశీలో భిక్షకూడ దొరకలే దనిరి; దుర్యోధనాదుల భార్యలను పతిలోకము కలుగు నని నమ్మించి గంగలో బ్రవేశపెట్టె ననిరి; భారతమును పాండవపక్షము గా వ్రాసినా డనిరి; తాను సంకీర్ణజాతివాడు కనుక సంకీర్ణజాతివారగు పాండవులకు దోడ్పడినా డనిరి; కౌరవపాండవుల న్యాయాన్యాయములు వ్యత్యస్తము జేసి భారతము వ్రాసినా డనిరి; దుర్యోధనుని యందీర్ష్య కలవా డనిరి; ఆయీర్ష్యను గాంధారియందుకూడ జూపి యామె గర్భతాడనము జేసికొన్న దని వ్రాసినా డనిరి; గాంధారీపుత్రుల కపార్థ మిచ్చు నామములను పెట్టినా డనిరి; బ్రహ్మసూత్రకర్త యీతడు కాడనిరి; పురాణము లీతడు రచించినవి కావనిరి.

ఈసంద లన్నియు ప్రమాణోపపత్తులతో, స్వవచనవ్యాఘాతములతో, స్వోదాహృతవచనవిరోధములతో నిరాకృతము లయినవి.

మహర్షితత్త్వము, మ. భా. చ. కారుల మతిరాహిత్యము అభివ్యక్తమయినది.

ఈప్రస్తావములో మహాభారతవచనములు కొన్ని స్మృతికి వచ్చుచున్నవి.

"అన్యాన్ పరివదన్ సాధు ర్యథా హి పరితప్యతే।
తథా పరివద న్నన్యాం స్తుష్టో భవతి దుర్జనః॥
అభివాద్య యథా వృద్ధాన్ సన్తో గచ్ఛన్తి నిర్వృతిమ్।
ఏవం సజ్జన మాక్రుశ్య మూర్ఖో భవతి నిర్వృతః॥
అతో హాస్యతరం లోకే కించి దన్య న్న విద్యతే।
యత్ర దుర్జన ఇత్యాహ దుర్జన స్సజ్జన స్స్వయమ్॥
సత్యధర్మచ్యుతా త్పుంసః క్రుద్ధా దాశీవిషాదివ।
అనాస్తికోఽప్యుద్విజతే జనః కిం పున రాస్తికః॥" (ఆది. అ. 74)

టీ. అనాస్తికః= ఆస్తికా ద్భిన్నః;

ఇతరులను నిందించి సజ్జను డెంత పరితపించునో, దుర్జను డితరుల నిందించి యంత సంతోషించును. పెద్దలకు నమస్కరించి సజ్జను లెంత యానందింతురో, సజ్జనుల నిందించి దుర్జను డంత యానందించును. దుర్జనుడు సజ్జనుని దుర్జను డని చెప్పుచుండును. ఇంతకంటె లోకమం దపహాసపాత్రము మరియొకటి లేదు. క్రోధము కల విషసర్పమువలన భయపడినట్లు సత్యమును, ధర్మమును విడిచిపెట్టిన మనుజునివలన నాస్తికుడు కూడ భయపడుచుండును. ఆస్తికుని మాట నిక నేమి చెప్పవలయును? అని భావము. వేదవ్యాసభగవానుని దిగంతవిశ్రాంతమైన యశస్సును తిరస్కరింప బూనిన ప్రతివాదుల చర్యయెట్టిదో తెలియుటకై యీసంక్షేపశారీరకాచార్యసూక్తి నవలోకింపుడు-

'మహామహిమ్నా మపి యశ్చికీర్షతి
స్వభావసంశుద్ధతరం తిరో యశః।
స నూన మాచ్ఛాదయితుం సమీహతే
వివస్వతో హ స్తతలేన మండలమ్॥"

స్వభావసిద్ధమై, అతిసంశుద్ధమై యున్న మహామహిమ కలవారల యశస్సు నెవ్వఁడు తిరస్కరింపఁదలచునో వాఁడు- జగత్ప్రకాశకమైన సూర్యమండలమును గప్పివేయుటకై తన యరచేతిని యడ్డుపెట్టుటకు దలపెట్టిన వాఁడగును అని భావము.

ఈప్రతివాదులు వేదవ్యాసభగవానుని నిందించుట, ప్రమాణగ్రంథములను తిరస్కరించుట, విద్వన్మార్గమును ద్వేషించుట, మొదలగు చర్యలు చూడఁగా "సుభాషితరత్నభాండాగారములోని యొకమహాకవిసూక్తి జ్ఞప్తికి వచ్చుచున్నది.

"వ్యాసాదీన్ కవిపుంగవా ననుచితై ర్వాక్యైః స్సలీలం హస
న్నుచ్చై ర్జల్ప నిమీల్యలోచనయుగం శ్లోకాన్ సగర్వం పఠ।
కావ్యం ధిక్కురు యత్పరైర్విరచితం స్పర్ధస్వ సార్ధం బుధైః
య ద్యభ్యర్థయసే శ్రుతేన రహితః పాండిత్య మాప్తుంబలాత్"

ఓజనుఁడా! చదువులేని నీవు పాండిత్యమును బలాత్కారముగా సంపాదింప గోరెదవేని యీయుపాయముల నాశ్రయింపుము. ఏవనగా. వ్యాసాదికవిపుంగవులను నవ్వుచు నిర్లక్ష్యముగా ననుచితప్రసంగములకు పాలుచేయుము. (అనగా నిందింపుము) కన్నులుమాసికొని యేవో శ్లోకములను గర్వముతో జదువుము. అన్యులు రచించిన గ్రంథములను ధిక్కరింపుము. విద్వాంసులతో స్పర్ధ కలిగియుండుము. ఇట్లు చేయుదువేని విద్య లేకపోయినను నీవు పండితుఁడ వనిపించుకొనగలవు. అని తాత్పర్యము.

'బాలవ్యాస న్యాయవ్యాకరణవేదాంతవిద్యాప్రవీణ' వారణాసి
సుబ్రహ్మణ్యశాస్త్రిప్రణీతమైన, మహాభారతతత్త్వకథనమున వేదవ్యాసనిందానిరాకరణ మనెడి
ద్వితీయభాగము.